


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




## మెగా డీఎస్సీ పారదర్శకం

- సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలు అవాస్తవం
- పాఠశాల విద్యా శాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా

- వివరాలు 8 లో..




# చట్టం చేస్తున్నాం... బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

- చేనేతలకు మేలు చేసేది, అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే
- ఆర్థిక కష్టాలున్నా సంక్షేమం - అభివృద్ధిలో రాజీపడడం లేదు
- 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు
- చీరాలలో 'నేతన్న సేవలో' పథకం ప్రారంభం
- కుటుంబానికి రూ.25 వేలు చొప్పున 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లు జమ

2



రాష్ట్రంలోని బీసీ సామాజికవర్గాల సంరక్షణ బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని, వారి భద్రత కోసం త్వరలోనే బలమైన చట్టాన్ని తీసుకువస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. చేనేతలకు మేలు చేసేది, అండగా నిలిచేది తమ ప్రభుత్వమే అన్నారు. శుక్రవారం బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట గ్రామంలో నిర్వహించిన 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'నేతన్న సేవలో' సంక్షేమ పథకాన్ని ప్రారంభించిన సీఎం, అర్హులైన 71,536 చేనేత కుటుంబాల ఖాతాల్లో రూ.179కోట్ల ఆర్థిక సాయాన్ని జమ చేశారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధి విషయాల్లో ప్రభుత్వం ఎక్కడా రాజీపడదని స్పష్టం చేశారు. చీరాలను 'మినీ ముంబై'గా తీర్చిదిద్ది చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

## టీడీపీకి కార్యకర్తలే అసలైన పునాది

- స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- చీరాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం




'తెలుగుదేశం పార్టీ విజయం వెనుక ఉన్న అసలైన పునాది కార్యకర్తలేనని, వారి కష్టార్జితమే పార్టీని మళ్లీ అధికారంలో నిలిపింది అని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమై 2024 ఎన్నికల్లో చూపిన పట్టుదల, క్రమశిక్షణతో పార్టీకి ఘన విజయం అందించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

- వివరాలు 5 లో..

## మరింత వేగంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

- 12 రోజుల్లో 33.65 లక్షల ఇళ్లకు చేరుకున్న పార్టీ శ్రేణులు
- ఒక్కరోజులోనే అత్యధికంగా 3.42 లక్షల ఇళ్ల సందర్శన
- కూటమి రెండేళ్ల పాలనలో విజయాలను వివరిస్తున్న నాయకులు, కార్యకర్తలు

- వివరాలు 7 లో..

## గిరిజన గ్రామాలు... 'అడవి తల్లి' బాటలు



10

- డిప్యూటీ సీఎం నిరంతర పర్యవేక్షణలో స్పష్టమైన పురోగతి
- పెండింగ్ పనులపై వివిధ శాఖల అధికారులతో పవన్‌కల్యాణ్ సమీక్ష

## నేతన్నల బాగుకోరే ప్రభుత్వం మాది

- అర్హులందరికీ 'నేతన్నల సేవలో'
- హామీ ఇవ్వకున్నా ఏటా రూ.25వేలు ఇస్తున్నాం
- రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత

7





8


## విజయ డెయిరీ చైర్మన్ పదవికి చలసాని ఆంజనేయులు రాజీనామా

## ఈ నెల్లోనే వెలిగొండకు కృష్ణా జలాలు

- పూర్తి కావొచ్చిన టీబీఎం తొలగింపు పనులు
- రెండు విడతల్లో నిర్వాసితులకు రూ.600 కోట్ల పరిహారం
- మిగిలిన పనుల పూర్తికి యాక్షన్ ప్లాన్
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

6





# చట్టం చేస్తున్నాం...

# బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

- చేనేతలకు మేలు చేసేది, అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే
- ఆర్థిక కష్టాలున్నా సంక్షేమం-అభివృద్ధిలో రాజీపడడం లేదు
- కుటుంబానికి ఇల్లు... రాష్ట్రానికి రాజధాని అవసరం
- మాది బ్రాండ్ ఇమేజ్... వాళ్లది బ్యాడ్ ఇమేజ్
- జెన్-జీ అభివృద్ధి కోరుకుంటోంది... జనరేషన్ గొడ్డలి కుట్రలు పన్నుతోంది
- 44 ఏళ్లు వస్తే వయసైపోయినట్టా?
- 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు
- చీరాలలో 'నేతన్న సేవలో' పథకం ప్రారంభం
- కుటుంబానికి రూ.25 వేలు చొప్పున 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లు జమ




చీరాల (చైతన్యరథం): బీసీల సంరక్షణ బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని... దీనికోసం త్వరలోనే చట్టం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని వెల్లడించారు. 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రప్రభుత్వం రూపొందించిన 'నేతన్న సేవలో' సంక్షేమ పథకాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ.25వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. మొత్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం చంద్ర బాబు విడుదలచేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడారాజీపడట్లేదని వెల్లడించారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రలపట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని... ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... 'స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలనే 'నేతన్న సేవలో' పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి ఈ పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం... ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. చేనేత రంగంపై ఆధారపడి 1.27 లక్షల మంది జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు... ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్ లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4వేల చొప్పున నెలకు రూ.35కోట్లు ఇస్తున్నాం. ఏడాదికి రూ.420 కోట్లు ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది." అన్నారు.

## బీసీలకు అండగా...

"బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతో పాటు... రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది. బీసీల సంక్షేమంలో భాగంగా వివిధ వర్గాలు అన్ని రకాలుగా అభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20వేల చొప్పున రెండేళ్లలో రూ.505కోట్లు ఇచ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు బీసీలకు 3కిలో వాట్లకు అదనంగా రూ.20వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాష్ట్రంలో అందరికీ రూ.2.5లక్షల చొప్పున యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకువస్తున్నాం. అభివృద్ధితో పాటు సంక్షేమం, సుపరిపాలన అందించేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. పేదలు భోజనానికి ఇబ్బందిపడకుండా రూ.5కే అన్న క్యాంటీన్లో భోజనం అందిస్తున్నాం. కొందరు వ్యక్తులు దీనికీ అడ్డంపడి అన్న క్యాంటీన్లను ఎత్తేశారు. విద్య అందరికీ అందాలన్న లక్ష్యంతో 'తల్లికి వందనం' పథకం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ..వారి తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నాం. సంక్షేమంతోపాటు అభివృద్ధిపైనా శ్రద్ధ పెడుతున్నాం. గత పాలనలో రోడ్లన్నీ గుంతలే. మన రాష్ట్రాన్ని చూసి ఎగతాళి చేశారు... ఇప్పుడు రోడ్లకు మరమ్మతులు చేశాం. పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాం...రూ.12లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఇప్పటికే గ్రౌండ్ అయ్యాయి. యువతకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తున్నాం... అభివృద్ధి-ఉపాధి కల్పించేలా పారిశ్రామికాభివృద్ధి చేస్తున్నాం. రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాలు కూడా రాష్ట్రంలో నిర్మించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. గత పాలకుల నిర్వాకం వల్ల ఆర్థిక ఇబ్బందులున్నా... గడిచిన రెండేళ్లలో పేదలను ఆదుకునేందుకు రూ.1.50 లక్షల కోట్లు సంక్షేమం చేశాం. అభివృద్ధి కోసం రెండేళ్లలో రూ.1.34 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రోడ్లు సహా ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

## కుటుంబానికి ఇల్లు... రాష్ట్రానికి రాజధాని

"గత పాలనలో రాజధాని లేకుండా చేశారు... రాష్ట్రం పేరు చెప్తే ఇతర ప్రాంతాల్లో చులకన అయ్యేలా చేశారు. అద్భుతమైన నగరం ఉండాలనే అమరావతిని నిర్మిస్తున్నాం. రాజధానిపై గత పాలకులు నాలుక మడతపెట్టారు. మూడు ముక్కలాట ఆడారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. దేశంలో ఏ రాష్ట్రమైనా తమ రాజధాని నగరాలను ఘనంగా చెప్పుకుంటున్నాయి. గత పాలనలో రాజధానే లేకుండా పోయింది. కూటమి అధికారంలోకి వచ్చాక అమరావతి పనులు రీస్టార్ట్ చేశాం. ఆగస్టు 13న రాజధానిలోని ప్రధాన రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం అవుతుంది. వేగంగా జరుగుతున్న పనులు చూసి రాజధానిపై మళ్లీ కుట్రలు పన్నుతున్నారు. మావిగన్, వాటికన్ అంటూ ఏవోవో చెప్తున్నారు. మళ్లీ మూడు ముక్కలాట కావాలా...? రాజధానిని విధ్వంసం చేసుకుంటామా..?కుటుంబానికి ఇల్లు, రాష్ట్రానికి రాజధాని అవసరం. గత ప్రభుత్వం రాష్ట్ర పరువును తీసేసింది. ఇమేజ్‌ను దారుణంగా దెబ్బతీసింది. కూటమి వచ్చాక ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించాం. పెట్టుబడులు తీసుకువచ్చి పరిశ్రమల్ని ఏర్పాటు చేయిస్తున్నాం. వాళ్లది బ్యాడ్ ఇమేజ్... మాది బ్రాండ్ ఇమేజ్. కోర్టు కేసులు వేసి అడ్డుకున్నా మెగా డీఎస్సీ ద్వారా 16వేల ఉద్యోగాలు ఇచ్చాం. ఏడాదిన్నర తర్వాత ఇప్పుడు మళ్లీ పేపర్ లీక్ అంటూ కుట్ర రాజకీయాలు చేస్తున్నారు. కోర్టు చీవాట్లు పెట్టినా... మళ్లీ ధర్నాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కల్పిస్తూ వేధిస్తున్నారు. జెన్-జీ యువత అభివృద్ధిని కోరుకుంటోంది. కానీ గొడ్డలి జనరేషన్‌కు చెందిన కొందరు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. వీళ్లది గొడ్డలి జె. అభివృద్ధిని అడ్డుకునేలా చేసే అరాచకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. కఠిన చర్యలకు వెనుకాడం." అని చంద్రబాబు చెప్పారు.

## కుట్రలను గమనించాలి... కుట్రదారులను దూరంపెట్టాలి

"గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను, నేరాలు, ఘోరాలు చేసే వ్యక్తుల్ని ప్రోత్సహిస్తూ కొందరు అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. యాక్సిడెంట్ చేస్తే గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్లాలి... కానీ ఆధారాలు తారుమారు చేసేసి, వ్యక్తులను మార్చేసి కుట్రలుచేసి కేసు మాఫీ చేసేందుకు ప్రయత్నించారు. 44ఏళ్ల వ్యక్తి చనిపోతే ఇబ్బందేమిటని మాట్లాడతారు. ఇదెక్కడి విడ్డూరం...ఇలాంటి వారిని ఏమనాలి..? పరామర్శల కోసం గంటలపాటు రోడ్లనునిర్బంధించి వెకిలి చేష్టలు చేస్తున్నారు. శాంతి భద్రతలను కాపాడే మహిళా పోలీసు అధికారుల విషయంలోనూ అసభ్యంగా ప్రవర్తించారు. మహిళా పోలీసుల అధికారులను కూడా గొడ్డలి గ్యాంగ్ వేధిస్తోంది. పొగాకు రైతులను పలకరించేందుకు వెళ్లి అక్కడ అరాచకం సృష్టించారు. రౌడీయిజం చేస్తూ రప్పా రప్పా అంటూ రోడ్డుపైకి వచ్చి అడ్డంపడుతున్నారు. బ్రాందీ షాపుల్లో మద్యం తాగి బట్టలు విప్పి అరాచకం సృష్టిస్తున్నారు. గంజాయి బ్యాచ్ అంతా పొగాకు నాశనం చేసింది. వారికి రైతుల ఆవేదన పట్టడం లేదు. ఓ దుకాణాన్ని కూడా ధ్వంసం చేశారు. ఓవ్యక్తి వీళ్ల కుమ్ములాటలో గాయపడి ఆస్పత్రిలో చనిపోయారు. సభ్యతగా వ్యవహరించాల్సిన కొన్ని రాజకీయ పార్టీలు అసభ్యంగా, బాధ్యతా రాహిత్యంతో ప్రవర్తిస్తున్నాయి. గత పాలనలో అంతా అరాచకం రాజ్యమేలింది. ఇప్పుడు ప్రజలకు ఆ పరిస్థితి లేదు. కుట్రలను ప్రజలు గమనించాలి... కుట్రదారులను దూరం పెట్టాలి. ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలి." అని సీఎం కోరారు.

## 'మినీ ముంబై' చీరాలకు పూర్వవైభవం తెస్తాం

"చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నాం. స్వదేశ్ దర్శన్ నిధులు రూ.97 కోట్లతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం." అని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రసంగం అనంతరం బాపట్ల జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికారుల పనితీరుపై తన వద్దనున్న నివేదికను ప్రజలకు చదివి వినిపించారు. చక్కగా పనిచేసిన వారిని ప్రజలు అభినందించాలని సూచించారు. సంతృప్తికరంగా పని చేయని అధికారులను పనితీరు మరింత మెరుగుపరుచుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ స్టాళ్లను సందర్శించారు. సీబీఎన్ జీవిత చరిత్రను ఆవిష్కరిస్తూ మహతి అనే యువతి 40 పెన్సిళ్లతో రూపొందించిన మైక్రో ఆర్ట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. బాపట్ల, సూర్యలంక సహా జిల్లాలోని వివిధ బీచ్‌ల సమాచారాన్ని ప్రజలకు అందించేలా రూపొందించిన బే ఆఫ్ బాపట్ల వెబ్‌సైట్, హ్యాండ్ బుక్‌లను సీఎం విడుదల చేశారు. బాపట్ల లీప్స్ పేరుతో వివిధ రంగాల్లో యువతకు అందించే శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేనేతరంగ అభివృద్ధికి సంబంధించి ఫ్యాబ్‌ఇండియా సహా నాలుగుసంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



చైతన్యరథం

# ‘నేతన్న సేవలో’ చంద్రబాబు

## చీరాలలో ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులు, అధికారుల ఘన స్వాగతం



చీరాల (చైతన్యరథం): 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్త పేట గ్రామంలో శుక్రవారం జరిగిన కార్య క్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఆయనకు మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, పార్ధసారధిలతో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ‘నేతన్న సేవలో’ పథకం ప్రారంభోత్సవం అనంతరం వేదిక వద్ద ఆప్కో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సీఎం సందర్శిం చారు. బాపట్ల,సూర్యలంక సహా జిల్లాలోని వివిధ బీచ్‌ల సమాచారాన్ని ప్రజలకు అం దించేలా రూపొందించిన బే ఆఫ్ బాపట్ల వెబ్‌సైట్, హ్యాండ్ బుక్‌లను విడుదల చేశారు. బాపట్ల ‘లీప్స్’ పేరుతో వివిధ రంగాల్లో యువతకు అందించేశిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేనేత రంగ అభివృద్ధికి సంబంధించి ఫ్యాబ్ ఇండియా సహా నాలుగు సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు.






























# జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు మరింత విశిష్టత

## ఉచిత విద్యుత్, రూ.25వేల ఆర్థిక సాయంతో ఊరట - సీఎం చంద్రబాబుతో ముఖాముఖిలో చేనేత కుటుంబాలు





చీరాల (చైతన్యరథం): వన్ డిస్ట్రిక్ట్- వన్ ప్రొడక్ట్ ద్వారా కుప్పడం పట్టుచీరలకు మరింత విశిష్ట గుర్తింపు లభించిందని, జీఐ ట్యాగ్‌తో అమ్మకాలు 30శాతం మేర పెరిగాయని చేనేత కుటుంబాలు సీఎం చంద్రబాబుతో అన్నారు. గత ఏడాది చీరాలలో తయారైన కుప్పడం పట్టుతోపాటు అత్యుత్తమ వృత్తి నైపుణ్యానికి కేంద్ర ప్రభుత్వ అవార్డు దక్కడం గర్వ కారణమన్నారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు 'నేతన్న సేవలో' పథకాన్ని చీరాల నియోజకవర్గం కొత్తపేటలో ప్రారంభించారు. ఆ గ్రామంలోని ఓ చేనేత మగ్గం యూనిట్‌ను సందర్శించారు. చేనేత మగ్గం వద్దకు వచ్చిన ముఖ్యమంత్రికి చేనేత యూనిట్ యజమాని బండారు బాలసుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. అనంతరం చేనేత కార్మికులతో సీఎం మాట్లాడారు. కుప్పడం పట్టు చీరల ప్రత్యేకత, సంప్రదాయ నేత వృత్తి నైపుణ్యం, మార్కెట్ పరిస్థితులపై వారితో చర్చించారు.

### ప్రభుత్వ సాయం మాకు కొండంత అండ: చేనేత కార్మికులు

చేనేతల జీవనోపాధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై చేనేత వర్క్‌షాప్‌లోని కార్మికులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వర్క్‌షాప్ ఏర్పాటుకు దారితీసిన ఆలోచన, యూనిట్ స్థాపన, ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించి తీర్చిదిద్దిన తీరు, యూనిట్‌ను సమర్థంగా నడిపిస్తున్న అంశాన్ని వారు సీఎంకు వివరించారు.  ముందుగా కంచి బోర్డర్ చీరల తయారీదారు బత్తా ధనుంజయరావుతో ముఖ్యమంత్రి మాట్లాడారు. కుటుంబ పరిస్థితులు, చేనేత వృత్తి, ఉత్పత్తి వ్యయం, ఆదాయం, మార్కెటింగ్, విక్రయాల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఎంతో ఉపయోగ పడుతోందని, రూ.25వేల ఆర్థిక సాయం తమకు ప్రోత్సాహంగా ఉంటోందని వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి బండారు బాలసుబ్రహ్మణ్యంతో కలిసి వర్క్‌షాప్‌లోని తొలి అంతస్తును పరిశీలించారు. భవనాన్ని విస్తరించి మరిన్ని మగ్గాలు ఏర్పాటు చేసి మరింత మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న ప్రణాళికలను ఆయన సీఎంకు వివరించారు. కొవిడ్ కారణంగా నిలిచిపోయిన విస్తరణ పనులను తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో పని చేస్తున్న ఇతర చేనేత కార్మికులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. బొడ్డు అరుణ అనే మహిళ మగ్గంపై చీర నేస్తున్న తీరును సీఎం ఆసక్తిగా పరిశీలించారు. ప్రభుత్వం అందించిన రూ.25వేల ఆర్థిక సాయం తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యిందని మొబైల్ ఫోన్లలో వచ్చిన  సంక్షిప్త సందేశాన్ని కార్మికులు ముఖ్యమంత్రికి చూపించారు. ప్రభుత్వ సహకారంతో తమ జీవనోపాధికి భరోసా లభించిందని చేనేతలు సంతోషం వ్యక్తం చేశారు.







చైతన్యరథం

# అవ్వా కులాసానా!

## 90ఏళ్ల వృద్ధురాలికి సీఎం చంద్రబాబు ఆత్మీయ పలకరింపు



చీరాల (చైతన్యరథం): "తనను కలవాలని, ఒక్క ఫొటో దిగాలని" సోషల్ మీడియా ద్వారా ఆశపడిన ఓ 90 ఏళ్ల అవ్వ కోరికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నెరవేర్చారు. చీరాల మండలం రామకృష్ణాపురానికి చెందిన వయో వృద్ధురాలు కొమ్మాలపాటి పుష్పావతిని సీఎం ప్రత్యేకంగా కలిశారు.

చీరాలకు చెందిన 90 ఏళ్ల పుష్పావతి సీఎం చంద్రబాబును కలవాలని ఆకాంక్ష వ్యక్తం చేసింది. దీనికి సంబంధించిన వీడియోను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేయగా అది వైరల్ అయ్యింది. ఈ విషయం సీఎం దృష్టికి వెళ్లడంతో... "చీరాల వచ్చినప్పుడు నిన్ను తప్పకుండా కలుస్తానమ్మా" అని గతంలోనే 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన రీ-ట్వీట్ చేశారు. మాట ఇచ్చినట్లే చీరాల పర్యటనలో పుష్పావతిని వేదిక వద్దకు ప్రత్యేకంగా పిలిపించుకున్నారు. ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆప్యాయంగా ఫొటో దిగారు. అనుకోకుండా లభించిన ఈ గౌరవానికి అవ్వ ఎంతో సంతోషం వ్యక్తం చేసింది. తన జీవితకాల కోరిక నెరవేరిందని సంబరపడింది.

# చేనేత వస్త్రంపై చంద్రబాబు చిత్రం

## నాగేశ్వరరావు-లక్ష్మి దంపతులకు సీఎం ప్రశంస



చీరాల (చైతన్యరథం): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లాకు చెందిన చేనేత దంపతులు తమ అద్భుతమైన నైపుణ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై ఉన్న అభిమానాన్ని వినూత్నంగా చాటు కున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం లావేరు గ్రామంలోని పెద్ద వీధికి చెందిన బాసిన నాగేశ్వరరావు-లక్ష్మి దంపతులు సుమారు నెల రోజులు రేయింబవళ్లు శ్రమించి మగ్గంపై సీఎం ముఖచిత్రాన్ని ఆవిష్కరించారు. ఓ ప్రత్యేక శాలువాపై అత్యంత ప్రతిభతో చంద్రబాబు రూపాన్ని మగ్గంపై దారాల అమరికతో నేసి ఆయనకు బహూకరించారు. చేనేత కళాకారుల ప్రతిభను, వారి శ్రమను ముఖ్యమంత్రి మనసారా అభినందించారు. చేనేత వృత్తికి పూర్వవైభవం తీసుకురావడానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసానిచ్చారు.



# తప్పు చేసిన వారిని ఉపేక్షించొద్దు

- **మెడికోలను ఢీకొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోండి: సీఎం**
- **బాధితుల ఆరోగ్య పరిస్థితిపై చంద్రబాబు ఆరా**

అమరావతి (చైతన్యరథం): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మెడికోలను కారుతో ఢీకొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. బాధిత మెడికోలు ప్రియాంక, ఉమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. మెడికోలు తీవ్రంగా గాయపడడం బాధాకరమన్నారు.

మద్యం మత్తులో ఇద్దరు మెడికోలను కారుతో ఢీకొట్టి పరారయ్యారని అధికారులు సీఎంకు వివరించారు. ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్టు చేశామని చెప్పారు. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. మెడికో ప్రియాంక ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సీఎం సూచించారు. బాధిత మెడికోలకు అవసరమైన వైద్య సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# చేతులు కలుపుదాం... చేనేత కళను కాపాడదాం

**- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**



అమరావతి (చైతన్యరథం): 'జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు శుభాకాంక్షలు. భారతీయ సంస్కృతిని చాటే చేనేతకళను ముందుకు తీసుకెళ్తున్న చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. విద్యుత్ రాయితీలు, 50 ఏళ్లకే పింఛన్ అందిస్తూ నేతన్నలకు దన్నుగా నిలుస్తున్నాం.చేనేతల సంక్షేమాన్ని, వృత్తి వారసత్వాన్ని పరిరక్షించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. కొత్తగా ప్రారంభించిన 'నేతన్న సేవలో' పథకంలో భాగంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లు అందించాం.అంతా చేతులు కలుపుదాం... చేనేత కళను కాపాడదాం.' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా పిలుపునిచ్చారు.

# చేనేత ఉత్పత్తులను ఆదరిద్దాం... చేనేత కళను భావితరాలకు అందిద్దాం

**- మంత్రి నారా లోకేష్**



అమరావతి (చైతన్యరథం): 'జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కళాకారులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. మన దేశ గొప్ప సాంస్కృతిక వారసత్వానికి చేనేత రంగం ప్రతీకగా నిలుస్తోంది. మన కళాకారుల నైపుణ్యంతో రూపుదిద్దుకునే వస్త్రాలుప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయి. వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి జీవనోపాధి కల్పిస్తున్న రంగాల్లో చేనేత ఒకటి. చేనేత కార్మికులకు అండగా నిలిచేందుకు ప్రజా ప్రభుత్వం'నేతన్న సేవలో' కార్యక్రమం కింద ఏడాదికి రూ.25వేలచొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది. మంగళగిరి చేనేతకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు వీవర్స్‌శాలను ఏర్పాటుచేశాం. మనమందరం చేనేత ఉత్పత్తులను ఆదరిద్దాం. వాటి వినియోగాన్ని ప్రోత్సహిద్దాం. మన నేతన్నలకు అండగా నిలిచి, చేనేత కళను భావితరాలకు అందిద్దాం.' అంటూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# టీడీపీకి కార్యకర్తలే అసలైన పునాది

**స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలి**

**ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు**

**చీరాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం**





చీరాల (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తలే అసలైన పునాది అని, వారి కష్టార్జితంతోనే పార్టీ ఈ రోజు అధికారంలోకి వచ్చిందని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అంతర్గత అంశాలు, ఇటీవల నిర్వహించిన సభ్యత్వ నమోదుపై క్షుణ్ణంగా సమీక్షించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియలో రాష్ట్రంలో చీరాల నియోజకవర్గానికి 97వ ర్యాంక్ రావడంపై స్పందించిన ఆయన నమోదు వేగాన్ని మరింత పెంచాలని నాయకులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏ రకమైన పట్టుదల, క్రమశిక్షణతో పని చేశారో అదే స్ఫూర్తితో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ ఘన విజయం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు.



చైతన్యరథం



# ఆగస్టులోనే వెలిగొండకు కృష్ణా జలాలు

- **పూర్తి కావొచ్చిన టీబీఎం తొలగింపు పనులు**
- **రెండు విడతల్లో నిర్వాసితులకు రూ.600 కోట్ల పరిహారం**
- **మిగిలిన పనులు పూర్తికి యాక్షన్ ప్లాన్**
- **జలవనరుల మంత్రి నిమ్మల**



విజయవాడ (చైతన్య రథం): ఫ్లోరైడ్ బాధిత, వెనుకబడిన ప్రకాశం జిల్లాకు మూడు దశాబ్దాల కలగా ఉన్న వెలిగొండ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ ఆగస్టు కృష్ణానెలలోనే కృష్ణా జలాలు తీసుకెళ్ళేందుకు చర్యలు వేగవంతం చేసిందని రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టును 2026 ఆగస్టునాటికి పూర్తి చేయాలనే లక్ష్యాన్ని 2024లోనే నిర్దేశించుకున్నామని, ఆ లక్ష్యానికి అనుగుణంగా గత రెండేళ్లలో దాదాపు రూ.3,000 కోట్లు వెచ్చించి రాత్రింబవళ్లు పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోని వివిధ పనులు 90 నుంచి 99 శాతం వరకు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రాజెక్టులో మిగిలిన పనుల పురోగతిపై అధికారులు, ఏజెన్సీలతో శుక్రవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించి, నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి తెలిపారు.

### టన్నెల్ పనులు శరవేగంగా

కొల్లంవాగు నుంచి కృష్ణా జలాలు టన్నెల్‌కు చేరే అప్రోచ్ ఛానెల్ పనులు పూర్తయ్యాయని, హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన గేట్ల పనులు కూడా పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు. టన్నెల్-1, టన్నెల్-2లకు సంబంధించిన 286 మీటర్ల సిసి లైనింగ్ పనులను ఈనెల 18లోగా పూర్తి చేసేలా, ఐదు గ్యాంట్రీలతో ప్రత్యేక షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు. వెలిగొండ టన్నెల్‌లో ఉన్న 1,900 మెట్రిక్ టన్నుల బరువు, 175 మీటర్ల పొడవు కలిగిన టీబీఎం మిషన్‌లో ఇప్పటికే 70 శాతం వరకు తొలగింపు పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన 30 శాతం పనులను కూడా రాబోయే 10 రోజుల్లో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. అయితే, ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనలో టీబీఎంను అంగుళం కూడా కదపలేదని, చుక్క నీరు కూడా బయటకు వెళ్లే పరిస్థితి లేదని, అయినా కూడా జాతికి అంకితం పేరుతో ప్రజలను మోసం, దగా చేశారని దుయ్యబట్టారు.

### ఫీడర్ కెనాల్ పనుల్లో గణనీయమైన పురోగతి

100 క్యూసెక్కుల నీరు వస్తేనే బండ్లు తెగిపోయే పరిస్థితి ఉన్న ఫీడర్ కెనాల్‌ను బలోపేతం చేసేలా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.460 కోట్లు మంజూరు చేసి, ఈ ఏడాది జనవరిలో పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 5.3 కిలోమీటర్ల సీసీ వాల్ పనులు పూర్తయ్యాయని, మొత్తం 11 కిలోమీటర్ల లైనింగ్ పనులను 5 నెలల్లో పూర్తి చేసినట్లు చెప్పారు. ఫీడర్ కెనాల్‌కు సంబంధించిన ఈస్టర్న్ మెయిన్ కెనాల్, సుంకేసుల, గొట్టిపడియ రెగ్యులేటర్ల పనులను 15లోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

ప్రాజెక్టు పూర్తి చేయడానికి అత్యంత కీలకమైన నిర్వాసితులకు రూ.900 కోట్ల పరిహారం ఇవ్వవలసి ఉండగా, ఒక్క నయా పైసా కూడా ఇవ్వకుండా, గత ప్రభుత్వం వారిని అత్యంత చులకనగా చూసిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వెలిగొండ నిర్వాసితులకు అండగా నిలబడి, ఇప్పటికే 2,560 నిర్వాసిత కుటుంబాలకు రూ.318 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన 4,761 కుటుంబాలకు రూ.600 కోట్లను రెండు విడతల్లో అందించనున్నట్లు తెలిపారు. మొదటి విడతగా రూ.300 కోట్లు ఈ వారంలో, మరో రూ.300 కోట్లు రాబోయే మూడు నుంచి నాలుగు వారాల్లో అందించేలా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని మంత్రి పేర్కొన్నారు.

### మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం

గత ఐదేళ్లలో నిలిచిపోయిన వెలిగొండ ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వేగవంతం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నిధులు సమకూర్చడంతో పాటు నిర్వాసితులకు పరిహారం అందిస్తూ, టన్నెల్స్, ఫీడర్ కెనాల్, రెగ్యులేటర్ల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, సలహాదారులు ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, సిఈ రమేష్ బాబు, ఎసఈ అబూతలేం మరియు ఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.




# ఆరోగ్యాంధ్రే ప్రభుత్వ లక్ష్యం

**అన్ని విధాలుగా క్రీడలకు ప్రోత్సాహం : అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవంలో మంత్రి మండిపల్లి**



విజయవాడ (చైతన్య రథం): రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు అనేక విధాలుగా ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి మండిపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయవాడలోని నైట్రో పికిల్‌బాల్ అండ్ కేఫే వేదికగా నేటినుంచి 9వ తేదీ వరకు లీగ్ పోటీలు జరగనున్నాయి. రాష్ట్రంలో పికిల్‌బాల్ క్రీడాభివృద్ధికి లీగ్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, పికిల్‌బాల్ వంటి నూతన క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామోహన్నాయుడు, శాప్ చైర్మన్ రవినాయుడు, సినీహీరో సుశాంత్ పాల్గొన్నారు.



# మరింత వేగంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'

**- 12 రోజుల్లో 33.65 లక్షల ఇళ్లకు చేరుకున్న టీడీపీ శ్రేణులు**

**- ఒక్కరోజులోనే అత్యధికంగా 3.42 లక్షల ఇళ్ల సందర్శన**

**- కూటమి రెండేళ్ల పాలనా విజయాలను వివరిస్తున్న శ్రేణులు**

అమరావతి (చైతన్య రథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం -2 ఏళ్ల నమ్మకం.. అభివృద్ధి.. సంక్షేమం" కార్యక్రమం విజయవంతంగా 12వ రోజుకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పాల్గొంటూ కార్యక్రమాన్ని వేగంగా ముందుకు తీసుకెళు న్నారు. కార్యక్రమంలో భాగంగా 12వ రోజు ఒక్కరోజే 3.42 లక్షల ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించారు. కార్యక్రమం ప్రారంభమైన తర్వాత రోజువారీ ఇంటింటి సందర్శనల్లో వేగాన్ని పెంచుకుంటూ వస్తున్న పార్టీ శ్రేణులు.. దీంతో గత 12 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 33.65 లక్షల ఇళ్లకు టీడీపీ శ్రేణులు చేరుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికీ వివరించారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు తీరును ప్రజలకు వివరించి, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదేశాలు, మార్గనిర్దేశంతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఇన్‌ఛార్జీలు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలను ప్రతి కుటుంబానికి చేరవేయాలనే లక్ష్యంతో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని మరింత వేగంగా, ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నారు.

# నేతన్నల బాగు కోరే ప్రభుత్వం మాది

- **అర్హులైన నేతన్నలందరికీ 'నేతన్నల సేవలో'**
- **హామీ ఇవ్వకున్నా ఏటా రూ.25 వేలు ఇస్తున్నాం**
- **రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**




చీరాల (చైతన్య రథం): అర్హులైన ప్రతి ఒక్క నేతన్నకూ నేతన్నల సేవలో పథకం కింద ఏటా రూ. 25 వేలు అందజేయనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత స్పష్టం చేశారు. చేనేతలు ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా, ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా నేతన్నల సేవలో పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం చీరాలలోని కొత్తపేటలో సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా 12వ జాతీయ చేనేత దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత ప్రసంగిస్తూ... నేతన్నల బాగు కోరుకునే ప్రభుత్వం తమదన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలన చేపట్టిన ప్రతిసారీ చేనేతలకు స్వర్ణయుగమేనన్నారు. ముఖ్యంగా 2014-19 మధ్య నేతన్నల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. 50 ఏళ్లు నిండిన నేతన్నలకు పెన్షన్లు అందజేసిన ఘనత కూడా ఆయనదేనన్నారు. త్రిఫ్ట్ ఫండ్, ముద్రా రుణాలు అందజేశారన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అసమర్ధ పాలనలో చేనేతలు అన్ని విధాలా నష్టపోయారన్నారు. చేనేతల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు అమలు పథకాలను జగన్ నిలిపేశారన్నారు. 2024 ఎన్నికల్లో సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేనేతలకు మంచి రోజులు ప్రారంభమయ్యాయన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా, మేనిఫెస్టోలో పేర్కొనకపోయినా చేనేతలకు ఏటా రూ.25 వేలు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. 73 వేల చేనేతలకు రూ.180 కోట్లు చెల్లిస్తున్నామన్నారు. అర్హులైన నేతన్నలందరికీ నేతన్నల సేవలో పథకం కింద ఆర్థిక సాయం అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సవిత తెలిపారు. ఇటీవలే చీరాలలో చేనేతల జాతిపిత ప్రగట కోటయ్య జయంతిని ఘనంగా నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. రూ.పది కోట్లతో అమరావతిలో ప్రగడ కోటయ్య స్మృతి వనం నిర్మిస్తున్నామని, ఈ స్మృతి వనం నిర్మాణంలో మంత్రి నారా లోకేష్ విశేష కృషి చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్ధసారథి, మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, చేనేత, జౌళి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్పీ సిసోడియా, భారీ సంఖ్యలో చేనేతలు పాల్గొన్నారు.

*విజయవాడలోని శాప్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ రవినాయుడు.. అమరావతి ఛాంపియన్షిప్-2026 రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళిక, సమన్వయం, ఇతర కీలక అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అత్యున్నత ప్రమాణాలతో క్రీడలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, రానున్న రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, క్రీడాకారులకు కల్పించాల్సిన సౌకర్యాలు, వేదికల సిద్ధత, నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలు, అలాగే వివిధ విభాగాల మధ్య సమన్వయంపై చర్చించారు. ప్రతి అధికారి సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అన్ని ఏర్పాట్లను నాణ్యతతో, సమయపాలనతో పూర్తి చేసి, క్రీడాకారులకు ఉత్తమ క్రీడా వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.*



# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు

***ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా - తిరుపతిలో ఎస్సీ సంక్షేమంపై సమీక్ష - బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ఆదేశం***

తిరుపతి (చైతన్య రథం): తిరుపతి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి, వసతి సౌకర్యాలు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక పద్మావతి అతిథి గృహంలో భారత జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, తిరుపతి ఎం.పి. గురుమూర్తి, జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ సెక్రటరీ శ్రీనివాస్, డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు, రీసర్చ్ అధికారి వర ప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుతో కలసి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా మాట్లాడుతూ.... జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, సామాజిక, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి, వసతి సౌకర్యాలు, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఎస్సీ కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో చేరేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడంతో పాటు, వారి విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వసతి గృహాల్లో అవసరమైన మరమ్మత్తులు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్.సి. బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్సీ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న విద్యా సహాయం, స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ వసతి గృహాల నిర్వహణ, భవనాల మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యార్థులకు నాణ్యమైన భోజనం తదితర అంశాల అమలుపై సమీక్షించారు. అలాగే షెడ్యూల్డ్ కులాల కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి, జీవనోపాధి, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం తదితర కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంబంధిత పథకాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. షెడ్యూల్డ్ కులాలపై జరుగుతున్న దాడులు, వివక్ష, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, బాధితులకు పరిహారం, న్యాయ సహాయం తదితర అంశాలపై సమీక్షిస్తూ బాధితులకు చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు, ప్రభుత్వం ద్వారా అందాల్సిన పరిహారం, ఇతర సహాయాలను సకాలంలో అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎస్సీ వర్గాలపై వివక్షకు తావులేకుండా రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులాల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల అమలులో సాంఘిక సంక్షేమ శాఖతో పాటు రెవెన్యూ, పోలీసు, విద్య, వైద్య ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, ఉపాధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలోని ఎస్సీ వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పించి, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తిరుపతి జిల్లా యంత్రాంగం తరఫున జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాల పురోగతి, విద్యార్థుల సంక్షేమం, వసతి గృహాల పరిస్థితి, ఆర్థిక సాధికారత కార్యక్రమాలు, ఎస్సీ అట్రాసిటీ కేసుల పరిష్కారం తదితర అంశాలకు సంబంధించిన జిల్లా సమీక్షా నివేదికపై జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాకు తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, రెవెన్యూ, పోలీసు, విద్య, సంక్షేమం, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# మెగా డీఎస్సీ పారదర్శకం

- సోషల్ మీడియాలో వస్తోన్న ఆరోపణలు అవాస్తవం
- మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ప్రకారమే పారదర్శక ఎంపిక
- పీడబ్ల్యుబీడీ అభ్యర్థుల హారిజాంటల్ రిజర్వేషన్‌ను తప్పుగా అర్థం చేసుకోవద్దు
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా




అమరావతి (చైతన్య రథం): మెగా డీఎస్సీ-2025 నియామకాలకు సంబంధించి సోషల్ మీడియాలో కొందరు అభ్యర్థులు తమకు రావాల్సిన ఉద్యోగాలు పీడబ్ల్యుబీడీ (పర్సన్స్ విత్ బెంచ్‌మార్క్ డిజెబిలిటీస్) అభ్యర్థులకు కేటాయించడం వల్ల తమకు అన్యాయం జరిగిందంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ-2025లో మెరిట్, రోస్టర్ విధానం, వర్తించే రిజర్వేషన్ నిబంధనలు, ముఖ్యంగా హారిజాంటల్ రిజర్వేషన్‌ను నిర్దేశించిన జీవో 77 ప్రకారం మాత్రమే ఎంపికలు జరిగాయన్నారు. పీడబ్ల్యుబీడీ అభ్యర్థులకు కల్పించిన హారిజాంటల్ రిజర్వేషన్‌ను సోషల్ మీడియాలో తప్పుగా అర్థం చేసుకుని, ఎంపిక ప్రక్రియపై అపోహలు సృష్టించడం సరికాదని ఆమె పేర్కొన్నారు.

శుక్రవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ భరణితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ మెగా డీఎస్సీ-2025 ద్వారా అర్హత, మెరిట్, రిజర్వేషన్ నిబంధనలు మరియు రోస్టర్ విధానాన్ని సమన్వయం చేస్తూ చట్టబద్ధంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నియామకాలు చేపట్టడం జరిగిందన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న ఆరోపణలను వాస్తవాల ఆధారంగా పరిశీలించాలని, మెగా డీఎస్సీ-2025 ఎంపిక ప్రక్రియపై అభ్యర్థులు, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని విజ్ఞప్తి చేశారు.

**దేవగుప్తపు సంతోషి పార్వతి కేసులో వాస్తవాలు...**

ఈమెకు బదులుగా పీడబ్ల్యుబీడీ అభ్యర్థిని ఎంపిక చేయడంవల్ల ఉద్యోగం కోల్పోయినట్టు సోషల్ మీడియాలో చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఈడబ్ల్యుఎస్ కేటగిరీకి చెందిన ఈమె పీజీటీ (ఇంగ్లీష్), జోన్-1లో 92వ ర్యాంక్ సాధించారన్నారు. నోటిపై చేసిన రెండు ఈడబ్ల్యుఎస్ పోస్టుల్లో ఒకటి 84వ ర్యాంక్ వరకు జనరల్ మెరిట్ ఆధారంగా భర్తీ కాగా, మరో పోస్టును నిబంధనల ప్రకారం పీడబ్ల్యుబీడీ -విజువల్ ఇంపెయిర్డ్ (వీహెచ్) హారిజాంటల్ రిజర్వేషన్ కింద అర్హత కలిగిన అశోక్‌కుమార్ మనివేల్తికి కేటాయించామన్నారు. ఆయనకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి జారీ చేసిన ధ్రువపత్రం ప్రకారం 40 శాతం దృష్టి వైకల్యమున్నట్లు నిర్ధారించబడిందన్నారు. దీంతో 92వ ర్యాంక్‌లో ఉన్న సంతోషి పార్వతి ఎంపిక పరిధిలోకి రాలేదన్నారు. ఇది వ్యక్తిగతంగా ఎవరినీ తప్పించడం కాదని, అమల్లో ఉన్న హారిజాంటల్ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం జరిగిన చట్టబద్ధమైన ఎంపిక ప్రక్రియ అని అన్సారియా స్పష్టం చేశారు.

**వివి భాస్కర్‌రెడ్డి విషయంలోనూ ఇదే విధానం...**

తాను పీడబ్ల్యుబీడీ అభ్యర్థి కారణంగా ఉద్యోగానికి దూరమయ్యానంటూ సోషల్ మీడియాలో చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఈడబ్ల్యుఎస్ కేటగిరీకి చెందిన స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) అభ్యర్థి భాస్కర్‌రెడ్డి కడప జిల్లాలో 68వ ర్యాంక్ సాధించారన్నారు. నోటిపై చేసిన 8 ఈడబ్ల్యుఎస్ పోస్టుల్లో 7 పోస్టులు 67వ ర్యాంక్ వరకు జనరల్ మెరిట్ ఆధారంగా భర్తీకాగా, మిగిలిన ఒక పోస్టును అర్హత కలిగిన పీడబ్ల్యుబీడీ -హియరింగ్ ఇంపెయిర్డ్ అభ్యర్థి గోనిగుంట్ల సుభాషిణికి హారిజాంటల్ రిజర్వేషన్ కింద నిబంధనల ప్రకారం కేటాయించడం జరిగిందన్నారు. అందువల్ల 68వ ర్యాంక్ సాధించిన భాస్కర్‌రెడ్డి ఎంపిక పరిధిలోకి రాలేదన్నారు. ఇది ఎటువంటి నిబంధనల ఉల్లంఘన కాదని, మెరిట్, రోస్టర్, హారిజాంటల్ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం జరిగిన చట్టబద్ధమైన ఎంపికని ఆమె స్పష్టం చేశారు.

**హారిజాంటల్ రిజర్వేషన్‌పై స్పష్టత...**

మెగా డీఎస్సీ-2025లో హారిజాంటల్ రిజర్వేషన్ విధానాన్ని జీవో 77, 2-8-23 ప్రకారం అమలు చేశామన్నారు. గతంలో ఉన్నట్లుగా మహిళలు, పీడబ్ల్యుబీడీ, మాజీ సైనికులు, మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్స్‌కు ప్రత్యేకంగా స్థిర రోస్టర్ పాయింట్లు కేటాయించే విధానాన్ని కాకుండా, అర్హత కలిగిన హారిజాంటల్ రిజర్వేషన్ అభ్యర్థులను వారి సంబంధిత వర్టికల్/ కమ్యూనిటీ రోస్టర్‌లోనే సర్దుబాటు చేసే విధానాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. అందువల్ల పీడబ్ల్యుబీడీ అభ్యర్థి ఎంపిక అంటే సాధారణ మెరిట్‌ను పక్కన పెట్టి మరొక అభ్యర్థిని అన్యాయంగా తొలగించడం కాదని, చట్టబద్ధంగా కల్పించిన హారిజాంటల్ రిజర్వేషన్‌ను అమలు చేయడమని కమిషనర్ స్పష్టం చేశారు.

**మెగా డీఎస్సీ-2025 ప్రక్రియ పూర్తిగా పారదర్శకం...**

రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీ-2025లో 3,36,300 మంది అభ్యర్థులు పాల్గొన్నారని, మొత్తం 5,77,675 దరఖాస్తులు అందాయని ఆమె తెలిపారు. పరీక్షలను 154 కేంద్రాల్లో, 24 రోజుల వ్యవధిలో 89 సెషన్లుగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించడం జరిగిందన్నారు. అనంతరం ప్రాథమిక కీ, అభ్యర్థుల రెస్పాన్స్ షీట్లు విడుదల చేసి అభ్యంతరాలకు అవకాశం కల్పించి, సబ్జెక్ట్ నిపుణుల పరిశీలన అనంతరం ఫైనల్ కీ, శాస్త్రీయ నార్మలైజేషన్ ద్వారా తుది స్కోర్లు ప్రకటించడం జరిగిందని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం 15,941 మంది అభ్యర్థులను ఎంపికకు ఆమోదించడం జరిగిందన్నారు. నియామక ప్రక్రియలో 32,695కు పైగా ప్రశ్నలు/ సందేహాలు, 1,135 గ్రీవెన్సులను సంబంధిత అధికార యంత్రాంగం నిబంధనల ప్రకారం పరిష్కరించిందని ఆమె తెలిపారు.

**సోషల్ మీడియా ప్రచారాన్ని వాస్తవాలతోనే చూడాలి...**

మెగా డీఎస్సీ-2025లో ప్రతి అభ్యర్థి ఎంపిక మెరిట్, ఖాళీలు, వర్తించే రిజర్వేషన్ నిబంధనలు, రోస్టర్ మరియు ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగానే జరిగిందని తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. కాబట్టి ఒక అభ్యర్థి ఎంపిక కాలేదనే కారణంతో, పీడబ్ల్యుబీడీ అభ్యర్థి ఎంపికను తప్పుగా చూపిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేయడం ద్వారా దివ్యాంగుల హక్కులను కల్పించిన చట్టబద్ధమైన రిజర్వేషన్ వ్యవస్థపై అపోహలు కలిగించడం సరికాదని ఆమె పేర్కొన్నారు.

**స్పోర్ట్స్ మెగా డీఎస్సీ-2025పై అవాస్తవ ప్రచారం**

స్పోర్ట్స్ మెగా డీఎస్సీ- 2025లో కొందరు అభ్యర్థులు క్రీడా ధ్రువపత్రాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని శాప్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భరణి స్పష్టం చేశారు. అర్హత, క్రీడా మెరిట్, గుర్తింపు పొందిన క్రీడా సంఘాల ధ్రువీకరణ, ప్రభుత్వ నిబంధనల ఆధారంగానే ఎంపికలు జరిగాయన్నారు. పింజారి ఇస్మాయిల్ బాషా, షేక్ అన్వర్ బాషా కేసుల్లో అభ్యర్థులు సమర్పించిన జూడో క్రీడా ధ్రువపత్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ స్టేట్ జూడో అసోసియేషన్ కార్యదర్శి జారీ చేసిన ఫాం-2లు, సంబంధిత సంఘం ద్వారా పొందిన జన్యూన్‌నెస్ ధ్రువీకరణ, అభ్యర్థుల డిక్లరేషన్లు, గెజిటెడ్ అధికారులచే ధ్రువీకరించిన పత్రాలను పరిశీలించిన అనంతరమే స్పోర్ట్స్ కోటా ఎంపిక జరిగింది. పింజారి ఇస్మాయిల్ బాషా 2018 సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం, షేక్ అన్వర్ బాషా 2022 సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూడో ఛాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం సాధించినట్టు సమర్పించిన ధ్రువపత్రాల ఆధారంగా వారి క్రీడా ప్రాధాన్యతలను నిర్ణయించడం జరిగిందన్నారు. అప్పట్లో సంబంధిత గుర్తింపు పొందిన క్రీడా సంఘంనుంచి జన్యూన్‌నెస్ ధ్రువీకరణ లభించిన నేపథ్యంలోనే ఎంపిక ప్రక్రియ ముందుకు సాగిందన్నారు.

క్రీడా ధ్రువ పత్రాల నిజానిజాలను నిర్ధారించే బాధ్యత సంబంధిత గుర్తింపు పొందిన క్రీడా సంఘాలు/ ఫెడరేషన్లదేనని, శాప్ వాటినుంచి అధికారిక ధ్రువీకరణ పొందిన అనంతరమే తదుపరి చర్యలు తీసుకోవడం జరిగిందని ఆమె స్పష్టం చేశారు. కేవలం సోషల్ మీడియా ఆరోపణల ఆధారంగా ఏ సర్టిఫికెట్‌నూ నకిలీదిగా నిర్ధారించలేమని, నిర్ధారించబడిన విశ్వసనీయ ఆధారాలు, అధికారిక ధ్రువీకరణలు, ప్రభుత్వ ఉత్తర్వులు, నియామక నిబంధనల ఆధారంగానే నిర్ణయాలు ఉంటాయని ఆమె తెలిపారు.


**ఆడియో వ్యవహారంపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు...**

స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలకు సంబంధించి అనుమానాస్పద ఆడియో సంభాషణ వెలుగులోకి వచ్చిన వెంటనే శాప్ స్పందించిందని ఆమె తెలిపారు. తేదీ. 25.07.2025న విజయవాడ పోలీస్ కమిషనర్‌కు, అనంతరం తేదీ. 28.07.2025న ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసి దర్యాప్తు కోరినట్లు తెలిపారు. శాప్ ఫిర్యాదు మేరకు విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు అనంతరం సంబంధిత నిందితుడిని అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరిచారని ఆమె వెల్లడించారు.

అందువల్ల సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆధారరహిత ఆరోపణలుగా పరిగణించాలని, స్పోర్ట్స్ మెగా డీఎస్సీ-2025లో ప్రతి నిర్ణయం ధ్రువీకరించబడిన వాస్తవాలు, సంబంధిత క్రీడా సంఘాల అధికారిక నిర్ధారణలు, ప్రభుత్వ ఉత్తర్వులు, నియామక నిబంధనల మేరకే తీసుకున్నామని భరణి స్పష్టం చేశారు. నిజమైన క్రీడాకారులకు న్యాయం చేయడం, నకిలీ ధ్రువపత్రాలకు తావులేకుండా చూడడం, నియామక ప్రక్రియలో పారదర్శకతను కాపాడటం శాప్ ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ పాల్గొన్నారు.

### విజయ డెయిరీ చైర్మన్ పదవికి


## చలసాని ఆంజనేయులు రాజీనామా



విజయవాడ (చైతన్య రథం): విజయ డెయిరీ చైర్మన్ పదవికి తెదేపా నేత చలసాని ఆంజనేయులు రాజీనామా చేశారు. పార్టీ అధిష్టానం నిర్ణయాన్ని గౌరవిస్తూ ఆయన పదవి నుంచి వైదొలిగారు. ఈ సందర్భంగా చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ.. పార్టీ నిర్ణయం తనకు శిరోధార్యమన్నారు. మరొకరికి చైర్మన్‌గా అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే చలసాని రాజీనామా చేశారని మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి తెలిపారు. తనకు పార్టీ ముఖ్యమని.. పదవులు కాదని ఆయన చెప్పారన్నారు. చలసాని ఆంజనేయులు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా నామినేషన్ వేయడంపై తెదేపా అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. చైర్మన్ పదవిపై ఆలోచించి నిర్ణయం తీసుకుందామని, నామినేషన్ వేయొద్దని సూచించింది. గురువారం ఉదయం వరకూ ఉపసంహరించుకుంటానని చెబుతూనే ఎన్నికల ప్రక్రియలో చలసాని ముందుకెళ్లడంతో మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి ఆయన్ను కలిశారు. పార్టీ నిర్ణయానికి అతీతంగా వెళ్లొద్దని సూచించారు. పార్టీ కావాలో.. పదవి కావాలో నిర్ణయించుకోవాలని అధిష్టానం మాటగా చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో చలసాని ఆంజనేయులు విజయ డెయిరీ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు.

## వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనానికి అవకాశం

- పిడుగులతో కూడిన వర్షాలకు ఛాన్స్
- ఉత్తరాంధ్ర ప్రాంతవాసులు అప్రమత్తం



విజయవాడ (చైతన్య రథం): ఉపరితల ఆవర్తన ప్రభావంతో 24 గంటల్లోపు వాయువ్య బంగాళాఖాతం, ఆనుకుని ఉన్న పశ్చిమ బెంగాల్ తీరప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దీని ప్రభావంతో రానున్న రెండురోజులు రాష్ట్రంలో మేఘావృతమైన వాతావరణంతోపాటు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడే సమయంలో చెట్లు, పోల్స్, హోర్డింగ్స్‌వద్ద నిలబడరాదని సూచించారు.

శనివారం శ్రీకాకుళం, పార్వతీపురంమన్యం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉత్తరాంధ్ర తీరంవెంబడి గంటకు 40-50 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, పోలవరం, విశాఖ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటినుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, మార్కాపురం, రాయలసీమ జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# వైసీపీకి విమర్శించే హక్కు లేదు

- ఐదేళ్లు రాష్ట్రాన్ని పట్టించుకోని జగన్‌కు నైతికతే లేదు
- ఇప్పుడు ప్రజల సమస్యలపై మొసలి కన్నీరు కారుస్తున్నారు
- మాజీ మంత్రి ధర్మాన, కృష్ణదాస్‌పై మంత్రి అచ్చెన్న ధ్వజం
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రూ.3.62 కోట్ల చెక్కుల పంపిణీ






తిలారు, కోటబొమ్మాళి (చైతన్య రథం): ఐదేళ్లు రాష్ట్రాన్ని పట్టించుకోని గొడ్డలి పార్టీ అధ్యక్షుడు నేడు రాజకీయ విమర్శలు చేసే నైతిక హక్కు లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో విమర్శించారు. కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామంలో మంత్రి విస్తృతంగా పర్యటించి, రూ.7 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలను స్వయంగా పరిశీలించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలోని హైస్కూల్, ఆసుపత్రి, హాస్టల్ తదితర ప్రాంతాలను సందర్శించారు. గ్రామంలో నెలకొన్న పరిస్థితులను స్వయంగా తెలుసుకునేందుకే ఊరంతా పర్యటించానని, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వాటి తీవ్రత, పరిష్కార మార్గాలు మరింత స్పష్టంగా తెలుస్తాయని మంత్రి తెలిపారు. ఒక సమస్య తన దృష్టికి వచ్చిన తర్వాత ప్రజలు మళ్లీ మళ్లీ అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సంబంధిత పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని తిలారులో అర్హత కలిగిన చేనేత కార్మికులు, వారి కుటుంబాలకు మంత్రి అచ్చెన్నాయుడు మొత్తం రూ.3.62 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. చేనేత కుటుంబాల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ చేనేత రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్ రాయితీలు, ఆర్థిక సహాయం వంటి చర్యలను ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

### రేగులపాడు-పింద్రువాడ రహదారి అనుసంధానమే లక్ష్యం

రేగులపాడు మీదుగా జర్జాంగి, పింద్రువాడ రహదారికి అనుసంధానం చేయడం తన జీవిత ఆశయాల్లో ఒకటని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మార్గంలో అవసరమైన చోట వంతెన నిర్మాణం చేపడితే రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు, ప్రజల రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. చిత్తశుద్ధితో కృషి చేసి ఈ రహదారి అనుసంధానంతో పాటు వంతెన నిర్మాణ పనులను కూడా పూర్తి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

### రైతులకు పాస్‌పుస్తకాల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతులకు పాస్‌పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నారాయణపురంలో 362, పెద్దబమ్మిడిలో 708, చిన్నబమ్మిడిలో 596 పాస్‌పుస్తకాలను రైతులకు అందజేశారు. రైతులకు భూమి హక్కులకు సంబంధించిన పత్రాలు సకాలంలో అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. తనకు ఓటు వేశారా లేదా అనే విషయాన్ని తాను ఎప్పుడూ చూడబోనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఓటు అనేది తాత్కాలికమని, ప్రజలకు మంచి ఆలోచనతో శాశ్వత ప్రయోజనం కలిగించే పనులు చేస్తే వారు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని తెలిపారు. గతంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం చేపడుతున్న పనులు, భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాల గురించి నేటి యువతకు వివరించి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

### 'నాడు-నేడు'లో నిధుల దుర్వినియోగంపై విమర్శలు

గత ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' పేరుతో సుమారు రూ.5,000 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పుకున్నప్పటికీ, అనేక ప్రాంతాల్లో పనులు పూర్తికాక కేవలం మొండి గోడలు మాత్రమే మిగిలాయని మంత్రి విమర్శించారు. పాఠశాలల్లో చిన్న బోల్ట్, తలుపు వంటి వస్తువు అవసరమైనా స్థానికులకు పనులు ఇవ్వకుండా కేంద్రీకృత విధానంలో వ్యవహరించారని ఆరోపించారు. ఏ గ్రామానికి వెళ్లినా పూర్తికాని హైస్కూల్ భవనాలు కనిపిస్తున్నాయని, పాఠశాలల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని పనులను పూర్తి చేసేందుకు త్వరలో ప్రత్యేక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు పాఠశాల భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

### తిలారు కోనేరును రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతాం

శ్రీకాకుళం జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉన్న తిలారు కోనేరును ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. తిలారు కోనేరును ముఖ్యమంత్రి అయినా, ఇతరులు వీడియోలో చూపించే స్థాయిలో అద్భుతంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాబోయే 5-6 నెలల్లో కోనేరు పరిసరాల్లో లైటింగ్, బెంచీలు, చిల్డ్రన్ పార్క్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసి సాయంత్రం వేళల్లో మహిళలు, పురుషులు, పిల్లలు ప్రశాంతంగా గడిపేలా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని తెలిపారు.

### టెక్కలి నియోజకవర్గానికి రూ.650 కోట్ల తాగునీటి ప్రాజెక్టు

టెక్కలి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా రూ.650 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టును చేపడుతున్నామని మంత్రి తెలిపారు. హీరమండలం రిజర్వాయర్ నుంచి వంశధార నీటిని కొండపైకి తరలించి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి అందించేలా ప్రణాళిక రూపొందించామని, రెండేళ్లలో ఈ లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పారు. తాగునీరు, సాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. గ్రామానికి కేటాయించిన రూ.7.5 కోట్ల నిధుల్లో ఇప్పటికే రూ.3.5 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేస్తామని చెప్పారు. రైల్వే ఫ్లైఓవర్ రోడ్డు పనులతో పాటు గౌరంపేట, పెద్దవీధి ప్రధాన రహదారుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు. 2026 నాటికి 80 శాతానికి పైగా అభివృద్ధి పనులను పూర్తి చేసి, 2029 ఎన్నికల నాటికి టెక్కలి నియోజకవర్గంలో ప్రధాన సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

### ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందంజ

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒకటి రెండు మినహా దాదాపు అన్నింటినీ అమలు చేశామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో ఎన్నికలు సమీపించిన సమయంలో మాత్రమే పింఛన్లు పెంచారని, తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పింఛన్లను రూ.4,000కు, దివ్యాంగుల పింఛన్లను రూ.6,000కు పెంచిందని చెప్పారు. ప్రత్యేక వర్గాలకు రూ.10,000 నుంచి రూ.15,000 వరకు పింఛన్లు అందిస్తున్నామని, ప్రతి నెలా 1వ తేదీన ఆదివారం లేదా పండుగ వచ్చినా ఒక రోజు ముందుగానే నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛను అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

గత ప్రభుత్వం ఒక ఇంట్లో ఒక్కరికే ఆర్థిక సాయం అందించి, కేవలం మూడు సంవత్సరాలకే పరిమితం చేసిందని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున ఆర్థిక సాయం అందించేలా 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తోందని, ఈ పథకం కోసం సంవత్సరానికి రూ.10,600 కోట్లను కేటాయిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల చదువుకు తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రైతులకు రూ.20,000 ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, మహిళలకు 'శ్రీశక్తి' పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించే కార్యక్రమంలో భాగంగా నగదును ముందుగానే ఖాతాల్లో జమ చేస్తున్నామని, వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు రూ.20,000 ఆర్థిక భృతి అందిస్తూ వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు.

### యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా నిరుద్యోగ యువత జీవితాలతో ఆడుకున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయని వారు ఇప్పుడు ఉపాధ్యాయ ఉద్యోగాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు 2018లోనే పునాది వేసినా గత ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు రెండేళ్లపాటు కృషి చేసి ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. గత ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వకపోయినా, యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ 'యువగళం' పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,700కు పైగా పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందని మంత్రి తెలిపారు. డీఎస్సీ పరీక్షలు నిర్వహించి, వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత కూడా దాన్ని అడ్డుకునేందుకు కోర్టుల్లో వందల సంఖ్యలో కేసులు వేశారని ఆరోపించారు. అయితే ఎన్ని అడ్డంకులు వచ్చినా యువతకు ఉద్యోగాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని స్పష్టం చేశారు.

### ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పనిచేస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. టెక్కలి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామానికి తాగునీరు, సాగునీరు, రహదారులు, విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా పయనిస్తోందని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాలు..

# అడవి తల్లి బాటలు

- డిప్యూటీ సీఎం నిరంతర పర్యవేక్షణలో స్పష్టమైన పురోగతి
- అడవితల్లి బాట తొలి దశలో రూ.1,005 కోట్లతో 1,069 కి.మీ. అభివృద్ధికి శ్రీకారం
- అడవితల్లి బాట 2.0 విస్తరణతో మొత్తం రూ.2,078 కోట్లతో 2,310 కి.మీ. రహదారుల అభివృద్ధి
- విస్తరణ పనుల్లో ఇప్పటికే 905 కి.మీ. రహదారుల నిర్మాణం పూర్తి
- పెండింగ్ పనులపై వివిధ శాఖల అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష





అమరావతి (చైతన్య రథం): డోలీరహిత గిరిజన గ్రామాలు లక్ష్యంగా డిప్యూటీ సీఎం, గ్రామీణాభివృద్ధి మంత్రి పవన్ కళ్యాణ్ పర్యవేక్షణలో చేపట్టిన అడవితల్లి బాట పనులు స్పష్టమైన పురోగతి దిశగా సాగుతున్నాయి. అడవితల్లి బాట తొలి దశలో రూ. 1,005 కోట్ల అంచనా వ్యయంతో 1,069 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తూ అడవితల్లిబాట 2.0ను ప్రారంభమైంది. ఈ విస్తరణతో మొత్తం ప్రాజెక్టును రూ. 2,078 కోట్ల అంచనా వ్యయంతో 2,310 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధికి విస్తరించారు. ఇందులో ఇప్పటికే 905 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం పూర్తైంది. అడవితల్లిబాట కార్యక్రమం మొదటి రోజు నుంచి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పనులు వేగంగా ముందుకు తీసుకువెళ్లే విధంగా డిప్యూటీ సీఎం సూచనలు చేస్తున్నారు.

### సవాళ్ల నడుమ రోడ్డు నిర్మాణం

అడవితల్లిబాట కార్యక్రమంలో భాగంగా చాలా గ్రామాలకు రోడ్డు వేయడంకంటే ముందు దారి నిర్మించేందుకు సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చింది. రోడ్ల నిర్మాణంలో భాగంగా పెద్ద పెద్ద గుట్టలను కంట్రోల్డ్ బ్లాస్టింగ్ ద్వారా బ్రేక్ చేసి, రాళ్లు పగలగొట్టి దారి ఏర్పాటు చేశారు. ఆ దారిపై రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. దారులు వేసిన తర్వాత కొన్ని ప్రాంతాలకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక నిర్మాణ సామాగ్రి చేరుకోవడం కష్టతరంగా మారింది. అలాంటి సవాళ్ల మధ్య గిరిశిఖర గ్రామాలకు సైతం డోలీ కష్టాల నుంచి విముక్తి కల్పించాలన్న దృఢ సంకల్పంతో డిప్యూటీ సీఎం ప్రణాళికలు ముందుకు తీసుకువెళ్తున్నారు.

### ప్రతి గిరిజన గ్రామం డోలీ రహితం కావాలి: పవన్ కళ్యాణ్ గారు

అడవితల్లిబాట పనుల పురోగతిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించిన పవన్ కళ్యాణ్ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అటవీ అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా ఆయా జిల్లాల కలెక్టర్లు శాఖల మధ్య సమన్వయ బాధ్యత తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రికార్డుస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు అటవీ అనుమతుల ప్రక్రియ పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వర్షాల కారణంగా పనులకు ఆటంకాలు ఏర్పడిన ప్రాంతాలు వినా, మిగిలిన అన్ని ప్రాంతాల్లో పనులు నిరంతరాయంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను చేరువ చేయాలన్న బలమైన సంకల్పంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో చేపట్టిన అడవితల్లి బాట పనుల్లో నాణ్యతా లోపాలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని తెలిపారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.

# టీడీపీ హయాంలోనే సీమ అభివృద్ధి

- సీమను విస్మరించిన వైసీపీకి ప్రశ్నించే హక్కు లేదు
- గొడ్డలి నేతలకు కూటమి అభివృద్ధి కనిపించడం లేదా?
- 'ఇంటింటికి తెలుగుదేశం'లో నిలదీసిన మంత్రి జనార్ధన్ రెడ్డి



బనగానపల్లె (చైతన్య రథం): నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని తెలుగు దేశం పార్టీ హయాంలోనే రాయలసీమ అభివృద్ధి సాధించిందని రోడ్లు భవనాల మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుడి గ్రామంలో 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమైందని, రెండేళ్ల పాలనలో సూపర్ సిక్స్‌ను 90శాతం విజయవంతంగా అమలు చేయగలిగామన్నారు. "తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకాలను విజయవంతంగా అమలు చేశాం. నేడు బనగానపల్లిలో అన్న కాంటీన్ ఏర్పాటుచేసి పేదవాడికి ఉచితంగా భోజనం అందిస్తున్నాం. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలో సన్న బియ్యంతో మధ్యాహ్నం భోజనం మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో అందిస్తున్నాం. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గొడ్డలి పార్టీ నాయకులకు కనబడటం లేదా? ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్న ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నా. వైసీపీ నేతలు కరపత్రికను అడ్డం పెట్టుకుని విమర్శలు చేస్తున్నారు. నేడు వైసీపీ కార్యకర్తలకు సైతం సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. మాజీ ఎమ్మెల్యేని ఇప్పటికే రెండుసార్లు ఓడిస్తే రెండేళ్లు కాకుండానే మళ్లీ పోటీ చేద్దామంటున్నారు. మీ ఇష్టం వచ్చినప్పుడు పోటీ చేయడానికి.. ఇది రాచరికం కాదు.. ప్రజాస్వామ్యనే విషయం గుర్తుంచుకోవాలి. కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి తట్టుకోలేక వైసీపీ విమర్శలకు పాల్పడుతుంది. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ పోస్ట్ అయినా ఇచ్చారా? డీఎస్సీ పేరుతో దీక్షలు చేయడానికి వైసీపీ నేతలకు సిగ్గేయడం లేదా? డీఎస్సీ పేరుతో యువత, నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుంది. నిన్న బనగానపల్లె వైసీపీ డీఎస్సీ దీక్షలో ఐటిఐ ఫెయిల్ అయిన చెరుకుపల్లి సురేష్ అనే వ్యక్తి నిరసన చేస్తున్నాడు.. ఇది గొడ్డలి పార్టీ డ్రామా కాదా? వైసీపీ అరాచక పాలన చూసి ప్రజలు 151నుంచి 11 సీట్లకు పరిమితం చేశారు. ప్రతిపక్షం తన వ్యవహార శైలి మార్చుకోకపోతే ఇంతకంటే ఘోరమైన ఫలితం చవిచూడాల్సి వస్తుంది" అని మంత్రి జనార్ధన్ రెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యతనిస్తుందని, నేతన్న సేవలో కార్యక్రమం ద్వారా అర్హత కలిగిన ప్రతి చేనేత కార్మికుడికి రూ. 25000 ఆర్థిక సహాయం నేడు అందించామని వివరించారు. "సమస్యలపై చర్చిద్దాం అసెంబ్లీకి రమ్మంటే ప్రతిపక్ష హోదా ఇస్తే వస్తానంటాడు.. స్కూల్ పిల్లోడు చాక్లెట్ ఇస్తేనే బడికి వెళ్తాను అన్నట్లుగా జగన్మోహన్ రెడ్డి వ్యవహార శైలి ఉంది. జగన్మోహన్ రెడ్డి బయటకు వస్తే రాష్ట్రంలో విధ్వంసమే. ప్రతిపక్ష నేత ప్రజల్లోకి వస్తున్నారంటే సామాన్య ప్రజానీకం భయాందోళనలకు గురయ్యే పరిస్థితి ఉంది. వైసీపీ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. మాజీ ఎమ్మెల్యే అవుకు జలాశయం నుంచి నీళ్లు ఇవ్వడం లేదని విమర్శిస్తున్నారు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో కుమ్మక్కయ్యమని విమర్శలు చేస్తున్నారు. ఐదేళ్లలో ఏ రోజైనా ఏ ప్రాజెక్టు ద్వారా అయినా ఆయన నీళ్లిచ్చారా? జీఎన్ఎస్ఎస్‌ను కేవలం మట్టి పనులు చేసి, మీరు వదిలేస్తే రూ. 375 కోట్లతో పూర్తి చేసి నీళ్ళు అందించాం. దద్దనాల ప్రాజెక్టును రూ. 16 కోట్లతో పూర్తిచేస్తే మరుగున పడేశారు. రాయలసీమ చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోనే అభివృద్ధి జరిగిందన్న విషయం ప్రజలకు తెలీంది కాదు. నేడు రూ.లక్ష కోట్లతో రాయలసీమ హార్టికల్చర్‌ను అభివృద్ధి చేస్తున్నాం. బనగానపల్లెను చరిత్రలో లేని విధంగా నేడు బీటీ రోడ్లు వేశాం. అభివృద్ధి చేసే నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టంగట్టాలని ప్రజలను కోరుతున్నాను. 2014 నుండి 2019 వరకు టీడీపీ హయాంలో ఎర్రగుడి గ్రామాన్ని రూ. 77 లక్షలతో అభివృద్ధి చేశాం. 2019 నుండి 2024 వరకు వైసీపీ హయాంలో ఖర్చు చేసిన నిధులు.. కేవలం రూ. 10 లక్షలు మాత్రమే. ఇది చూసి స్థానిక వైసీపీ నేతలు సిగ్గుతో తలదించుకోవాలి. 2024 నుండి 2026 వరకు కూటమి ప్రభుత్వంలో రూ. 60 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాం. ఎర్రగుడి గ్రామంలో తల్లికి వందనం క్రింద 378 మంది విద్యార్థులకు సంబంధించి 224 మంది తల్లుల ఖాతాల్లో రూ 49.14 లక్షలు జమ చేశాం. దీపం పథకం కింద గ్రామంలో 495 కుటుంబాలు గ్యాస్ సబ్సిడీ పొందుతున్నాయి. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇద్దరికీ రూ 2.28 లక్షల నిధులు అందించడం జరిగింది. వాహన మిత్ర ద్వారా ఒక్కొక్కరికి రూ 10,000 చొప్పున 10మంది లబ్ధిదారులకు ఒక లక్ష సహాయం అందించాం. రానున్న రోజుల్లో ఎర్రగుడి గ్రామానికి మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నిలుపుతాం" అని మంత్రి జనార్ధన్ రెడ్డి హామీ ఇచ్చారు.

# సాగునీటి రంగాన్ని వైసీపీ పూర్తిగా విస్మరించింది

- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు..
- కూటమి ప్రభుత్వం అభివృద్ధి బాట పట్టిస్తోంది
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- వేల్పురాయిలో వైభవంగా 'రైతన్నా.. మీకోసం' ప్రారంభం
- రణస్థలానికి తోటపల్లి నీటిని తీసుకువచ్చే బాధ్యత మాదే
- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




రణస్థలం (చైతన్య రథం): రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేసి, పంట నష్టాన్ని నివారించడంతో పాటు ప్రత్యామ్నాయ సాగుపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమాన్ని ప్రారంభించిందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రణస్థలం మండలం వేల్పురాయి గ్రామంలో నిర్వహించిన 'రైతన్నా.. మీకోసం' అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టులు, నీటిపారుదల రంగాన్ని పూర్తిగా విస్మరించిందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, ఆధునికీకరణ, పూర్తికి అవసరమైన చర్యలు చేపట్టకుండా రైతాంగ ప్రయోజనాలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాష్ట్రానికి అవసరమైన మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాల్సిన సమయంలో గత ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. అప్పులు చేసిన స్థాయిలో ప్రజలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులను సృష్టించడంలో మాత్రం విఫలమైందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడంతోపాటు అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సమర్థవంతమైన నాయకత్వం, సమన్వయంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధుల సమీకరణ, పెండింగ్ పనులను వేగవంతం చేయడం, రైతులకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రాజెక్టులు పూర్తయితేనే రైతు పొలాలకు నీరు.. రైతు కుటుంబాలకు భరోసా.. రాష్ట్రానికి ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందన్నారు. గత పాలనలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి వెల్లడించారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**తోటపల్లి నీరు తెస్తాం.. సాగునీటి కష్టాలు తీరుస్తాం**

రాష్ట్రంలోనే అత్యల్పంగా భూగర్భ జలాలున్న మండలాల్లో రణస్థలం ఒకటని, వందల అడుగుల లోతుకు బోర్లు వేసినా నీరుపడని తీవ్ర పరిస్థితి ఇక్కడ నెలకొందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తోటపల్లి ప్రాజెక్టు నీటిని రణస్థలం మండలానికి తీసుకువచ్చే బాధ్యతను ప్రభుత్వం స్వీకరిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య శాఖల సహకారంతో 9 రకాల విత్తనాలతో కూడిన ప్రత్యేక కిట్లను రైతులకు తక్కువ ధరకే పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి పంటలకు రక్షణ కల్పించేందుకు పంటల బీమా గడువును ఈనెల 15వరకు ఖరారు చేశామని మంత్రి తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన రైతులకు ఆయా బ్యాంక్ మేనేజర్లే బీమా చెల్లిస్తారని, రుణాలు తీసుకోని రైతులు స్వయంగా ఇన్స్యూరెన్స్ నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఈ బీమా ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు.

**ఏడు రోజులపాటు క్షేత్రస్థాయి పరిశీలన**

వర్షాభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్యశాఖల అధికారులు సమన్వయంతో ఏడు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి ఎకరా భూమిని పరిశీలిస్తారని మంత్రి తెలిపారు. ఉదాహరణకు రణస్థలం మండలంలో 49 శాతం లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో అక్కడి పరిస్థితులను అధికారులు సమగ్రంగా పరిశీలించి, రైతులకు అనువైన ప్రత్యామ్నాయ పంటలు, సాగు విధానాలపై సూచనలు అందిస్తారని చెప్పారు. రైతుల సౌకర్యార్థం 'ఏపీ ఏఐఐఎంఎస్' రిజిస్ట్రేషన్ యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఈ యాప్ ద్వారా భూమి వివరాలు, వేసే పంటలు, మార్కెట్ ధరలు, విక్రయించే ప్రాంతాల సమాచారంతో పాటు ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్ర పరికరాలను సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ వారం రోజుల కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు ప్రతీ రైతుతో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాల్లో మొక్కజొన్న సాగు చేసే రైతులు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడి, మద్దతు ధరల సమస్యలపై ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదటి ఈశ్వరరావు మాట్లాడారు. మడ్డువలస కాలువ నీటిని బుడుమూరు చెరువుకు మళ్లించి పరిసర ప్రాంతాల రైతులకు సాగునీటి కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. 50 వేల ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉన్న తోటపల్లి ప్రధాన, పిల్ల కాలువలను బాగు చేసి టైల్‌ఎండ్ భూములకు నీరందిస్తామన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.20వేలు అన్నదాత సుఖీభవ సకాలంలోఖాతాల్లో జమ కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, మొక్కజొన్న రైతులకు దళారుల దోపిడీ నుంచి విముక్తి కల్పించేలా ముందస్తు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**పప్పుధాన్యాలు ఎంత పండిస్తే అంత కొంటాం: కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్**

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని వ్యవసాయ శాఖ కమిషనర్ మనజీర్ జిలానీ సమూన్ కోరారు. వరికి ప్రత్యామ్నాయంగా కందులు, మినుములు ఎంత మేర పండిస్తే అంత ఉత్పత్తిని కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. రాగులు వంటి చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని, రాష్ట్రంలో రైతులు పండించే రాగులను ప్రభుత్వమే సేకరించి పంపిణీ చేస్తుందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రతి పొలానికి వెళ్లి రైతులకు ప్రత్యామ్నాయ సాగుపై చైతన్యం తీసుకురావాలని స్పష్టం చేశారు.

**నవధాన్యాల సాగుతో భూసారం పెంచుకుందాం: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

వాతావరణ మార్పులను తట్టుకుని రైతులకు నిలకడైన రాబడి అందించేందుకు నవధాన్యాల సాగు ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. హెక్టారుకు కేవలం రూ.600 విత్తన వ్యయంతో భూసారాన్ని పెంచుకోవచ్చని, సీఆర్‌పీల ద్వారా విత్తన పెల్లెటైజేషన్‌పై క్షేత్రస్థాయిలోనే శిక్షణ ఇప్పిస్తామ న్నారు. నవధాన్యాల వల్ల యూరియా వాడకం తగ్గుతుందని, ప్రతికూల వాతావరణంలోనూ రైతులకు కనీస ఆదాయం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' కింద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అంతకుముందు మంత్రి అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామంలోని పంట పొలంలో నాట్లు వేసిన వరి పొలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, ఇతర అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ధ్యేయం

- నాడు పబ్లిసిటీ పిచ్చితో ప్రజాధనం దుర్వినియోగం
- నేడు రాజముద్రతో రైతులకు పాసుపుస్తకాలు
- పొగాకు రైతులకు అన్ని విధాల ప్రభుత్వం అండ
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వెల్లడి
- పాలేటిపాడులో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ



ప్రకాశం/ జరుగుమల్లి (చైతన్య రథం): రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా.శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి అన్నారు. శుక్రవారం జరుగుమల్లి మండలం పాలేటిపాడులో జేసీ కల్పనా కుమారితో కలిసి మంత్రి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... గత ప్రభుత్వం పాసు పుస్తకాల మీద, ప్రభుత్వం ప్రజలకి ఇచ్చే ఇళ్ల స్థలాల హద్దు రాళ్ళ మీద కూడా వాళ్ల ఫోటోలు, పేర్లు వేసుకుని రూ. 600 కోట్ల ప్రజా ధనం వృథా చేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ రాజ ముద్రతో నూతన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. గర్భ కంద్రిక, చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతు సంక్షేమమే ద్వేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, అన్నదాత సుఖీభవతో దేశంలో ఎక్కడా లేనివిధంగా పెట్టుబడి సాయం కోసం ఏడాదికి రూ.20 వేలు ఇస్తున్నామన్నారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు. సబ్సిడీకి వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్లు అందిస్తున్నారు. కష్ట కాలంలో పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. గతేడాది రూ.300 కోట్లతో బర్లీ పొగాకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచామన్నారు. వెలుగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితం చేసి జగన్ ప్రజలను మోసం చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక యుద్ధ ప్రాతిపదికన వెలుగొండ పనులు పూర్తి చేశామన్నారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు అన్నదాత సుఖీభవ,దీపం -2 పథకం, ఉచిత బస్సు,తల్లికి వందనం వంటి ఎన్నో సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పాలేటిపాడు గ్రామంలో రూ. 70 లక్షలతో సిమెంట్ రోడ్లు డ్రైనేజీలు నిర్మించామన్నారు. త్వరలోనే గ్రామంలో హెల్త్ సెంటర్ నిర్మాణం ప్రారంభిస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

చైతన్యరథం

# ప్రతి ఔషధ తనిఖీ.. రోగి భద్రత కోసమే

- **నాణ్యమైన మందులే ప్రజారోగ్యానికి రక్షణ**
- **విధివిధానాల అమలు, ప్రయోగశాల నియంత్రణలో పటిష్ఠత అవసరం**
- **యూఎస్ ఎఫ్‌డీఏ ఇండియా కార్యాలయం కంట్రీ డైరెక్టర్ గ్రెగరీ స్మిత్**





అమరావతి (చైతన్య రథం): ఔషధ తయారీ సంస్థల్లో జరిగే ప్రతి తనిఖీ, ప్రయోగశాల పరీక్ష, నియంత్రణ సంస్థలు తీసుకునే ప్రతి నిర్ణయం నేరుగా రోగుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఇండియా కార్యాలయం (యూఎస్ ఎఫ్‌డీఏ ఇండియా ఆఫీస్) కంట్రీ డైరెక్టర్ గ్రెగరీ స్మిత్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజారోగ్యాన్ని కాపాడాలంటే శాస్త్రీయ విధానాలు, అంతర్జాతీయ సహకారం, నాణ్యమైన తనిఖీ వ్యవస్థ మరింత బలోపేతం కావాలని చెప్పారు. రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలన (ఏపీ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ - ఏపీ డీసీఏ) ఆధ్వర్యంలో అమెరికా ఫార్మకోపియా, ఆల్ ఇండియా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ సహకారంతో విజయవాడలో శుక్రవారం "నాణ్యమైన ఔషధాల భరోసా.. నియంత్రణ, ప్రమాణాలు, తనిఖీల్లో శాస్త్రీయ విధానం" అంశంపై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

**భారత్ కీలక భాగస్వామి....**

అమెరికా ఎఫ్‌డీఏ పర్యవేక్షణలో ఉన్న ఔషధ తయారీ కేంద్రాల్లో సగానికి పైగా అమెరికా వెలుపలే ఉన్నాయని, అందులో భారత్ అత్యంత కీలక భాగస్వామి అని గ్రెగరీ స్మిత్ తెలిపారు. అమెరికాకు ఎగుమతి అయ్యే మందుల తయారీలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్రంలో అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదం పొందిన 119 ఔషధ తయారీ కేంద్రాలు ఉండటం ఏపీ ఫార్మా రంగ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**లోపాలపై అప్రమత్తంగా ఉండాలి**

అమెరికా ఎఫ్‌డీఏ తనిఖీల్లో సాధారణంగా విధివిధానాలను సరిగా రూపొందించకపోవడం లేదా పాటించకపోవడం, లోపాలపై సమగ్ర విచారణ జరపకపోవడం, ప్రయోగశాల నియంత్రణల్లో బలహీనతలు కనిపిస్తున్నాయని గ్రెగరీ స్మిత్ తెలిపారు. ఇవి ఔషధ నాణ్యతను ప్రభావితం చేసే కీలక అంశాలని, తనిఖీల్లో శాస్త్రీయ ప్రమాణాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**నాణ్యతపై రాజీ లేదు: వీరపాండియన్**

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ వర్క్‌షాప్‌ను ప్రారంభించి మాట్లాడుతూ, వ్యాపార నిర్వహణ సులభతరం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ - Ease of Doing Business) కోసం నిబంధనలను సరళీకరిస్తున్నప్పటికీ, మందుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తయారయ్యే ఔషధాలు ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్నందున ఔషధ నియంత్రణ అధికారుల బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. ఔషధ తయారీ సంస్థల తనిఖీలు, ఉత్పత్తుల ప్రమాణాల పరిశీలన, ముడి పదార్థాల ధ్రువీకరణ, శాస్త్రీయ ఆధారాలతో నియంత్రణ నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని అధికారులు మరింత పెంపొందించుకోవాలని సూచించారు. నాణ్యమైన మందులు తయారుచేసే సంస్థలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, నాసిరకం మందుల విషయంలో మాత్రం 'జీరో టాలరెన్స్' విధానమే అమలు చేస్తామని స్పష్టం చేశారు.

**శాస్త్రీయ ప్రమాణాలే ప్రజల విశ్వాసానికి పునాది**

అమెరికా ఫార్మకోపియా ఇండియా సైట్ హెడ్ డాక్టర్ గిరీష్ కపూర్ మాట్లాడుతూ, మందుల నాణ్యత అంటే రోగుల విశ్వాసమని పేర్కొన్నారు. శాస్త్రీయ ప్రమాణాలు, శిక్షణ, అంతర్జాతీయ భాగస్వామ్యంతో నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు యూఎస్‌పీ కట్టుబడి ఉందన్నారు. ఆల్ ఇండియా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ, ఫార్మా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నియంత్రణ అధికారులకు నిరంతర శిక్షణ అవసరమన్నారు. ఏపీ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎం. పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ సవరించిన ఔషధ తయారీ సంస్థల ప్రమాణాలు షెడ్యూల్-ఎం అమలుకు అవసరమైన నైపుణ్యాన్ని అధికారులకు అందించడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, వివిధ హోదాల్లోని ప్రభుత్వ అధికారులు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు.



## నిందితులపై కఠిన చర్యలు

**రాజమహేంద్రవరం ప్రమాద ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

అమరావతి (చైతన్య రథం): రాజమహేంద్రవరంలో వాహనం ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వైద్య విద్యార్థులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసి ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. ఏలూరు రేంజ్ డీఐజీతో మాట్లాడి ప్రమాద ఘటనను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థులు ప్రియాంక, ఉమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

### ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రులకు
## రూ.162.72 కోట్ల చెల్లింపులు

**గడిచిన 4 నెలల్లో ఇప్పటివరకు మొత్తం రూ.1,504 కోట్లు జమ**

అమరావతి (చైతన్య రథం): డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద సేవలందిస్తున్న 721 ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రులకు రూ.162.72 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. ఈ మేరకు చెల్లింపులు కూడా పూర్తయ్యాయి. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు, ఆషా మధ్య కుదిరిన ఒప్పందం మేరకు 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఈ ఏప్రిల్ నుంచి ప్రైవేట్ నెట్వర్క్ ఆసుపత్రులకు బకాయిల చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు బీడీఏస్ ద్వారా రూ.1,108.48 కోట్లు ప్రైవేట్ ఆసుపత్రుల ఖాతాలకు జమయ్యాయి. ఇవి కాకుండా ప్రభుత్వం ద్వారా మరో 396.40 కోట్ల రూపాయలు ఆస్పత్రుల ఖాతాలకు చేరాయి. ఇలా.. రెండు పద్ధతుల్లో కలిపి ఇప్పటివరకు మొత్తం రూ.1,504.88 కోట్ల వరకు ప్రైవేట్ ఆస్పత్రులకు చెల్లించినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

### వైద్య సేవలు మెరుగుకు
# రూ.61 కోట్లతో 582 పరికరాలు

*- వెంటిలేటర్లు, ఎక్స్‌రే మిషన్లు సహా 20 కేటగిరీల వైద్య పరికరాలకు బీఎఫ్‌సీ గ్రీన్ సిగ్నల్*



అమరావతి (చైతన్య రథం): ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలను మెరుగుపర్చే ప్రక్రియలో భాగంగా వైద్యారోగ్య శాఖ రూ.61 కోట్ల వ్యయంతో వివిధ వైద్య పరికరాలను కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. వ్యాధి నిర్ధారణ సామర్థ్యాన్ని పెంచేందుకు, తల్లి మరియు నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు, ఎమర్జెన్సీ మరియు క్రిటికల్ కేర్ సేవలను మరింత పటిష్టం చేసేందుకు 20 రకాలకు చెందిన 582 వైద్య పరికరాలను గతంలో పిలిచిన టెండర్ల ద్వారా కొనుగోలు చేసేందుకు మంత్రిత్వ శాఖకు చెందిన బిడ్ ఫైనలైజేషన్ కమిటీ(బిఎఫ్‌సి) శుక్రవారంనాడు ఆమోదం తెలిపింది.

సమకూరనున్న పరికరాల వివరాలు

బిఎఫ్‌సి ఆమోదం మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) ఆసుపత్రుల్లో రూ.27 కోట్ల వ్యయంతో కీలకమైన 235 ఐసియూ వెంటిలేటర్లు సమకూరనున్నాయి. నవజాత శిశువుల ఆరోగ్య భద్రత కోసం డిఎంఇ ఆసుపత్రులకు రూ.11.50 కోట్ల వ్యయంతో 38 నియోనేటల్ వెంటిలేటర్లు లభించనున్నాయి. క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే ప్రయత్నంలో భాగంగా క్షయ వ్యాధి పరీక్షల కోసం రూ.22 కోట్ల వ్యయంతో ఏఐ ఆధారంగా పనిచేసే 100 పోర్టబుల్ హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే మెషీన్లను కొనుగోలు చేయనున్నారు.

రూ.70 లక్షల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీల కోసం 26 ఆటోమేటిక్ హెమటాలజీ ఎనలైజర్లు, క్రిటికల్ కేర్ బ్లాకుల కోసం రూ.1 కోటి వ్యయంతో వివిధ పరికరాలు, ఐ బ్యాంకుల కోసం రూ.30 లక్షల వ్యయంతో వివిధ పరికరాలు, ఔషధ నాణ్యత పరీక్షల కోసం రూ.70 లక్షల వ్యయంతో స్పెక్ట్రోమీటర్లు మరియు సెమీ మైక్రో ఎనలిటికల్ వెయింగ్ పరికరాలను కొనుగోలు చేసేందుకు బిఎఫ్‌సి ఆమోదించింది. వైద్యారోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ అధ్యక్షతన పలువురు ఉన్నతాధికారులతో కూడిన బిఎఫ్‌సి ఈమేరకు వైద్య పరికరాల కొనుగోలును ఆమోదించింది.

## జాబ్ చార్ట్ అమలులో నిర్లక్ష్యానికి తావివ్వొద్దు

- **వృత్తిపట్ల నిబద్ధత.. క్రమశిక్షణతో పనిచేయాలి**
- **నూతన ఆయుష్ వైద్యులకు కమిషనర్ రోణంకి హితవు**





**ప్రజారోగ్య కార్యక్రమాలపై శిక్షణ**

విజయవాడ (చైతన్య రథం): నూతనంగా విధుల్లో చేరిన ఆయుష్ వైద్యులు ప్రజాసేవనే పరమావధిగా భావించి, వృత్తిపట్ల పూర్తి నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాల్ కృష్ణ సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవలందించడంతో పాటు ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. నేషనల్ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన హోమియో, యునానీ వైద్యులకు విజయవాడ ఆటోనగర్‌లోని ఆయుష్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమం రెండో రోజు ఆయన మాట్లాడారు. నూతన వైద్యులకు విధులు, బాధ్యతలు, జాబ్ చార్ట్‌పై సమగ్ర అవగాహన కల్పించారు. ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల (ఏహెచ్‌డబ్ల్యూసీ - AHWC) నిర్వహణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయడం ప్రతి వైద్యుడి బాధ్యత అని చెప్పారు. జాబ్ చార్ట్‌లో నిర్దేశించిన విధులను తప్పనిసరిగా పాటిస్తూ, సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని సూచించారు.

శిక్షణలో భాగంగా నేషనల్ ఆయుష్ మిషన్ అమలు మార్గదర్శకాలు, అసాంక్రమిక వ్యాధుల (ఎన్‌సీడీ - ఎన్‌సీడీ) స్క్రీనింగ్, ఆయుష్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఏహెచ్‌ఎంఐఎస్ - AHMIS) ద్వారా నివేదికల నమోదు, ప్రజారోగ్య కార్యక్రమాల అమలు తదితర అంశాలపై అధికారులు, నిపుణులు నూతన వైద్యులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం మెడికల్ క్యాంప్ కిట్లను పంపిణీ చేశారు. మూడో రోజు శనివారం బడ్జెట్ కేటాయింపులు, ఆర్థిక నిర్వహణ, నేషనల్ ఆయుష్ మిషన్ పోర్టల్ నిర్వహణ, జిల్లా ఆయుష్ సొసైటీల సమన్వయంపై ప్రత్యేక సదస్సు నిర్వహించి శిక్షణ కార్యక్రమాన్ని ముగించనున్నారు.

# నేతన్నల కుటుంబాల్లో వెలుగులు నింపుతాం

- నేతన్నలు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మారాలి
- నేత కళను కాపాడుతూ ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు
- రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం రూరల్ (చైతన్య రథం): చేనేత రంగాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దేందుకు నేతన్నలు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంతోపాటు, ప్రస్తుత మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త డిజైన్లు, నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయాలని కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. శుక్రవారం రామచంద్రపురం రూరల్ మండలం ఆదివారపుపేటలోని శ్రీ శివ బాలయోగి మహారాజ్ చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం సమావేశ మందిరంలో నిర్వహించిన చేనేత నేతన్నల సంక్షేమం, పురోగతిపై ముఖాముఖిలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత కళ ప్రతీకగా నిలిచిందన్నారు. తరతరాలుగా ఈ కళను సజీవంగా ఉంచుతున్న నేతన్నల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని చేనేత కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి, చేనేత రంగం అభివృద్ధి చెందితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు.

**71,536 మంది నేతన్నలకు రూ.179 కోట్ల ఆర్థిక సాయం**

రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 71,536 మంది చేనేత కార్మికులకు రూ.179 కోట్ల ఆర్థిక సహాయాన్ని డీబీటీ పద్ధతి ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం నేతన్నల కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 'నేతన్న సేవలో' పథకం కింద 3,822 మంది నేతన్నలు లబ్ధి పొందుతున్నారని, ప్రతి అర్హుడికీ ఏడాదికి రూ.25,000 చొప్పున నేరుగా ఖాతాల్లో జమ



చేస్తున్నామని వివరించారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న చేనేత కార్మికులకు నెలకు రూ.4,000 చొప్పున పింఛన్ అందిస్తున్నామని, జిల్లాలో 3,863 మంది నేతన్నలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని తెలిపారు.

**ఉచిత విద్యుత్‌తో ఉత్పత్తి వ్యయం తగ్గింపు**

చేనేత కార్మికులపై విద్యుత్ భారం తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో 3,567 మంది నేతన్నలు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, మగ్గం ఆధారిత చేనేత కార్మికులకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం అనేక చేనేత సహకార సంఘాలు ప్రభుత్వ శాఖల ఆర్డర్లపైనే ఆధారపడుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడి ప్రైవేట్ రంగం, ఈ-కామర్స్ వేదికలు, దేశవ్యాప్త ఓపెన్ మార్కెట్లలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. దక్షిణ భారతదేశంతోపాటు ఉత్తర భారతదేశంలో కూడా చేనేత వస్త్రాలకు మంచి డిమాండ్ ఉందని, మార్కెట్ అభిరుచులను అధ్యయనం చేసి ఉత్పత్తులను రూపొందిస్తే ఆదాయం గణనీయంగా పెరుగుతుందని అన్నారు.

**కొత్త డిజైన్లతో యువతను ఆకర్షించాలి**

ప్రస్తుత తరం అభిరుచులకు అనుగుణంగా రంగులు, నమూనాలు, డిజైన్లు, వస్త్ర రకాల్లో నూతనత్వం తీసుకురావాలని మంత్రి సుభాష్ సూచించారు. వినియోగదారులను ఆకట్టుకునే నాణ్యమైన ఉత్పత్తులను రూపొందిస్తే చేనేత వస్త్రాలకు మరింత మార్కెట్ లభిస్తుందని చెప్పారు. ఆధునిక డిజైన్లతోపాటు సంప్రదాయ కళాత్మకతను జోడించి ఉత్పత్తులు రూపొందించడం ద్వారా యువతను కూడా చేనేత రంగం వైపు ఆకర్షించవచ్చని అభిప్రాయపడ్డారు.

**సబ్సిడీలు, రుణాలు, పనిముట్లతో పూర్తి సహకారం**

జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా అవసరమైన పనిముట్లను 90 శాతం వరకు సబ్సిడీతో అందిస్తున్నామని మంత్రి తెలిపారు. సహకార చేనేత కార్మికుల పొదుపు పథకం, చేనేత ముద్ర పథకం ద్వారా రుణ సదుపాయాలు, ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. చేనేత సహకార సంఘాలు స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. "చేనేత కళను కాపాడుదాం... నేతన్నల కుటుంబాలకు అండగా నిలుద్దాం... చేనేతను ప్రపంచ మార్కెట్లలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళదాం" అని మంత్రి సుభాష్ పిలుపునిచ్చారు. ముందుగా ఆదివారపుపేటలో తెలుగుదేశం పార్టీ రెండేళ్ల పాలన, సంక్షేమ విజయాలపై మంత్రి సుభాష్ డోర్-టు-డోర్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో హ్యాండ్లూమ్ ఏడీఓలు వెంకటేశ్వరరావు, జి. గుర్రాజు, రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, చేనేత కళాకారులు, సహకార సంఘాల ప్రతినిధులు, నేతన్నలు పాల్గొన్నారు.

## పోన్నమండ లక్ష్మణ స్వామికి మంత్రి కొల్లు రవీంద్ర నివాళి



విజయవాడ (చైతన్య రథం): అగ్నికుల క్షత్రియుల జాతిపిత స్వర్గీయ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈమేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, జిల్లా కలెక్టర్ లక్ష్మీషాతో కలిసి పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అగ్నికుల క్షత్రియుల చరిత్రను భవిష్యత్ తరాలకు చాటిచెప్పిన మహనీయుడు, ఆయుర్వేదంతో వేలాది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన గొప్పవ్యక్తి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులిచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

"సమాజంలో ప్రజల సమస్యలకు చలించి పొన్నమండ అండగా నిలిచారు. పేదల కోసం కోరంగిలో ఉచిత వైద్యశాల ఏర్పాటు చేశారు. అగ్నికుల క్షత్రియుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా పత్రికను నడిపించారు. తన కులాన్ని సమాజంలో చిన్నచూపు చూడడాన్ని సహించలేక చరిత్ర మొత్తాన్ని అధ్యయనం చేశారు. బ్రిటీష్ గ్రంథాలను సైతం అధ్యయనం చేసి.. బ్రిటీష్ ప్రభుత్వానికి ఆధారాలతో ఒప్పించి అగ్నికుల క్షత్రియులుగా గుర్తింపు తీసుకొచ్చారు. ప్రత్యేకంగా జీవో నెం.271/1929 తీసుకురావడం లక్ష్మణస్వామి వర్మ చిత్తశుద్ధికి నిదర్శనం. కుల మత వర్గాలకు అతీతంగా అందరి ఆదరాభిమానాలను సొంతం చేసుకున్న పొన్నమండ లక్ష్మణస్వామి వంటి మహనీయుల అడుగుజాడల్లో నడిచే అవకాశం లభించడం నా అదృష్టం" అని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు నిరాధారం

**- మంత్రి నారాయణ**



నెల్లూరు (చైతన్యరథం): మెగా డీఎస్సీతో 16వేల కుటుంబాల్లో వెలుగులు నింపిన కూటమి ప్రభుత్వంపై వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మండిపడ్డారు. మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేసి విఫలమైన వైసీపీ ఇప్పుడు ఉద్యోగాలు పొందిన యువత ఆనందాన్ని కూడా ఓర్వలేక నిరాహార దీక్షల పేరుతో రాజకీయ డ్రామాలు చేస్తోందని విమర్శించారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పర్యటనలో ఉన్న మంత్రి నారాయణ... వైసీపీ చేపడుతున్న నిరాహార దీక్షలపై మీడియా అడిగిన ప్రశ్నకు తీవ్రస్థాయిలో స్పందించారు. అసలు వారు ఏ ఉద్దేశంతో నిరాహార దీక్షలు చేస్తున్నారో ప్రజలకు కూడా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు.

మెగా డీఎస్సీ ద్వారా 16 వేల మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించామని, ప్రస్తుతం వారంతా సంతోషంగా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకోవడానికి వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేసినా ఎదురుదెబ్బ తగిలిందని గుర్తు చేశారు. 16వేల కుటుంబాల్లో వెలుగులు నింపిన ప్రభుత్వ విజయాన్ని చూసి వైసీపీ ఓర్వలేకపోతోందన్నారు. మరోవైపు వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. విద్య, ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ త్వరలో మరోసారి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయనున్నారని తెలిపారు. ఆ జాబ్ క్యాలెండర్ ద్వారా మరిన్ని ఉద్యోగాలు భర్తీ అవుతాయనే భయంతోనే వైసీపీ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్షం రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేస్తోందని, వైసీపీ తీరును ప్రజలు ఇప్పటికే ఛీత్కరిస్తున్నారన్నారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెప్తారని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

### ప్రజా సమస్యలపై అర్జీలను

## స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



బనగానపల్లె (చైతన్య రథం): క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అత్యంత ప్రాముఖ్యత కల్పించాల్సిన ఆవశ్యకత నెలకొందని రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజలనుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వీకరించారు. ప్రజలనుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం అభివృద్ధితో కూడిన సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితులనుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

చైతన్యరథం



# విశాఖకు 'నంబర్-1' కిరీటం..

*నారా లోకేష్ కార్యాచరణకు నిదర్శనం!*




- పోర్ట్ సిటీ నుంచి ఏఐ, ఐటీ హబ్‌గా విశాఖ రూపాంతరం
- పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పనలో కొత్త దిశ
- వేగంగా ఉద్యోగాలు కల్పిస్తున్న టాప్ నగరాల్లో నెం.1
- Cities on the Rise 2026' జాబితాలో వెల్లడించిన LinkedIn

విశాఖపట్నం పేరు మరోసారి దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. ఒకప్పుడు పోర్ట్, స్టీల్, పరిశ్రమలకు మాత్రమే గుర్తింపుగా ఉన్న విశాఖ.. ఇప్పుడు ఏఐ, ఐటీ, డేటా సెంటర్లు, టెక్నాలజీ, డిజిటల్ ఎకానమీకి కేంద్రంగా ఎదుగుతోంది. వైసీపీ హయాంలో గంజాయి, డ్రగ్స్ కు అడ్డాగా మారి తరచూ పేపర్‌లో నిలిచే విశాఖపట్నం నేడు ఏఐ, ఐటీ రంగాల్లో గ్లోబల్ స్థాయిలో గుర్తింపు లభించడానికి కారణం ఒక్కటే.. అదే నాయకత్వ మార్పు. నారా లోకేష్ ఐటీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటినుండి దేశ విదేశాలు తిరిగి రాష్ట్రంలో ఉన్న అపారమైన వనరుల గురించి వివరించి పెద్ద ఎత్తున పెట్టుబడులను తీసుకువస్తున్నారు. LinkedIn విడుదల చేసిన Cities on the Rise-2026 జాబితాలో విశాఖ నెం.1 కిరీటం దక్కించుకోవడం మంత్రి లోకేష్ కార్యాచరణకు నిదర్శనం.

ఈ జాబితాలో విశాఖపట్నం దేశంలోనే నంబర్-1గా నిలిచింది. ఉద్యోగ నియామకాలు వేగంగా పెరగడం, ఉద్యోగాలకు డిమాండ్ పెరగడం, కొత్త ప్రతిభ నగరంలో స్థిరపడటం వంటి LinkedIn డేటా ఆధారంగా ఈ ర్యాంకింగ్ రూపొందించారు. ఇది కేవలం ఒక ర్యాంకింగ్ కాదు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడులు, పరిశ్రమలు, టెక్నాలజీ, ఉద్యోగాల కల్పనలో సాధిస్తున్న పురోగతికి లభించిన అంతర్జాతీయ గుర్తింపుగా దీనిని చూడవచ్చు.

## రిలయన్స్ నుంచి ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వరకు..

విశాఖ అభివృద్ధి ఒక్క ప్రాజెక్టుతో ఆగిపోలేదు. LinkedIn తన నివేదికలో విశాఖ ఎదుగుదలకు గూగుల్, రిలయన్స్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి సంస్థల కార్యకలాపాలను ప్రస్తావించింది. ప్రత్యేకంగా రిలయన్స్‌కు చెందిన రూ. 1.6 లక్షల కోట్ల డేటా సెంటర్ ప్రాజెక్ట్, అలాగే ప్రముఖ ఐటీ సంస్థల క్యాంపస్‌లు విశాఖను కొత్త తరహా ఉద్యోగాలు, పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా మారుస్తున్నాయి. గతంలో కార్యకలాపాలు నిలిపేసి విశాఖ నుండి తరలిపోయిన ఐబీఎం సంస్థ తాజాగా తిరిగి వచ్చి కార్యకలాపాలు మొదలుపెట్టింది. ఈ కంపెనీ తిరిగి రావడంలో మంత్రి లోకేష్ పాత్ర క్రియాశీలకం. వీటిని చూస్తుంటేనే తెలుస్తుంది విశాఖలో జరుగుతున్న మార్పు కేవలం ప్రభుత్వ ప్రకటనల్లో కాదు... ఆచరణలో అని. పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల

> **విశాఖకు కొత్త దిశ.. కొత్త నాయకత్వం**
>
> *గతంలో విశాఖకు పారిశ్రామిక నగరంగా బలమైన పునాది ఉన్నప్పటికీ.. కూటమి ప్రభుత్వం వచ్చాక దాని సామర్థ్యాన్ని మరింత విస్తృతంగా వినియోగించుకునే ప్రయత్నాలు వేగం పుంజుకున్నాయి. ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఏఐ, డేటా సెంటర్లు, గ్లోబల్ టెక్నాలజీ సంస్థలను విశాఖకు తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ క్రమంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి లోకేష్ పెట్టుబడుల ఆకర్షణ, టెక్నాలజీ సంస్థల విస్తరణ, ఉద్యోగాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రపంచంలోని ప్రముఖ కంపెనీలతో చర్చలు జరపడం, ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించడం, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. దాని ఫలితాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా కనిపిస్తున్నాయి.*

ఏర్పాటు, ఉద్యోగాల కల్పన, నూతన ప్రతిభ గుర్తింపు, ప్రోత్సాహం, ఆర్థికవృద్ధి అనే ఒక పూర్తి ఎకోసిస్టమ్ రూపుదిద్దుకుంటోందని కూడా LinedIn నివేదిక స్పష్టం చేసింది.

## నివేదిక చెప్పింది ఇదే...

ఆ నివేదికలో ఇచ్చిన ర్యాంకింగ్‌ను నగరాలపై ప్రభుత్వ గణాంకాల ఆధారంగా కాకుండా LinkedInలో నమోదైన నియామకాల వృద్ధి, ఉద్యోగ డిమాండ్, ప్రతిభావంతుల కదలికవంటి అంశాల ఆధారంగా రూపొందించింది. అందులో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలవడం ప్రతి ఆంధ్రుడికి గర్వకారణం. విశాఖలో అత్యధికంగా ఐటీ, కెమికల్ మాన్యుఫాక్చరింగ్, టెక్, సమాచార, నెట్ సేవా రంగాల్లో అత్యధికంగా నియామకాలు జరుగుతున్నట్లు LinkedIn తెలిపింది. అదే సమయంలో LinkedIn డేటా ప్రకారం విశాఖలో 17.1 శాతం ఉద్యోగాలు రిమోట్, 5.2 శాతం ఉద్యోగాలు హైబ్రిడ్ విధానంలో ఉన్నాయి. అంటే విశాఖ ఉద్యోగ మార్కెట్ సంప్రదాయ పరిశ్రమలను దాటి కొత్త తరం టెక్నాలజీ, డిజిటల్ ఉద్యోగాల వైపు కూడా కదులుతోందని తెలుస్తుంది.

## లోకేష్ సమర్థతకు నిదర్శనం...

LinkedIn గుర్తించిన ఉద్యోగాల వృద్ధి, టెక్నాలజీ రంగ విస్తరణ, కొత్త పెట్టుబడులు, కొత్త టాలెంట్‌కు విశాఖ ఆకర్షణ వంటి పరిణామాలు.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెట్టుబడులు, టెక్నాలజీ, ఉద్యోగాలపై తీసుకున్న నిర్ణయాలతో అనుసంధానమై ఉన్నాయి. ఈ మార్పుకు ఐటీ, పరిశ్రమలు, టెక్నాలజీ పెట్టుబడులను ముందుకు తీసుకెళ్లడంలో మంత్రి లోకేష్ చురుకైన కార్యాచరణ ఒక ముఖ్యమైన భాగం. పెట్టుబడిదారులతో నిరంతర చర్చలు, గ్లోబల్ కంపెనీలను రాష్ట్రానికి ఆహ్వానించడం, టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వడం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధానాలపై దృష్టి పెట్టడం వంటి చర్యలు విశాఖను కొత్త ఆర్థిక గమ్యస్థానంగా నిలబెట్టే ప్రయత్నాలకు బలాన్నిచ్చాయి.

## గతంలో కనిపించని మార్పు...

విశాఖలో గతంలో కూడా పరిశ్రమలు ఉన్నాయి. పోర్ట్ ఉంది. స్టీల్ ప్లాంట్ ఉంది. ఫార్మా రంగం ఉంది. అంటే విశాఖకు ఆర్థిక పునాది ఎప్పటినుంచో ఉంది. కానీ నాయకత్వ లోపం వలన సాధ్యపడలేదు. 2014-19 మధ్య అనేక పరిశ్రమలను వచ్చినా 2019 తర్వాత వచ్చిన వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం వాటిని కొనసాగించలేదు. ఎకో సిస్టమ్‌ను నిలిపివేశారు. దాంతో కొత్త కంపెనీలు రాకపోగా ఉన్న పరిశ్రమలు తరలిపోయాయి. ఉద్యోగాల కల్పన నిలిచిపోయింది. కానీ ఇప్పుడు 2014లో పడిన ఆర్థిక పునాదికి ఏఐ, ఐటీ, డేటా సెంటర్లు, డిజిటల్ ఎకానమీ అనే కొత్త స్తంభాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మంత్రి లోకేష్ జతపరిచారు. ఇదే అసలు మార్పు. విశాఖను కేవలం పరిశ్రమల నగరంగా కాకుండా.. భవిష్యత్ ఉద్యోగాల నగరంగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. అందుకే LinkedIn ర్యాంకింగ్‌ను కేవలం ఒక అవార్డుగా చూడకూడదు. ఇది విశాఖ ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్న మార్పుకు కనిపిస్తున్న ఒక డేటా ఆధారిత సంకేతం. నాయకత్వం మారితే.. ఫలితాలు ఎలా మారతాయో విశాఖ చెబుతోంది. ఒక ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించడంలో ఎంత చురుగ్గా పనిచేస్తుంది? ప్రపంచ స్థాయి కంపెనీలను రాష్ట్రానికి ఎలా తీసుకువస్తుంది? యువతకు భవిష్యత్ ఉద్యోగాలను ఎలా సృష్టిస్తుంది? ఒక నగర సామర్థ్యాన్ని ప్రపంచ స్థాయికి ఎలా తీసుకెళ్తుంది? విశాఖలో కనిపిస్తున్న పరిణామాలు ఈ ప్రశ్నలకు సమాధానం చెబుతున్నాయి.

చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం.. మంత్రి లోకేష్ కార్యాచరణతో పెట్టుబడులు, టెక్నాలజీ, ఉద్యోగాలపై కొత్త దృష్టితో ముందుకు సాగుతోంది. దానికి ప్రత్యక్షంగా కనిపిస్తున్న ఫలితాల్లో ఒకటి LinkedIn Cities on the Rise -2026లో విశాఖపట్నానికి దక్కిన నంబర్-1 స్థానం. ఇది కేవలం ఒక ర్యాంకు కాదు.. మారుతున్న విశాఖకు గుర్తింపు. ఇది కేవలం ఒక గుర్తింపు కాదు.. కొత్త పెట్టుబడులు, కొత్త ఉద్యోగాలు, కొత్త టెక్నాలజీకి నిదర్శనం. ఇది కేవలం ఒక నగర విజయం కాదు.. యువత భవిష్యత్తు కోసం లోకేష్ చేపడుతున్న కార్యాచరణకు కనిపిస్తున్న సానుకూల సంకేతం. పోర్ట్ సిటీగా ప్రారంభమైన విశాఖ.. ఇప్పుడు ఏఐ సిటీగా ఎదుగుతోంది. ఈ మార్పును ూఱఅసవసఱఅ గుర్తించింది.ఆ మార్పు వెనుక ఉన్న పెట్టుబడుల దిశను.. కూటమి ప్రభుత్వం చూపిస్తోంది. ఆ దిశలో వేగం పెంచుతున్న కార్యాచరణకు నారా లోకేష్ నాయకత్వం బలాన్నిస్తోంది.

> **గూగుల్ ఏఐ హబ్.. విశాఖకు గ్లోబల్ టెక్ గుర్తింపు**
>
> *విశాఖ రూపాంతరంలో అత్యంత కీలకమైన పరిణామాల్లో గూగుల్ ప్రతిపాదించిన 15 బిలియన్ డాలర్ల ఏఐ హబ్ ఒకటి. ఏఐ, డేటా సెంటర్లు, క్లౌడ్, డిజిటల్ మౌలిక వసతుల ఆధారంగా ఏర్పడనున్న ఈ భారీ ప్రాజెక్ట్ విశాఖను ప్రపంచ టెక్నాలజీ మ్యాప్‌లో నిలబెట్టే స్థాయిలో ఉంది. ఇది కేవలం ఒక కంపెనీ పెట్టుబడి మాత్రమే కాదు. ఏఐ ఆధారిత కొత్త ఆర్థిక వ్యవస్థకు విశాఖను కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం. రాష్ట్ర అభివృద్ధికి ఇదొక గేమ్ ఛేంజర్ ప్రాజెక్ట్. ఇలాంటి పెట్టుబడులు వస్తే వాటి చుట్టూ అనేక అనుబంధ పరిశ్రమలు, స్టార్టప్‌లు, సర్వీసులు, నైపుణ్య ఆధారిత ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. తద్వారా విశాఖకు కొత్త టాలెంట్ రావడంతో పాటు స్థానిక యువతకు కూడా కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాజెక్టు రాకతో సుమారు 1.80 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. గూగుల్ రాకతో మరిన్ని అంతర్జాతీయ సంస్థల కన్ను విశాఖపైనే పడింది. ఏ గ్లోబల్ సంస్థ అయినా భారతదేశంలో పెట్టుబడి పెట్టాలనుకుంటే మొదట వారు ఎంచుకుంటుంది విశాఖనే.*




**ఎం.వి.ప్రణవ్ గోపాల్,**
చైర్మన్, విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ
(VMRDA)

చైతన్యరథం




# పోర్టుల తీరం... ప్రగతి హారం

- పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ చారిత్రాత్మక ప్రగతి
- పోర్టులు, ఎయిర్‌పోర్టులు, డ్రోన్లతో ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ రూపాంతరం
- ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాచరణతో రూ.2.03 లక్షల కోట్ల పెట్టుబడులు

**ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా, అత్యాధునిక మౌలిక సదుపాయాల కేంద్రంగా, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో పెట్టుబడులు-మౌలిక సదుపాయాల శాఖలో సమగ్ర సంస్కరణలు చేపట్టింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దూరదృష్టితో రూపొందించిన కార్యాచరణ ఫలితంగా పోర్టులు, విమానాశ్రయాలు, అంతర్గత జలమార్గాలు, ఫైబర్‌నెట్, డ్రోన్ టెక్నాలజీ, సైన్స్ సిటీ వంటి అనేక రంగాల్లో వేగవంతమైన అభివృద్ధి నమోదైంది. రాష్ట్ర అభివృద్ధికి మౌలిక సదుపాయాలే పునాది అనే భావనతో ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ భారత ఆర్థిక వ్యవస్థలో కీలక కేంద్రంగా నిలబెట్టే దిశగా ముందుకు తీసుకెళ్తున్నాయి.**

### మారిటైమ్ రంగంలో స్వర్ణయుగానికి నాంది

సుమారు 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీర రేఖ కలిగిన ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ సముద్ర వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఏపీ మారిటైమ్ పాలసీ 2024-29 అమలు చేస్తోంది. పోర్టులు, రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాలు, అంతర్గత జలమార్గాలను ఒకే రవాణా వ్యవస్థగా అనుసంధానించి లాజిస్టిక్స్ ఖర్చును తగ్గించడం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. దాదాపు రూ.14వేల కోట్ల పెట్టుబడులతో నిర్మితమవుతున్న ఈ పోర్టులు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు ఇవ్వనున్నాయి. రామాయపట్నం పోర్టు 78.48 శాతం, మూలపేట పోర్టు 75.5 శాతం, మచిలీపట్నం పోర్టు 57.78 శాతం పనులు పూర్తి చేసుకోగా... కాకినాడ గేట్‌వే పోర్టు 41 శాతం పురోగతితో కొనసాగుతోంది. రాబోయే కాలంలో ఈ పోర్టులు పూర్తి కావడం ద్వారా ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్యానికి ప్రధాన ద్వారంగా మారనుంది.

### మత్స్యకారులకు ఆధునిక హార్బర్ల వరం

రాష్ట్రంలోని మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేసేందుకు ఒకేసారి నాలుగు ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి చేపట్టడం విశేషం. జువ్వలదిన్నె, ఉప్పాడ, నిజాంపట్నం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ల పనులు చివరి దశకు చేరుకున్నాయి. రెండో దశలో బుడిగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, ఓడరేవు వంటి ప్రాంతాల్లో కొత్త హార్బర్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిధుల సమీకరణ జరిగింది. దీంతో సముద్ర మత్స్య రంగంలో ఉత్పత్తి, ఎగుమతులు, ఉపాధి అవకాశాలు మరింత పెరగనున్నాయి.

### దుగ్గరాజపట్నం మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్

దుగ్గరాజపట్నాన్ని దేశంలోనే అతి పెద్ద మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్‌గా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయ అనుమతి ఇవ్వడం రాష్ట్రానికి కీలక మైలురాయి. సుమారు 3,500 ఎకరాల భూమిలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తూ నౌకా నిర్మాణం, మరమ్మతులు, భారీ పరిశ్రమలకు కొత్త అవకాశాలు సృష్టిస్తున్నారు.

### ఏపీ లింక్-లాజిస్టిక్స్‌కు కొత్త దిశ

రాష్ట్ర లాజిస్టిక్స్ రంగాన్ని ఆధునికీకరించేందుకు ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ &ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (AP LINK) ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. సరుకు రవాణా వేగవంతం చేయడం, పరిశ్రమలకు తక్కువ వ్యయంతో రవాణా సదుపాయాలు కల్పించడం, పెట్టుబడులను మరింత ఆకర్షించడం ఈ సంస్థ లక్ష్యం.



### విమానయాన రంగంలో చారిత్రాత్మక పురోగతి

ఆంధ్రప్రదేశ్‌ను ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం 2025-30 ఏరోస్పేస్ & డిఫెన్స్ పాలసీ రూపొందించింది. లక్ష కోట్ల పెట్టుబడులు, లక్ష ఉద్యోగాల లక్ష్యంతో ఈ రంగాన్ని వేగంగా అభివృద్ధిచేస్తోంది.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం 99.35శాతం పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న విమానాశ్రయాలతో పాటు మరో తొమ్మిది గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాల అభివృద్ధికొనసాగుతోంది. కుప్పం, శ్రీకాకుళం, అమరావతి, నాగార్జున సాగర్ విమానాశ్రయాలకు TEFR పూర్తి కాగా దగదర్తి విమానాశ్రయం టెండరు దశలో ఉంది. రాష్ట్రంలో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య ఏటా 17 శాతం, అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య 14 శాతం వృద్ధి నమోదు చేస్తుండటం విమానయాన రంగంలో పెరుగుతున్న అవకాశాలకు నిదర్శనం. కర్నూలు, రాజమండ్రిల్లో ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్లు ప్రారంభం కానుండగా వాటర్ ఏరోడ్రోమ్‌ల అభివృద్ధి ద్వారా పర్యాటక రంగానికి కొత్త ఊపు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

### వాటర్ ఏరోడ్రోమ్‌లు-సీప్లేన్ సేవలకు మార్గం

ప్రకాశం, శ్రీశైలం, గండికోట, విశాఖపట్నం, కాకినాడ, అరకు, లంబసింగి, తిరుపతి, కోనసీమ ప్రాంతాల్లో వాటర్ ఏరోడ్రోమ్‌ల అభివృద్ధికి డీపీఆర్ లు సిద్ధమయ్యాయి. సీప్లేన్ సేవల ద్వారా పర్యాటకాభివృద్ధి, చివరి మైలు కనెక్టివిటీ, దూర ప్రాంతాల అనుసంధానం మరింత మెరుగుపడనుంది.

### ఫైబర్‌నెట్‌కు పునరుజ్జీవం

గతంలో నిర్వీర్యమైన ఏపీ ఫైబర్‌నెట్ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం కల్పించింది. అమండెడ్ భారత్ నెట్ పథకం కింద రూ.2,800 కోట్లతో గ్రామీణ ప్రాంతాలకు నాణ్యమైన బ్రాడ్ బ్యాండ్ సేవలు విస్తరించే కార్యక్రమం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ భారత్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (APBIL) అనే ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి ప్రాజెక్టు అమలుకు చర్యలుచేపట్టారు. APSFL వెబ్‌సైట్ ఆధునికీకరణ,ప్రీపెయిడ్ బిల్లింగ్ విధానం, డిజిటల్ చెల్లింపులు, వాట్సాప్ సమాచార వ్యవస్థ, CPE ఛార్జీల తగ్గింపు వంటి సంస్కరణల ద్వారా వినియోగదారులకు మెరుగైనసేవలు అందిస్తున్నారు.

### డ్రోన్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా దిశగా అడుగులు

ఆంధ్రప్రదేశ్‌ను డ్రోన్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం డ్రోన్ పాలసీ 2024-29 అమలుచేస్తోంది. అమరావతిలో నిర్వహించిన డ్రోన్ సమ్మిట్,ప్రపంచస్థాయి డ్రోన్ షోలు రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు తీసు కొచ్చాయి. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో దేశంలోనే తొలి డ్రోన్ సిటీని 300ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే 14 పెట్టుబడి ప్రతిపాదనలు పరిశీలనలో ఉండగా మూడు ప్రముఖసంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయి. వ్యవసాయం, విపత్తు నిర్వహణ, పోలీసింగ్, మౌలిక సదుపాయాల పరిశీలన, ఆరోగ్య సేవలు వంటి అనేక రంగాల్లో డ్రోన్ వినియోగాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. డిజిటల్ డ్రోన్ పోర్టల్ ద్వారా 80కి పైగా విక్రేతలు, 122 వినియోగ నమూనాలు అందుబాటులోకి రావడం ఈ రంగంలో రాష్ట్ర ప్రాధాన్యతను చాటుతోంది.




### అంతర్గత జలమార్గాలకు కొత్త ఊపు

కృష్ణా, గోదావరి నదులను ఆధారంగా చేసుకుని అంతర్గత జల రవాణాను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. విజయవాడ-శ్రీశైలం సీప్లేన్ మార్గం కోసం బాతిమెట్రిక్ సర్వేలు పూర్తయ్యాయి. గోదావరి, గండికోట, మైలవరం ప్రాంతాల్లో కమర్షియల్ క్రూయిజ్ సేవలకు అధ్యయనాలు జరిగాయి. ముక్త్యాల-మచిలీపట్నం, నిడదవోలు-కాకినాడ జల రవాణా కారిడార్లు, విజయవాడ-అమరావతి, విశాఖపట్నంల్లో వాటర్ మెట్రో ప్రతిపాదనలు, కమ్యూనిటీ జెట్టీలు, బకింగ్‌హామ్ కెనాల్ పునరుద్ధరణ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర జల రవాణా రంగానికి కొత్త దిశను చూపుతున్నాయి.

### పెట్టుబడుల వరద-అభివృద్ధికి నూతన అధ్యాయం

విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు, SIPB సమావేశాల ద్వారా దాదాపు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు, 24లక్షల ఉద్యోగ అవకాశాలు రాష్ట్రానికి లభించడం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. పెట్టుబడులు-మౌలిక సదుపాయాలశాఖ పరిధిలో మాత్రమే 40 ప్రతిపాదనల ద్వారా రూ.2.03లక్షల కోట్ల పెట్టుబడులు, 3.09 లక్షల ఉద్యోగ అవకాశాలు ప్రతిపాదించబడ్డాయి. ఇందులో మారిటైమ్ రంగంలో రూ.1.67 లక్షల కోట్లతో 27 ప్రతిపాదనలు, విమానాశ్రయ అభివృద్ధిలో రూ.36వేల కోట్లతో 13 ప్రతిపాదనలు ఉన్నాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, మెరుగైన మౌలిక సదుపాయాలు, శాంతి భద్రతలు, పారదర్శక విధానాలతో రాష్ట్రంపై పెట్టుబడిదారుల విశ్వాసం గణనీయంగా పెరిగింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో భారీ పెట్టుబడులు తీసుకొచ్చి సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది.

### సైన్స్ సిటీ-విజ్ఞానానికి కొత్త దిశ

గ్రామీణ విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెంచేందుకు ప్రభుత్వం ఏపీ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టింది. బనగానపల్లెలో వన్‌డే స్పేస్‌ఎడ్యుకేషన్ క్యాంప్ ప్రారంభించి పది జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించింది. "సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్ టు న్యూఢిల్లీ" ద్వారా ప్రభుత్వ పాఠశాలల 52 మంది విద్యార్థులకు తొలిసారిగా విమాన ప్రయాణం కల్పించి శాస్త్రీయ సంస్థలను సందర్శించే అవకాశం కల్పించింది. దేశంలోనే తొలిసారిగా నిర్వహించిన 'సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్-2026' ద్వారా పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించింది.

### భవిష్యత్ ఆంధ్రప్రదేశ్‌కు బలమైన పునాది

పోర్టులు, విమానాశ్రయాలు, జలమార్గాలు, ఫైబర్‌నెట్,డ్రోన్ టెక్నాలజీ, లాజిస్టిక్స్, పెట్టుబడులు, సైన్స్ రంగాల్లో గత రెండేళ్లలో నమోదైన పురోగతి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశను స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వేగవంతమైన కనెక్టివిటీ, అత్యాధు నిక సాంకేతికత, భారీ పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగ అవకాశాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోంది. 'పోర్టు నుంచి ప్రపంచ మార్కెట్ వరకు... గ్రామం నుంచి గ్లోబల్ పెట్టుబడుల వరకు' అనే లక్ష్యంతో చేపట్టిన ఈఅభివృద్ధి ప్రయాణం రాబోయే దశాబ్దాల్లో ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశ అభివృద్ధి ఇంజిన్‌గా నిలబెట్టే బలమైన పునాదిగా నిలవనుంది.

**శశికుమార్**
తెలుగుదేశం సైనికుడు



## నేతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు




గాజువాక (చైతన్యరథం): జాతీయ చేనేత దినోత్సవాన్ని గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అధికారికంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చేనేత రంగం రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. నేతన్నల సంక్షేమం, చేనేత పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, వారికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తున్నామని చెప్పారు. చేనేత వస్త్రాలను ప్రజలు ఎక్కువగా వినియోగించడం ద్వారా నేతన్నలకు ఉపాధి, ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నేతన్నల సేవలో పథకానికి 250 కోట్లు వెచ్చిస్తూ 52 వేల మంది అర్హులకు 25 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది అని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం నేతన్నల ఆశలపై నీళ్లు చల్లిందని ఆరోపించారు. బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి డి.వి సత్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త, ఏపీ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, స్వర్ణపూడి రాంబాయి, మాజీ కార్పొరేటర్ బొండా జగన్, విల్లా రామ్మోహన్ కుమార్, నల్లూరు సూర్య నారాయణ, గోమాడ వాసు, పప్పు అప్పారావు, దొడ్డి మల్లేశ్వరరావు, కనక భవానీ ప్రజాప్రతినిధులు, చేనేత కార్మికులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి స్థానాలు కైవసం చేసుకోవాలి

**●సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం : అరకు పరిశీలకులు మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్**



అరకు (చైతన్యరథం):సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజదీష్ వ్యాఖ్యానించారు. శుక్రవారం అరకు నియోజకవర్గం దుంబ్రిగూడ మండలంలో జరిగిన సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, అరకు ఇన్‌ఛార్జ్ దన్ను దొర పర్యవేక్షణలో దుంబ్రిగూడ మండల అధ్యక్షులు కిల్లో ఆనందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ చేపట్టిన రెండు ఏళ్ళ నమ్మకం – సంక్షేమం– అభివృద్ధి – ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం 12వ రోజున జరుపుకుంటున్నామని, ఇప్పటికే పెదబయలు, అరకు వ్యాలీ, అనంతగిరి మండలాల్లో ప్రజల నుండి విశేషమైన ఆదరణ చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నప్పుడు ఆప్యాయంగా ప్రజల నుండి స్పందన చూస్తుంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వం యువ నాయకుడు నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న కార్యక్రమాలకు ప్రజల మద్దతు కనిపిస్తుందని, స్థానిక సంస్థలు ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన, బీజేపీ పోటీ చేయబోయే స్థానాలను కైవసం చేసుకోవడానికి మూడు పార్టీలు సమిష్టి కృషితో పనిచేసే విజయం సాధించాలని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో తుడుము సుబ్బారావు రాష్ట్ర డైరెక్టర్ కనీస వేతనం కార్పొరేషన్, తడబారికి చిన్ని గున్న అరకు పార్లమెంట్ అధికారి ప్రతినిధి, కొర్ర ధన్నేరావు సీనియర్ నాయకులు పొంగి సుబ్బారావు, పిఎసిఎస్ డైరెక్టర్, మాంద్యగురి స్వామి టిఎన్టియుసి అరకు పార్లమెంట్ అధ్యక్షులు కొర్ర నాగరాజు, కస్టర్ ఇంచార్జ్ బురిడి కొములు నాయుడు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్‌ను ప్రధాని మోదీ ప్రశంసించారు : ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం ఢిల్లీలో ప్రధాని మోదీని కుటుంబ సమేతంగా కలిశారు. ఈ సందర్భంగా విజయనగరం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని చేనేత కార్మికులు స్వయంగా నేసిన దుస్తులను ప్రధానికి కలిశెట్టి కుటుంబసభ్యులు కానుకగా అందించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమం గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ ఈవెంట్ను నిర్వహించిన తీరు అత్యంత అద్భుతంగా ఉందని కితాబు ఇచ్చారు. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆర్గనైజేషన్ స్కిల్స్, కార్యక్రమాన్ని నిర్వహించిన విధానం చాలా బాగున్నాయని మోదీ ప్రశంసించారని ఎంపీ కలిశెట్టి పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో పరిపాలన సాగుతుండటం పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని ఎంపీ కుమార్తె కలిశెట్టి నిఖిల ప్రధాని దృష్టికి తెచ్చారు. ప్రధాని కూడా ఆ వ్యాఖ్యలతో ఏకీభవించారని ఎంపీ తెలిపారు. కలిశెట్టి అప్పలనాయుడి క్రమశిక్షణను ప్రధాని మోదీ ఈ సందర్భంగా కొనియాడారు. అప్పలనాయుడు ఎంతో క్రమశిక్షణ కలిగిన ప్రజాప్రతినిధి అని, పార్లమెంటు సమావేశాలకు ప్రతిరోజూ సైకిల్పై రావడం తాను గమనించినట్లు ఎంపీ కుటుంబసభ్యులకు ప్రధాని తెలిపారు.

## రాజమహేంద్రవరంలో ఇంటింటికి తెలుగుదేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): స్థానిక 9వ డివిజన్లో “రెండేళ్ల నమ్మకం... అభివృద్ధి – సంక్షేమం” కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన డోర్ టూ డోర్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణు గోపాల రాయుడు, డివిజన్ ఇన్‌ఛార్జ్ కోసూరి చండిప్రియ తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సేవలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రజలు తెలిపిన స్థానిక సమస్యలను ఎమ్మెల్యే స్వయంగా నమోదు చేసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని, ప్రజల విశ్వాసమే తమకు మరింత బాధ్యతను పెంచిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి : మంత్రి అచ్చెన్నాయుడు



కోటబొమ్మాళి (చైతన్యరథం): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కోటబొమ్మాళి మండలం తిలారు గ్రామంలో పర్యటించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు విరివిగా మొక్కలు నాటడంతో పాటు, నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు పచ్చదనం పెంపొందించడం ఎంతో అవసరమని మంత్రి పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో పచ్చదనం పెంపొందించేలా ప్రజలు, యువత పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలా చూసుకుంటాం

**: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**



విశాఖపట్నం (చైతన్యరథం): ప్రమాదవశాత్తు మరణించిన 66వ వార్డు అజిమాబాద్ టీడీపీ క్రియాశీల కార్యకర్త అబ్దుల్ సుభాన్ సతీమణికి రూ.5 లక్షల పార్టీ బీమా నగదును గాజువాక శాసనసభ్యులు ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అందజేశారు. అజిరాబాద్‌లోని వారి ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యకర్తలను టీడీపీ కంటికి రెప్పలా చూసుకుంటుందని, రూ.100తో పార్టీ సభ్యత్వం తీసుకుంటే ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వార్డ్ టీడీపీ అధ్యక్షులు గోవాడ వాసు, మాజీ కార్పొరేటర్ ఎండి రఫీ, ప్రధాన కార్యదర్శి ఎండి ముర్తాజ, గాజువాక నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కె రహిమాన్, ప్రధాన కార్యదర్శి బడా బాబు, మసీద్ పెద్దలు మదీనా వలి ఎండి మోతీ, ఎండి ఆఫీస్ బాస ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## చేనేత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది

**● రాజమహేంద్రవరంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రూరల్ నియోజకవర్గం కడియం మండలం పొట్టిలంక గ్రామం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పొట్టిలంక గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, టీడీపీ యువ నాయకులు, ఆరోగ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్ కిరణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కూటమి నాయకులు కడియం మండల ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, apiic డెరెక్టర్ మార్గని సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మజ్జి పద్మావతి, amc వైస్ చైర్మన్ బోడపాటి గోపి, కడియం మండల అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్, సూరపురెడ్డి జానకిరామయ్య, జనసేన నాయకులు గట్టి.సుబ్బారావు, వైస్ ఎంపీపీ కలడింది విశాలాక్షి గోవింద్, చెల్లుబోయిన శ్రీనివాస్, మత్సేటీ శివప్రసాద్, పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గోరంట్ల రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ... చేనేత కార్మికుల శ్రమ దేశ సంపద అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ‘నేతన్న నేస్తం’ పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తూ చేనేత రంగాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేనేత కుటుంబాల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ విద్య, వైద్యం, సీఎం రిలీఫ్ ఫండ్ తదితర అంశాల్లో సహాయం అందిస్తున్నారని కొనియాడారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : మంత్రి కొండపల్లి

విజయనగరం (చైతన్యరథం): విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం గజపతినగరం బ్రహ్మకుమారీస్ ఆశ్రమ ప్రాంగణంలో నషాముక్త్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆగస్టు 4న ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా నషాముక్త కార్యక్రమాన్ని వర్చువల్గా ప్రారంభించినట్లు తెలిపారు. బ్రహ్మకుమారీస్, కేంద్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండాలని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. 10 కోట్ల మందిని వ్యసనాల నుంచి విముక్తి చేయటమే ధ్యేయంగా బ్రహ్మకుమారీస్ సంస్థ పనిచేస్తోందని వివరించారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# తుని రైల్వే స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు కమర్షియల్ హాల్ట్ కల్పించాలి

**●కేంద్ర రైల్వే మంత్రిని కోరిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు**



న్యూఢిల్లీ / కాకినాడ (చైతన్యరథం): కీలక వాణిజ్య, రవాణా కేంద్రంగా అభివృద్ధి చెందిన తుని ప్రాంత ప్రజల చిరకాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (రైలు నెంబర్ 20833/20834)కు తుని రైల్వే స్టేషన్‌లో కమర్షియల్ హాల్ట్ కల్పించాలని రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను న్యూఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేసిన ఎంపీ సానా సతీష్ బాబు, విశాఖపట్నం-సామర్లకోట మధ్య సుమారు 151 కిలోమీటర్ల పొడవైన రైల్వే మార్గంలో ప్రస్తుతం వందే భారత్‌కు ఎలాంటి స్టాప్ లేదని, తునిలో కేవలం రెండు నిమిషాల హాల్ట్ కల్పించడం ద్వారా వేలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. తుని కీలక వాణిజ్య, రవాణా కేంద్రంగా అభివృద్ధి చెందిందని, పాయకరావుపేట, కొత్తనందూరు, ప్రత్తిపాడు, రౌతులపూడి, యేలేశ్వరం, నర్సీపట్నం డివిజన్ పరిధిలోని ప్రజలకు ప్రధాన రైల్వే కేంద్రంగా సేవలందిస్తోందన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, రైతులు, పారిశ్రామిక కార్మికులు పెద్ద సంఖ్యలో విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు ప్రయాణిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా, తుని కీలక వాణిజ్య, పారిశ్రామిక, రవాణా కేంద్రంగా ఎదిగిందని, నక్కపల్లి ఇండస్ట్రియల్ కారిడార్, సెజ్‌లు, అన్నవరం దేవస్థానం, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు కూడా ఈ హాల్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించి, రైల్వే బోర్డు ద్వారా పరిశీలించనున్నట్లు హామీ ఇచ్చినట్లు ఎంపీ సానా సతీష్ బాబు తెలిపారు.

# లంక భూముల సమస్యలపై ప్రభుత్వ చీఫ్ సెక్రటరీని కలిసిన కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు వీరంకి



విజయవాడ (చైతన్యరథం): కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏపీ గౌడ సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి శుక్రవారం ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్‌ను కలిసి తోట్లవల్లూరు లంక భూముల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గురుమూర్తి స్పెషల్ చీఫ్ సెక్రటరీతో మాట్లాడుతూ... కృష్ణాజిల్లాలోని తోట్లవల్లూరు మండలం, నార్త్ వల్లూరు గ్రామంలో కొందరు రైతులు తరచూ పాసుపుస్తకాలు మంజూరు చేయమని కోరుతూ తోట్లవల్లూరు రెవెన్యూ కార్యాలయంను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో నార్త్ వల్లూరు సర్వే నెంబరు 350 నుండి 446 వరకు గల భూమిలో సుమారు 1100 ఎకరాల వ్యవసాయ భూములకు సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకాల కొరకు అనేక విజ్ఞాపనలు సదరు రైతులు చేసి ఉన్నారు. రాష్ట్రంలోని జమిందారి గ్రామాలలో నార్త్ వల్లూరు గ్రామం కూడా ఒకటి దాదాపు 1100 ఎకరాల విస్తీర్ణంలో రాజ బొమ్మదేవర వెంకట నరసింహనాయుడు బహదూర్, సాయిబాబా వరప్రసాద్ వెంకట్రాయలునాయుడు, మైనియర్ గార్డెన్ హేమలత దేవికి చెందిన భూములుగా వీటిని పేర్కొంటున్నారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్ 1973 క్రింద భూ సంస్కరణలు ట్రిబ్యునల్ క్రింద పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయడం కుదరదని రెవెన్యూ అధికారులు చెప్పారు. మరికొందరు రైతులకు ఆర్వోఆర్ చట్టం ద్వారా పాసు పుస్తకాలు మంజూరు కావడం లేదు. నార్త్ వల్లూరు గ్రామంలోని సర్వే నెంబరు 350 నుండి 446 వరకు గల సుమారు 1100 ఎకరాల వ్యవసాయ భూములకు ఆర్వోఆర్ చట్ట ప్రకారం పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేయడానికి అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని వెంకట గురుమూర్తి స్పెషల్ చీఫ్ సెక్రటరీని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ పాల్గొన్నారు.

## కొవ్వూరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

కొవ్వూరు (చైతన్యరథం): మండలం ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అర్హులైన వారికి హెల్త్ పెన్షన్లు మంజూరు చేయాలని, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన చోట్ల సీసీ రోడ్లు నిర్మించాలని, అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ప్రజలు 22 వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ప్రతి వినతిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేడర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలం ఎంపీడీఓ, తాసిల్దార్, ప్రభుత్వం అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# జగన్ పర్యటనల్లో దురాలోచన తప్ప.. ప్రజాహితం కనిపించడం లేదు

**● పెట్టుబడులకు జగన్ స్పీడ్ బ్రేకర్లా అడ్డుపడుతున్నాడు : మండిపడ్డ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ అభివృద్ధి, చంద్రబాబు.. పవన్ కల్యాణ్.. లోకేశ్‌ల కష్టాన్ని ప్రజలు గుర్తించకూడదన్న దురుద్దేశంతోనే జగన్ పర్యటనల పేరిట అరాచకాలు సృష్టిస్తూ, రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులకు స్పీడ్ బ్రేకర్లా అడ్డుతగులుతున్నాడని, ఆయన కార్యక్రమాల్లో ఎక్కడా ప్రజాహితం కనిపించడం లేదని శాసనసభ్యులు, జోనల్ కోఆర్డినేటర్ ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శుక్రవారం కైకలూరులో జరిగిన తెలుగుదేశంపార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న జోనల్ కో ఆర్డినేటర్ ప్రత్తిపాటి, 10వ తేదీన నియోజకవర్గంలో జరిగే ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంపై టీడీపీ శ్రేణులతో సమగ్రంగా చర్చించారు. అనంతరం టీడీపీ శ్రేణులతో అధినేత చంద్రబాబు నిర్వహించే ప్రత్యేక సమావేశంపై స్థానిక మార్కెట్ యార్డులో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణతో కలిసి నియోజకవర్గ టీడీపీ శ్రేణులతో చర్చించారు. పార్టీలోని అన్ని విభాగాలు అధినేత సమావేశంలో పాల్గొని, తమ అభిప్రాయాలు ఆలోచనలు పంచుకోవాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి శ్రేణులకు సూచించారు.

**ఐదేళ్లు సాగును..రైతాంగాన్ని గాలికి వదిలేసి.. నేడు కపట ప్రేమ చూపితే ఎలా?**

అధికారంలో ఉన్నన్నాళ్లు రైతాంగాన్ని, సాగును గాలికి వదిలేసిన జగన్.. నేడు రైతులపై కపట ప్రేమ చూపుతూ, రైతులకు మేలుచేస్తున్న ముఖ్యమంత్రిని తప్పుపట్టడం సిగ్గుచేటని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. పొగాకు రైతులైనా, ఆక్వా రైతులైనా.. ఉద్యాన రైతులైనా.. ప్రతి రైతుకు అండగా నిలిచింది, సాగులో నష్టాలు ఎదురైనప్పుడు వారిని ఆదుకుంది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడే పొగాకు రైతులకు క్వింటాకు రూ.2వేల అదనపు సాయం అందించడం జరిగిందన్నారు. గతంతో పోలిస్తే, ఇప్పుడు పొగాకు దిగుబడి అధికంగా వచ్చిందని, అయినప్పటికీ కూటమి ప్రభుత్వం కిలోకు రూ.20 చొప్పున అదనంగా చెల్లించడానికి సిద్ధమైందన్నారు. అలానే పొగాకు రైతులకు రెండేళ్లపాటు.. ఏడాదికి రూ.50 వేల చొప్పున వడ్డీలేని రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు.

**జగన్ పర్యటనల్లో ఎక్కడా ప్రజాహితం కనిపించడం లేదు...**

రైతుల్ని పరామర్శించే నెపంతో జగన్ చేపట్టిన దేవరపల్లి పర్యటన అరాచకాలకు కేంద్రబిందువుగా మారిందని, మంచిని ఓర్వలేని స్థితిలో జగన్ ఉన్నాడని, ఆయన పర్యటనల్లో ఎక్కడా ప్రజాహితం కనిపించడం లేదని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. గతంలో మామిడి రైతుల్ని ఆదుకోవాలంటూ జగన్ చేపట్టిన పర్యటన... పూర్తిగా అభాసుపాలైందని, నిన్నటి దేవరపల్లి పర్యటన అంతకుమించి నవ్వులపాలైందని ప్రత్తిపాటి చెప్పారు. ప్రభుత్వం చేసే మంచిని తనదిగా చెప్పుకోవాలనే ఆత్రుత తప్ప.. జగన్‌లో నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలన్న ఆలోచన కనిపించడం లేదన్నారు.

**నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం..**

కైకలూరు పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యల్ని తీసుకెళ్తామని, ముఖ్యంగా ఆక్వా రైతులు, కొల్లేరు, తాగునీటి సమస్య, రోడ్లు.. డ్రైన్ల నిర్మాణం, ఇతర అభివృద్ధిపనులపై ముఖ్యమంత్రితో చర్చిస్తామని ప్రత్తిపాటి తెలిపారు. అదేవిధంగా టీడీపీ కేడర్ తో జరిగే సమావేశంలో పార్టీ శ్రేణుల ఐక్యత, నాయకత్వ పనితీరు, ఇంటింటికీ తెలుగుదేశంపై లోతైన చర్చ ఉంటుందన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ లెవల్ ఇన్ ఛార్జులు సహా అందరూ సమన్వయంతో, కలిసికట్టుగా పనిచేస్తేనే పార్టీ లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. అధినేత చంద్రబాబు సూచనలు, ఆదేశాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాటి ఈ సందర్భంగా సూచించారు.

# విద్యార్థుల సమస్యలను పరిష్కరించిన ఎమ్మెల్యే యార్లగడ్డ



హనుమాన్ జంక్షన్ (చైతన్యరథం): సమస్య ఏదైనా తన దృష్టికి వస్తే దానిని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్న ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విద్యార్థుల సమస్యను వారం రోజుల్లోనే పరిష్కరించారు. వివరాల్లోకి వెళితే బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలోని సెక్రెడ్ హార్ట్ పాఠశాల వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని పాఠశాల ప్రిన్సిపల్ సునీత గత నెల 31వ తేదీ ఆరుగొలను గ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డకు లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. ఇక్కడ బస్ స్టాప్ లేకపోవడంతో విద్యార్థినీ విద్యార్థులు ఆరుగొలను సెంటర్లో దిగి సుమారు కిలోమీటర్ మేర నడిచి రావాల్సి వస్తుందని ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్య పట్ల వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావ్ ఆరుగొలను రూట్‌లో తిరిగే ఏలూరు, నూజివీడు, గుడివాడ, మచిలీపట్నం ఆర్టీసీ డిపోల మేనేజర్లకు ఫోన్ చేసి తక్షణమే పాఠశాల వద్ద రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేసి ఈ రూట్లో తిరిగే ఆర్టీసీ బస్సులన్నీ అక్కడ ఆగేలా చర్యలు తీసుకువాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పాఠశాల వద్ద రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేస్తూ ఆయా డిపోల మేనేజర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రూట్లో తిరిగే బస్సులన్నీ ఈనెల 7 వతేది శుక్రవారం నుండి పాఠశాల వద్ద ఆపి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించుకోవాలని డ్రైవర్లకు ఆదేశాలు ఇచ్చారు. తమ సమస్యను వారం రోజుల్లో పరిష్కరించిన ఎమ్మెల్యేకు పాఠశాల యాజమాన్యం విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# వ్యాపార రంగానికి గుంటూరు నగరం అనుకూలం : ఎమ్మెల్యే నసీర్

**●బీ2 ఎక్స్ పో కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం): ఇన్వెస్ట్మెంట్ ఇండియా ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, ప్రపంచంలోనే ఏపీ పెట్టుబడుల స్వర్గధామంగా మారుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ధృతి బీ 2 ఎక్స్ పో కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ... గుంటూరును పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు బీ2 ఎక్స్ పో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ బీటూ ఎక్స్ పో ను విజిట్ చేసి వ్యాపారంలో నైపుణ్యం పొందాలని సూచించారు. గుంటూరు అవసరాలను గుర్తించి అవసరమైన అన్ని విభాగాల్లో 140 స్టాల్స్ ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పెట్టుబడుల విప్లవం ప్రారంభమైందని చెప్పారు. గూగుల్ వంటి కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం శుభపరిణామమని తెలిపారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణం ప్రారంభమయ్యాక గుంటూరుకు పారిశ్రామికంగా ప్రాధాన్యత పెరిగిందన్నారు. రాజధానికి అనుసంధానంగా గుంటూరు జిల్లా ఉందని, అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తుందని తెలిపారు. ఏయే రంగాలు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయో గుర్తించుకోవాలని సూచించారు.

# మంగళగిరిలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

●'నేతన్న సేవ' పథకం ప్రారంభం.. చేనేతల ఆదాయం రెట్టింపు లక్ష్యంగా కూటమి ప్రభుత్వం: పంచుమర్తి అనూరాధ

●మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటు.. చేనేతలకు రూ.25 వేల వార్షిక ఆర్థిక సాయం



మంగళగిరి (చైతన్యరథం): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి నాంచరమ్మ ప్రాంగణంలోని శ్రీ భద్రావతీ సమేత భావనాఋషి స్వామి వారి కల్యాణ మండపంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'నేతన్న సేవ' పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున నేతన్నలు, చేనేత కళాకారులు, చేనేత కులబాంధవులు హాజరయ్యారు. **ఈ సందర్భంగా మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ మాట్లాడుతూ...** చేనేత సోదరుల ఆదాయం రెట్టింపు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటుకు సర్వం సిద్ధమైందన్నారు. 'నేతన్న సేవ' పథకం ద్వారా ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మంగళగిరి పద్మశాలీ నాయకులకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన నాయకుడు మంత్రి నారా లోకేష్ అని కొనియాడారు. చేనేతలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని చెప్పారు. చేనేత సంక్షేమానికి జీవితాంతం కృషి చేసిన ప్రగడ కోటయ్య జయంతిని మంత్రి లోకేష్ చొరవతో అధికారికంగా నిర్వహించడం నేతన్నలకు గర్వకారణమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే 873 రాట్నాలను ఉచితంగా పంపిణీ చేసి చేనేతలకు అండగా నిలిచిన నాయకుడు నారా లోకేష్ అని తెలిపారు. **టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ...** యువగళం పాదయాత్రలో ప్రొద్దుటూరు, ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడ ప్రాంతాల్లో చేనేతలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్న నాయకుడు నారా లోకేష్ అని అన్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహిస్తూ ఎక్కడికి వెళ్లినా మంగళగిరి చేనేత వస్త్రాలు, శాలువాలను బహుమతిగా అందిస్తూ చేనేత కళాకారులకు గుర్తింపు తీసుకొస్తున్నారని చెప్పారు. **ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ...** సుమారు రూ.2వేల కోట్ల విలువైన భూమిని ఆరు వేల కుటుంబాలకు గౌరవప్రదంగా బట్టలు, పసుపు, కుంకుమతో కలిసి పట్టాలు అందించిన నాయకుడు నారా లోకేష్ అని కొనియాడారు. మంగళగిరి నియోజకవర్గంలో ప్రస్తుతం 200కు పైగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## జెన్ జీ ఉద్యమం పేరుతో వైసీపీ వీధి నాటకాలు : పట్టాభిరామ్ మండిపాటు



విజయవాడ (చైతన్యరథం): గొడ్డలి పార్టీ జెన్‌జీ ఉద్యమం ముసుగులో అరాచక శక్తులతో రాష్ట్రంలో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తోందని టీడీపీ అధికార ప్రతినిధి, స్వచ్ఛ ఆంధ్రా కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మండిపడ్డారు. వాళ్ల జెన్ జీ వెనుక అసాంఘిక శక్తులు, గంజాయి బ్యాచ్, రౌడీ మూకలు ఉన్నాయన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ పేరుని అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో అశాంతి సృష్టించేందుకు గొడ్డలి పార్టీ కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో పోలీసుల అనుమతి లేకుండా నిన్న రౌడీ మూకలు సృష్టించిన హడావుడి చూసి ప్రజలే ఎదురు తిరిగారన్నారు. తమకు ప్రజాస్వామ్యం అంటే గౌరవం ఉందని, మీలాగా తాము అనుకుంటే కోటి మంది పసుపు సైన్యం ముందు మీరు నిలబడగలరా? అని ప్రశ్నించారు. మా జనసేన, బీజేపీ సైన్యం కలిసి వస్తే మీరు తట్టుకోగలరా? అని అడిగారు. దమ్ముంటే డీఎస్సీపై మా మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్ స్వీకరించి జగన్‌ను చర్చకు రమ్మని చెప్పండని హితవు పలికారు. విజయవాడ నడిబొడ్డున బస్టాప్‌ను ఆక్రమించారని ప్రజలు ఫిర్యాదు చేస్తే, వారి ఆవేదనను అర్థం చేసుకుని ఒక ప్రజాప్రతినిధిగా స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమ వెళ్లడం తప్పా అని అడిగారు. దేవరపల్లి పర్యటనలో వైసీపీ నేతలు మద్యం మత్తులో సృష్టించిన వీరంగం అందరూ చూశారన్నారు. గొడ్డలి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏదో వాగుతున్నాడని మండిపడ్డారు. మా చంద్రబాబు ఒక్క సైగ చేస్తే నువ్వు ఎక్కడ ఉంటావో ముందు తెలుసుకో అని హెచ్చరించారు. నీ తండ్రి మాటలే నువ్వు పట్టించుకోవు, మాకు నీతులు చెబుతావా? అని అడిగారు. 2019-24 మధ్య ఎన్నో హిందూ దేవాలయాలపై దాడులు చేసి, దేవతా విగ్రహాలను ధ్వంసం చేస్తే, ఆనాడు ఈ బ్రాహ్మణ సామాజిక వర్గ నాయకుడు ఏమయ్యాడని మల్లాది విష్ణుని ఉద్దేశించి ప్రశ్నించారు. హిందూ మతంపై దాడులు చేస్తే... జగన్ ను సమర్ధించావాడని విమర్శించారు. కల్తీ మద్యంతో కొంతమంది ప్రాణాలు తీసిన వ్యక్తి మల్లాది విష్ణు అని, అతని సామాజిక వర్గమే అతన్ని వెలివేసిందన్నారు.

# మైనారిటీల పక్షపాతి కేశినేని శివనాథ్... పిఎంజెవికె పథకం కింద 8.76 కోట్లు విడుదల చేసిన కేంద్రం

● కూటమి ప్రభుత్వం రాకతో ఎంపీ చిన్ని ప్రశ్నతో పార్లమెంట్ వేదికగా మైనారిటీల అభివృద్ధిపై చర్చ



విజయవాడ (చైతన్యరథం): మైనారిటీల అభ్యున్నతి సంక్షేమమే లక్ష్యంగా పార్లమెంట్ వేదికగా పిఎంజెవికే (ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం) పథకం కింద మైనారిటీలకు జరుగుతున్న అభివృద్ధిపై కేటాయించిన నిధులపై వారి అభ్యున్నతి మరియు పురోగతిపై తీసుకునే నిర్ణయాలపై ఎంపీ చిన్ని పార్లమెంట్ వేదికగా ప్రశ్నను లేవనెత్తడంతో కేంద్ర మైనారిటీ మంత్రిత్వ శాఖ తరుపున మైనారిటీ శాఖ మంత్రి సమాధానం ఇస్తూ ఎంపీ చిన్ని ప్రశ్నకు కేంద్ర సమాధానంగా మైనారిటీలకు ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం పథకం కింద 8.76 కోట్లు విడుదల చేసినట్లు తెలియజేశారు. ఈ విషయంపై ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి మైనారిటీలంతా సంబరాలు జరుపుకుంటున్నారు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న ఏడు నియోజకవర్గాల్లో మైనారిటీల పక్షాన మాట్లాడి వారికి అండగా నిలిచిన ఎంపీ చిన్ని చిత్రపటానికి పాలాభిషేకాలు నిర్వహించారు. **ఈ సందర్భంగా మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా మాట్లాడుతూ...** ముందుగా మైనారిటీల పక్షపాతిగా ఉన్న ఎంపీ కేశినేని చిన్నికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ గడచిన ఐదు సంవత్సరాలలో మైనారిటీల అభివృద్ధి అభ్యున్నతి స్థితిగతులపై పార్లమెంటులో మాట్లాడిన వారే లేరని తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2025-26 సంవత్సరంలో 101కోట్ల రూపాయలు ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం(పిఎంజెవికె) పథకం కింద ఇచ్చారని ఎంపీ చిన్ని ఈ పథకం అమలు మరియు తీసుకుంటున్న నిర్ణయాలు మైనారిటీ నుంచి వ్యక్తమవుతున్న విషయాలపై పార్లమెంట్ వేదికగా ప్రశ్నించడంతో మరోసారి ఈ పథకం నుండి మైనారిటీలకు 8.76 కోట్ల రూపాయలు అందించడంతో రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ ప్రశ్న లేవనెత్తిన ఎంపీ కేశినేని చిన్నికి మైనారిటీలంతా ఎల్లప్పుడూ అండగా ఉంటారని తెలియజేశారు.

# ప్రపంచవ్యాప్తంగా పికిల్‌బాల్‌కు ఆదరణ

●అమరావతి పికిల్ బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే గద్దె రామమోహన్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, సినిమా హీరో సుశాంత్



విజయవాడ (చైతన్యరథం): ఇటీవల కాలంలో పికిల్‌బాల్ గేమ్‌కు దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్, శాప్ ఛైర్మన్ ఏ.రవినాయుడు చెప్పారు. శుక్రవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని నోవాటెల్ హోటల్ పక్కన ఉన్న నైట్రో పికిల్‌బాల్ ఆవరణలో 'అమరావతి పికిల్ బాల్ టోర్నమెంట్' ప్రారంభోత్సవం జరిగింది. క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్, శాప్ చైర్మన్ ఏ.రవినాయుడు, సినీహీరో సుశాంత్ హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. **ఈ సందర్భంగా మంత్రి రామప్రసాద్ మాట్లాడుతూ...** ప్రపంచ వ్యాప్తంగా పికిల్‌బాల్‌కు మంచి ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ ఆటలో మంచి అవకాశాలున్నాయని చెప్పారు. విజయవాడ 'అమరావతి పికిల్‌బాల్ టోర్నమెంట్'కు వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. **ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ...** అమరావతి టోర్నమెంట్‌ను విజయవాడలో నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అమరావతి పేరు ప్రపంచవ్యాప్తంగా మారుమోగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. **శాప్ ఛైర్మన్ ఏ.రవినాయుడు మాట్లాడుతూ...** పికిల్‌బాల్ టోర్నమెంట్‌ను చాలా ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ టోర్నమెంటును మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో ఈ స్టేడియంను చూస్తే తెలుస్తోందన్నారు. **సినిమా హీరో సుశాంత్ మాట్లాడుతూ...** పికిల్‌బాల్ ఆట చాలా వేగంగా అందరి అభిమానాన్ని చూరగొందని అన్నారు. గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ పికిల్‌బాల్ టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నట్లు చెప్పారు.

## అనారోగ్య బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు (చైతన్యరథం): అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని చికిత్స పొందిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను నియోజకవర్గ కార్యాలయంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పంపిణీ చేశారు. అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.13,97,083 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ... ఆపద సమయంలో అనారోగ్యంతో బాధపడి అప్పులు చేసి చికిత్స పొందిన కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూత అందిస్తూ భరోసాగా నిలుస్తున్నారని అన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం పనిచేస్తూ, అవసరమైన ప్రతి కుటుంబానికి కోట్ల రూపాయల సహాయాన్ని అందిస్తున్నారని తెలిపారు.

## సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం



ప్రత్తిపాడు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం – సంక్షేమం, అభివృద్ధి" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా పెదనందిపాడు మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా, దీపం పథకం, స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, ఉపాధి కల్పన కోసం నిర్వహిస్తున్న జాబ్ మేళాలు వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను వివరించారు. ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

# నెల్లూరులో కలియ తిరిగిన మంత్రి నారాయణ



నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని బాలాజీనగర్ సెంటర్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర టీ స్టాల్ వద్ద ఒక అద్భుతమైన దృశ్యం అందరి దృష్టిని ఆకర్షించింది.. మంత్రి పొంగూరు నారాయణ అనూహ్యంగా టీ స్టాల్‌కు వచ్చి, స్థానికులు, అధికారులు, కార్యకర్తలతో కలిసి ఛాయ్ తాగారు. ఛాయ్ చాలా అమోఘంగా ఉంది అని ఆయన మనసారా ప్రశంసించడమే కాక, అక్కడున్నవారితో కలిసి సరదాగా ముచ్చటించారు. షాప్ యజమానిని ఆత్మీయంగా పలకరించి, వారి వ్యాపారం ఎలా జరుగుతోందో, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయో ఓపికగా ఆరా తీశారు. ప్రజా సమస్యలపై స్పందిస్తూ, మీకు ఏ కష్టమొచ్చినా నేనున్నానంటూ వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సాదాసీదా ఆత్మీయ పలకరింపులు, ప్రజల మధ్య ఆయన మమేకమైన తీరు స్థానికులలో ఎంతో ఉత్సాహాన్ని, నమ్మకాన్ని నింపాయి.



# నెల్లూరు రూరల్లో ప్రజాదర్బార్

## పాల్గొన్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ (చైతన్యరథం): ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రతి రోజు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నెల్లూరు రూరల్ ప్రజలకు ఉదయం 7 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తీళిరుకుంటున్నామన్నారు. వివిధ సమస్యలతో వస్తున్న ప్రజా సమస్యల పరిష్కారం వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రజల సూచనలు, సలహాల మేరకే నెల్లూరు రూరల్ లో అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. ఇంత మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి అందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలన్నారు. కార్యక్రమంలో శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జిలు జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ గ్రీవెన్స్ సెల్ ఇంచార్జ్ మంగళపూడి భాస్కర్ రెడ్డి, కో క్లస్టర్ ఇంచార్జ్ ఎల్.పి. కృష్ణారెడ్డి, 33వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కరణం హజరత్ నాయుడు, టీడీపీ నాయకులు షేక్ జిలాని, వడ్లమూడి రమేష్ చౌదరి, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోల్లో ప్రజా దర్బార్

## పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు (చైతన్యరథం): నగరంలోని శాసనసభ్యుడి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు పాల్గొన్నారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రజలు వెల్లడించిన ప్రతీ సమస్యను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో వెంటనే చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి 55 వరకు అర్జీలను స్వీకరించారు.



# మొహిద్దిన్ పురంలో ఇంటింటికీ కూటమి



గిద్దలూరు (చైతన్యరథం): నియోజకవర్గం అర్ధవీడు మండలం మొహిద్దిన్ పురం గ్రామంలో "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నిర్వహించారు.

ఈ సందర్భంగా మొహిద్దిన్ పురం పంచాయతీ నాయకులు , ప్రజలు ఎమ్మెల్యే గారికి పూలమాల , హారతి ఇచ్చి సాగర స్వాగతం పలికారు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవల గురించి వివరించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక పాలనతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పట్టణం, గ్రామాల పురోగతి, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని వివరించారు. అనంతరం గ్రామంలో నాయకులు, మహిళలు ప్రజలు ఎమ్మెల్యేని శాలువ, పూలమలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్ధవీడు మండల తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యర్రగొండపాలెంలో ప్రజాదర్బార్

యర్రగొండపాలెం (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేందుకు సిఫారసు చేశారు. యర్రగొండపాలెం టీడీపీఅధ్యక్షులు చిట్యాల వెంగల్ రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# డీఎస్సీ నియామకాలపై వైసీపీ వైఖరి విడ్డూరం : చేజెర్ల ఎద్దేవా

నెల్లూరు (చైతన్యరథం): హైకోర్టు ఆధారాలు అడిగితే ఇవ్వరు.. బహిరంగ చర్చకు రమ్మంటే రారు.. నిరాధార ఆరోపణలు మాత్రం చేస్తారు.. నిజమైన బాధితులు ఎవరూ కోర్టును ఆశ్రయించలేదని, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజా ప్రయోజనాల వాజ్యాన్ని దుర్వినియోగం చేయడం తగదని హైకోర్టు స్పష్టం చేసినా తన తీరు మార్చుకోని వైసీపీ, తను అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలలో 16 టీచరు పోస్టులు కూడా భర్తీ చేయని వైసీపీ ప్రభుత్వం... పారదర్శకంగా 16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేసిన కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి ఎద్దేవా చేశారు. వైసీపీ వేయించిన 243 పై చిలుక కేసులను ఛేదించి 148 రోజుల కాలవ్యవధిలో 16,347 టీచరు పోస్టులను భర్తీ చేసి మంత్రి లోకేశ్ రికార్డు సృష్టించారన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో వేంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత వైసీపీ 243 పై చిలుక కేసులను వేయించింది. వాటన్నిటినీ ఛేదించి 148 రోజుల కాలవ్యవధిలో 16,347 టీచరు పోస్టులను భర్తీ చేసి విద్యా శాఖ మంత్రిగా నారా లోకేశ్ రికార్డు సృష్టించారన్నారు. విద్యా శాఖ మంత్రిగా నారా లోకేశ్ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. అది చూసి ఓర్వలేక నారా లోకేష్ ఇమేజ్ ను దెబ్బతీయాలనే ఉద్దేశంతో డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. డిఎస్సీ నియామకాలలో అక్రమాలు జరిగాయని వాటి పై సీబీఐ విచారణ జరిపించాలని వైసీపీ ఎమ్మెల్సీ హైకోర్టులో రెండు సార్లు పిల్ దాఖలు చేశారన్నారు. హైకోర్టు రెండు సార్లు కూడా తనకు అన్యాయం జరిగిందని నిజమైన బాధితులు ఎవరూ కోర్టుకు రాలేదని పిల్‌ను కొట్టివేసిందన్నారు. నిజమైన బాధితులు ఎవరూ కోర్టును ఆశ్రయించలేదన్నారు. తను అధికారంలో వచ్చిన వెంటనే మెగా డిఎస్సీ నిర్వహించి ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేస్తానని, అదే విధంగా ప్రతి సంవత్సరం జనవరి 1 న జాబ్ క్యాలండర్ విడుదల చేసి ఉద్యోగాలను భర్తీ చేస్తానని 2019 ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన జగన్ మోహన రెడ్డి, తన ఐదు సంవత్సరాల పాలనలో ఒక్క టీచరు పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 1 న జాబ్ క్యాలండర్ విడుదల చేస్తానని చెప్పి అమలు చేయలేదన్నారు. కానీ సాక్షి క్యాలండర్ మాత్రం విడుదల చేశారన్నారు. తను అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాలలో 16 టీచరు పోస్టులు కూడా భర్తీ చేయని ఎసీపీ ప్రభుత్వం. పారదర్శకంగా 16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేసిన కూటమి ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

# చేనేతకు కూటమి చేయూత

## జాతీయ చేనేత దినోత్సవంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెల్లడి



ధర్మవరం (చైతన్యరథం): జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మవరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన "నేతన్న సేవ" కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఇప్పటికే ప్రతి ఏడాది రూ.150 కోట్లతో ఉచిత విద్యుత్, రూ.420 కోట్లతో 50 సంవత్సరాలు నిండిన 85 వేల మంది చేనేత కార్మికులకు పింఛన్లు, 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్ల ఆర్థిక సహాయం అందించిన ప్రభుత్వం, తాజాగా రూ.179 కోట్ల వ్యయంతో "నేతన్న సేవ" పథకాన్ని ప్రారంభించడం ద్వారా చేనేత కుటుంబాల సంక్షేమానికి మరో ముందడుగు వేసిందని పేర్కొన్నారు. చేనేత వృత్తిని ఆదుకోవడం, నేతన్నల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారికి ఆర్థిక భరోసా కల్పించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జనసేన పార్టీ ధర్మవరం ఇంచార్జి చిలకం మధుసూదన్ రెడ్డి, చేనేత సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, చేనేత కార్మికులు ధర్మవరం ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పార్నపల్లెలో ప్రజాదర్బార్

## పాల్గొన్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, కలెక్టర్ రాజకుమారి

శ్రీశైలం (చైతన్యరథం): బండి ఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామంలో నిర్వహించిన శ్రీశైలం నియోజకవర్గం స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జేసి శ్రీ సూరజ్ ధనంజయ్, జిల్లా ఏఎస్పీ సుస్మిత అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులు ఉన్నారు.

# గడివేములలో ఇంటింటికీ టీడీపీ

## పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

పాణ్యం (చైతన్యరథం): గడివేముల మండలం తిరుపాడు గ్రామంలో నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పాణ్యం నియోజవర్గం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తిరుపాడు గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. అలాగే రాజముద్రతో పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వెంకటరమణ ఎమ్పీడీఓ వాసుదేవ్ గుప్తా స్పెషలాఫీసర్ వీర శంకర్, పవన్ కుమార్, నాగార్జున రెడ్డి మండలం కన్వీనర్ దిలీప్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ సీతారామరెడ్డి మంచాలకట్ట మురళీధర్ రెడ్డి, బీసీసెల్ సి గిరిబాబు, ఒడ్డు లక్ష్మి దేవి, ఈశ్వర్ రెడ్డి శివారెడ్డి దుర్గాభోయేశ్వరం చైర్మన్ కంది శ్రీనివాసులు సుకుమార్, ఆచారి కిట్టు యాదవ్, గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ తెలుగుదేశం నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఇంటింటికీ కూటమి ప్రభుత్వం

## ప్రజల ముందుకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య

నందికొట్కూరు (చైతన్యరథం): జూపాడుబంగ్లా మండలం, మండ్లెం గ్రామంలో నిర్వహించిన ఇంటింటికీ కూటమి ప్రభుత్వం డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమంలో నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, మండల కన్వీనర్ గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, కూటమి నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



# పెదవేగిలో ఇంటింటికీ తెలుగుదేశం

పెదవేగి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సూచనలతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది, ఇందులో భాగంగా దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలం లోని కూచింపూడి, రామసింగారం గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్‌తో కలిసి రాష్ట్ర ఇరిగేషన్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, దెందులూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకురాలు అంకెం ఇందిరా ప్రియదర్శిని పాల్గొని ప్రతి ఇంటికి వెళ్ళి గత రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన పథకాలను వివరించారు.




# మన పర్యాటక ప్రాంతాల్లో అంతర్జాయ స్థాయి సౌకర్యాలు

## ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ వెల్లడి



ఓర్వకల్లు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ శుక్రవారం కర్నూలు డివిజన్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రాలైన ఓర్వకల్లు రాక్ గార్డెన్, బెలూం గుహలు, హరిత హోటల్, తదితర పర్యాటక ప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి పర్యాటక సౌకర్యాలు, నిర్వహణ, అభివృద్ధి అవకాశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓర్వకల్లు ప్రకృతి ప్రసాదించిన అపూర్వ శిలా సంపదకు నిలయమని, కోట్లాది సంవత్సరాల నాటి రాతి నిర్మాణాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటాయని అన్నారు. భారతదేశంలోనే అత్యంత విశిష్టమైన భౌగోళిక వారసత్వ ప్రాంతాలలో ఓర్వకల్లు ఒకటిగా నిలిచే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. బెలూం గుహలు ఆసియాలోనే అత్యంత పొడవైన సహజ సున్నపురాయి గుహలలో ఒకటిగా ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని తెలిపారు. గుహలలోని సహజ శిలా నిర్మాణాలు, విశాలమైన మార్గాలు, ఆధ్యాత్మిక ప్రశాంతత, ప్రకృతి వైభవం దేశీయ, విదేశీ పర్యాటకులను విశేషంగా ఆకర్షించే విశిష్టతను కలిగి ఉన్నాయని చెప్పారు. హరిత హోటల్, కర్నూలును పరిశీలించిన అనంతరం, పర్యాటకులకు నాణ్యమైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, అత్యుత్తమ ఆతిథ్య సేవలు అందించేలా ఆధునీకరణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓర్వకల్లు, బెలూం గుహలు, హరిత హోటల్ వంటి పర్యాటక కేంద్రాలు ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి అమూల్యమైన ఆస్తులని పేర్కొన్న డాక్టర్ నూకసాని బాలాజీ, పర్యాటకులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించడం అత్యవసరమని అన్నారు. పరిశుభ్రత, తాగునీరు, ఆధునిక మరుగుదొడ్లు, విశ్రాంతి కేంద్రాలు, నాణ్యమైన ఆహార వసతులు, డిజిటల్ సమాచార వ్యవస్థలు, ఆకర్షణీయమైన సైన్‌బోర్డులు, విశాలమైన పార్కింగ్, రాత్రి వెలుగుల అలంకరణ, అడ్వెంచర్ మరియు కుటుంబ వినోద కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పర్యాటక రంగంపై ఉన్న ప్రత్యేక విజన్‌కు అనుగుణంగా రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడం ఏపీటీడీసీ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఓర్వకల్లు, బెలూం గుహలు వంటి అపూర్వమైన ప్రకృతి, వారసత్వ సంపదను సమగ్రంగా అభివృద్ధి చేసి, దేశీయ, విదేశీ పర్యాటకులను మరింతగా ఆకర్షించే విధంగా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి కూడా విశేష ఊతం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.



## విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో

# చంద్రబాబు టాప్

**వైసీపీ స్వయంకృతాపరాధం**

**పార్లమెంటు సాక్షిగా జగన్ వైఫల్యాలు బట్టబయలు**

**ఏపీ ప్రభుత్వ ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం**



**అమరావతి (చైతన్యరథం):** 'రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులపై బురద చల్లాలని చూసిన గొడ్డలి పార్టీకి పార్లమెంటు వేదికగా కేంద్ర ప్రభుత్వం గట్టి చెంపపెట్టు ఇచ్చింది. వైసీపీ ఎంపీ గురుమూర్తి వేసిన ప్రశ్న చివరకు ఆ పార్టీ పాలిట శాపంగా మారిందని ఏపీ ప్రభుత్వ ఉత్తర అమెరికా ప్రత్యేక ప్రతినిధి కోమటి జయరాం వ్యాఖ్యానించారు. వైసీసీ స్వయంకృతాపరాధంతో పార్లమెంటు సాక్షిగా జగన్ వైఫల్యాలు బట్టబయలు అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వ సమర్థతకు కేంద్రమే సర్టిఫికెట్ ఇచ్చినట్లైందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'జగన్ రెడ్డి హయాంలో 2023-24లో రాష్ట్రానికి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు కేవలం 92.13 మిలియన్ డాలర్లు మాత్రమే. కానీ చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2024-25లో అది 233.14 మిలియన్ డాలర్లకు, 2025-26 నాటికి ఏకంగా 608.59 మిలియన్ డాలర్లకు పెరిగింది. కేవలం రెండేళ్లలో పెట్టుబడులు ఆరు రెట్లు పెరగడం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌కు నిదర్శనం. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం లేదంటూ రోజూ అసత్య ప్రచారాలు చేస్తున్న గొడ్డలి పార్టీ నేతలకు, పార్లమెంటు ఇచ్చిన అధికారిక సమాధానంతో కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు గారు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌లా రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలుపుతుంటే మంత్రి నారా లోకేష్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పారిశ్రామిక అనుకూల విధానాలతో పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతున్నారు. దీని ఫలితంగానే Google, TCS, Cognizant, Carrier, RMZ, Arcelor Mittal, Reliance, Brookfield, Adani వంటి జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చాయి. దేశంలో వస్తున్న ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కే వస్తున్నాయి. గత ప్రభుత్వంలో J-Tax భయంతో పారిశ్రామికవేత్తలు పారిపోతే నేడు కూటమి ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాలతో విదేశీ పెట్టుబడిదారులు క్యూ కడుతున్నారని పార్లమెంట్ సాక్షిగా వెల్లడైంది. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలి, యువతకు ఉద్యోగాలు రాకుండా చేయాలనే దురుద్దేశంతో గొడ్డలి పార్టీ నాయకులు చేస్తున్న కుట్రలు ఇకనైనా ఆపాలి. రాజకీయ దుష్ప్రచారం మానుకోకుంటే 11 కాస్త 1కి పరిమితమవుతుంది' అని జయరాం అన్నారు.

# ఓక్లాండ్‌లో మార్మోగిన తెలుగు పద్యం

## గిన్నిస్ ప్రపంచ రికార్డు పుటల్లోకి సిలికానాంధ్ర మనబడి





**వాషింగ్టన్:** అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం ఓక్లాండ్‌లో ఘనంగా జరిగిన సిలికానాంధ్ర 25వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా తెలుగు భాషా చరిత్రలో మరో అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. ఒకే వేదికపై అతి పెద్ద తెలుగు పద్య సమూహ పారాయణం నిర్వహించి ప్రఖ్యాత 'గిన్నిస్ ప్రపంచ రికార్డు' సాధించారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో మొత్తం 1,712 మంది పాల్గొన్నారు. ఇందులో అత్యధికులు సిలికానాంధ్ర మన బడి విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సమన్వయకర్తలు కావడం విశేషం. పాల్గొన్న ప్రతినిధులందరూ సుమతి, వేమన శతకాల నుంచి ఎంపిక చేసిన 18 పద్యాలను ఏకకాలంలో కంఠస్థంగా పారాయణం చేశారు. విదేశీ గడ్డపై తెలుగు భాషా ప్రావీణ్యాన్ని, సాహిత్యం పట్ల తమకున్న అనుబంధాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఈ సమిష్టి పారాయణం ద్వారా అంతర్జాతీయ వేదికపై తెలుగు భాషా, సాహిత్య వైభవం మరోసారి ప్రతిధ్వనించింది.

సిలికానాంధ్ర మనబడి ప్రెసిడెంట్, డీన్ చామర్తి రాజు మాట్లాడుతూ... 'గిన్నిస్ ప్రపంచ రికార్డు వేదికపై 1,712 మంది కలిసి తెలుగు పద్యాలను పారాయణం చేయడం మనబడి ఎన్నో ఏళ్లుగా సాగిస్తున్న భాషా సేవకు నిదర్శనం. వేలాది మంది ప్రయాణం తరగతి గదిలోనే ప్రారంభమైంది. విదేశాల్లో ఉన్న తెలుగు కుటుంబాలు తమ పిల్లలను మనబడిలో చేర్పించి మాతృభాషను నేర్పించాలి. భారతదేశంలో ఉన్న తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు కూడా ఈ విషయంలో పిల్లలను ప్రోత్సహించాలి." అని కోరారు.

**డబ్ల్యూఏఎస్సీ (WASC) గుర్తింపు పొందిన ఏకైక తెలుగు సంస్థ:** వెస్టన్ అసోసియేషన్ ఆఫ్ స్కూల్స్ అండ్ కాలేజెస్ (WASC) గుర్తింపు పొందిన ప్రపంచంలోనే ఏకైక తెలుగు విద్యా సంస్థగా సిలికానాంధ్ర మనబడి గుర్తింపు పొందింది. సంస్థ స్థాపించినప్పటి నుంచి ఇప్పటివరకు 1.10 లక్షల మందికి పైగా విద్యార్థులకు తెలుగు చదవడం, రాయడం, మాట్లాడటం నేర్పించారు. విద్యార్థుల నైపుణ్యాన్ని దశలవారీగా పెంచేలా బాలబడి-1, బాలబడి-2 నుంచి ప్రభాసం వరకు విభిన్న స్థాయిల్లో పాఠ్య ప్రణాళిక రూపొందించారు. లోతైన అధ్యయనం కోసం 'ప్రబోధం' పేరుతో ఉన్నత స్థాయి ఐచ్ఛిక కోర్సును, 'బాలరంజని' యాప్ ద్వారా ఇంటరాక్టివ్ అభ్యాసంతో పాటు 'బాలానందం', 'తెలుగు మాట్లాట', 'తెలుగుకి పరుగు', 'మనతరం' వంటి పాఠ్యేతర కార్యక్రమాలను అందిస్తున్నారు.

2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభమైనట్టు సంస్థ ప్రకటించింది. అమెరికా, కెనడాల్లోని 250కి పైగా కేంద్రాల్లో సెప్టెంబరు మొదటి వారాంతం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. తెలుగు భాష, సంస్కృతిని భావితరాలకు అందించే ఈ బృహత్తర కార్యక్రమంలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సిలికానాంధ్ర పిలుపునిచ్చింది.

## యూఏఈలో భారతీయులకు పాస్‌పోర్ట్, కాన్సులర్ సేవలు

# మరింత వేగవంతం

**ఈ నెల 15 నాటికి అపాయింట్‌మెంట్ల బ్యాక్‌లాగ్ పూర్తి**

**ఏడు ఎమిరేట్లలో 16 కొత్త కేంద్రాలు**

**రోజూ 8వేల మందికి సేవలు అందించేలా ఏర్పాట్లు**



**దుబాయ్:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నివసిస్తున్న సుమారు 43 లక్షల మంది భారతీయులకు పాస్‌పోర్ట్, కాన్సులర్ సేవలను మరింత వేగంగా, సమర్థవంతంగా అందించేందుకు భారత కాన్సులేట్ కీలక చర్యలు చేపట్టింది. 'అల్ హింద్ టూర్స్ అండ్ ట్రావెల్స్' ద్వారా నిర్వహిస్తున్న కొత్త సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. ఈ వ్యవస్థ ప్రారంభమై రెండు వారాలు పూర్తి కాగా ప్రస్తుతం ఉన్న అపాయింట్‌మెంట్ల బ్యాక్‌లాగ్‌ను ఈ నెల 15వ తేదీ నాటికి పూర్తిగా తొలగిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

ప్రస్తుతం యూఏఈలోని ఏడు ఎమిరేట్లలో మొత్తం 16 ఇండియన్ కాన్సులర్ అప్లికేషన్ సెంటర్లు (ICAC\T) అందుబాటులోకి వచ్చాయి. అబుదాబిలో 6, దుబాయ్‌లో 2, షార్జాలో 2, అజ్మాన్, ఫుజైరా, ఉమ్ అల్ కువైన్, ఖోర్ఫక్కన్, కల్బా, రాస్ అల్ ఖైమాలలో ఒక్కో కేంద్రం చొప్పున పని చేస్తున్నాయి. వీటిలో బర్ దుబాయ్‌లోని 'యుడబ్ల్యూ మాల్' (UW Mall)లో 12వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 70కి పైగా కౌంటర్లతో అతి పెద్ద ప్రధాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రతిరోజూ వేల మందికి సేవలు అందించే సామర్థ్యం ఉందని, ప్రతి దరఖాస్తుదారుడికి 30 నిమిషాల్లోపే ప్రక్రియ పూర్తయ్యేలా చూస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

**అత్యవసర పరిస్థితుల్లో 'వాక్-ఇన్' (ముందస్తు అపాయింట్‌మెంట్ లేకుండా):** నిజమైన అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ముందస్తు అపాయింట్‌మెంట్ లేకుండా నేరుగా అప్లై చేసుకునే (వాక్-ఇన్) వెసులుబాటు కల్పించారు.

- తత్కాల్ దరఖాస్తుదారులు (అత్యవసర ప్రయాణ ఆధారాలతో)
- తొలి పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసే నవజాత శిశువులు
- 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్లు
- పాస్‌పోర్ట్ పోగొట్టుకుని 'ఎమర్జెన్సీ సర్టిఫికెట్' అవసరమైన వారు (వీరు అత్యవసరతను నిరూపించే విమాన టికెట్, వైద్య లేదా అధికారిక పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలి).

**తత్కాల్ సేవలకు ఎవరు అర్హులు:** వ్యక్తిగత వివరాల్లో (పేరు, పుట్టిన తేదీ, చిరునామా మొదలైనవి) ఎలాంటి మార్పులు లేకుండా కేవలం పాస్‌పోర్ట్ పునరుద్ధరణ (రెన్యువల్) చేసుకునేవారు మాత్రమే తత్కాల్‌కు అర్హులు. పోయిన/దెబ్బతిన్న పాస్‌పోర్ట్‌లు, తీవ్రమైన వివరాల మార్పులు, క్రిమినల్ కేసులు ఉన్నవారికి తత్కాల్ వర్తించదు.

**సవరించిన రుసుములు**

**(2026 జూలై 1 నుంచి అమలు)**

36 పేజీల పాస్‌పోర్ట్ రెన్యువల్: Dh 450

తత్కాల్ రెన్యువల్: Dh 900


సర్వీస్ ఛార్జీ: Dh 19 (ప్రాసెసింగ్, బయోమెట్రిక్, కొరియర్ ఛార్జీలతో కలిపి).

**అపాయింట్‌మెంట్ స్లాట్ల విడుదల**

- దరఖాస్తుదారుల సౌకర్యార్థం ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు, రాత్రి 9 గంటలకు (యూఏఈ సమయం) పోర్టల్‌లో కొత్త స్లాట్లను విడుదల చేస్తున్నారు. ఈ సమయాల్లో లాగిన్ అయితే అపాయింట్‌మెంట్ లభించే అవకాశాలు ఎక్కువ.
- సాధారణ సేవల్లో 7 నుంచి 15 పనిదినాల్లో, తత్కాల్‌లో 3 పనిదినాల్లో పాస్‌పోర్ట్ జారీ అవుతుందని కాన్సులేట్ స్పష్టం చేసింది.

### అధికారిక మార్గాలే శ్రేయస్కరం

## నకిలీ ఏజెంట్లతో జాగ్రత్త



అపాయింట్‌మెంట్లు ఇప్పిస్తామని, వేగంగా పాస్‌పోర్ట్ ఇప్పిస్తామని చెప్పి అధిక మొత్తాలు వసూలు చేసే అక్రమ ఏజెంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని భారత కాన్సుల్ జనరల్ డాక్టర్ ఇ.విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించారు. కేవలం అధికారిక పోర్టల్ ద్వారానే సేవలు పొందాలని ఆయన సూచించారు.

# ప్రజాస్వామ్యానికి పార్లమెంట్ అత్యున్నత దేవాలయం

## కొత్తగా ఎన్నికైన పార్లమెంటు సభ్యులతో ప్రధాని నరేంద్ర మోదీ ముచ్చట్లు



ప్రజాస్వామ్యానికి పార్లమెంట్ అత్యున్నత దేవాలయమని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. పార్లమెంట్ సమావేశాల్లో ఇటీవల జరుగుతున్న ఆందోళనలు, అంతరాయాలతో కొత్తగా ఎన్నికైన ఎంపీలకు మాట్లాడే అవకాశం దక్కడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సభ సజావుగా సాగాలని, ప్రతి సభ్యుడూ తన అభిప్రాయాలను వెల్లడించేందుకు అవకాశమివ్వాలన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎన్డీఏ ఎంపీలతో శుక్రవారం నిర్వహించిన అల్పాహారం కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంట్ చరిత్రను అధ్యయనం చేయాలని సూచించారు. అందులోని చర్చలు, సమాచారాన్ని తెలుసుకుని తమ ప్రసంగాలను ప్రభావవంతంగా కొనసాగించాలని కోరారు. దేశాభివృద్ధి అనేది రాష్ట్రాల ప్రగతిపైనే ఆధారపడి ఉంటుందన్న ప్రధాని, ప్రతీ ఎంపీ తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆయా పురోగతి పనులకు సంబంధించి అవసరమైతే నేరుగా తన కార్యాలయాన్ని(పీఎంఓ) సంప్రదించవచ్చని ఆయన చెప్పారు. పేదలు, కార్మికులు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజలతో ఎంపీలు కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశానికి శివసేన నుంచి ఏడుగురు, ఎన్సీపీఖ తరఫున 20 మంది, ఎన్సీపీ(అజిత్ పవార్ వర్గం) నుంచి ఇద్దరు సహా మొత్తం సుమారు 45 మంది ఎంపీలు హాజరయ్యారు. ఇటీవల టీఎంసీని వీడి ఎన్డీఏలో చేరిన ఎంపీలు, అలాగే ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి బయటకు వచ్చి ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరిన మాజీ శివసేన ఎంపీలకు ప్రధాని ప్రత్యేక భరోసానిచ్చారు. 'ఎన్డీఏ అనేది ఓ కుటుంబం. ఈ కూటమిలోని ప్రతి పార్టీకి చెందిన ఎంపీకి సమానమైన గౌరవం ఉంటుంది. నేను ఒక పార్టీకి మాత్రమే కాదు.. ప్రతి ఎంపీకి అండగా ఉంటాను. ఇందులో ఎలాంటి ఆందోళనా అవసరం లేదు' అని మోదీ చెప్పుకొచ్చారు. భేటీ అనంతరం ఒక్కో ఎంపీతో విడివిడిగా మాట్లాడిన మోదీ.. వారి వారి నియోజకవర్గాల పరిస్థితులు, అక్కడి ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు.

# మెరుగైన నిర్వహణ కోసమే ఎఫ్‌సీఆర్ఏ చట్టానికి సవరణ

## అమెరికా సభ్యుడి అభ్యంతరంపై భారత్ స్పందన



విదేశీ నిధుల నియంత్రణకు ఉద్దేశించిన ఎఫ్‌సీఆర్ఏ చట్టానికి భారత్ చేయనున్న సవరణలపై అమెరికా ప్రతినిధులసభ సభ్యుడు రైలీ మూర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. చట్టాలు, వాటి సవరణలు తమ అంతర్గత విషయాలని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అమెరికా సహా అనేక దేశాల్లో ఇలాంటి చట్టాలు ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో భారత్ చట్టాల రూపకల్పన చేస్తుందని చెప్పారు. దేశీయ చట్టాలకు వాటికంటూ ప్రత్యేక నేపథ్యం ఉంటుందని చెప్పారు. ఈ దృష్టికోణంలోనే చట్టాలను విశ్లేషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిపాదిత సవరణలపై రైలీ మూర్ ఇటీవల స్పందిస్తూ పలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సవరణలు చట్ట రూపం దాలిస్తే యూఎస్, భారత్ ద్వైపాక్షిక బంధాలు దెబ్బతింటాయని అన్నారు. ఈ సవరణలతో మతపరమైన చారిటీ సంస్థలను భారత్ నియంత్రించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ చట్టంతో క్రిస్టియన్ సంస్థలపైనే అధిక ప్రభావం పడేలా ఉందని అన్నారు. క్రిస్టియన్‌లను టార్గెట్ చేసుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని కూడా వ్యాఖ్యానించారు. అయితే, విదేశీ నిధులతో దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రత, ప్రజాప్రయోజనాలు, ప్రజాస్వామిక సంస్థలపై ప్రతికూల ప్రభావం పడకుండా భారత్ ఎఫ్‌సీఆర్ఏ చట్టాన్ని గతంలో తీసుకొచ్చింది. ఇక విదేశీ నిధులతో నడిచే సంస్థల కార్యకలాపాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం, మెరుగైన నిర్వహణ కోసమే తాజా మార్పులను ప్రతిపాదిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

# ఉభయసభలకూ తప్పనిసరిగా హాజరు కావాలి

## ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై చర్చ నేపథ్యంలో కాంగ్రెస్ విప్ జారీ



వివాదాస్పద ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా తమ పార్టీకి చెందిన ఉభయ సభల ఎంపీలకు కాంగ్రెస్ విప్ జారీ చేసింది. ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుపై ప్రభుత్వం చర్చ చేపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో రాజ్యసభ, లోక్‌సభ రెండింటిలోనూ కాంగ్రెస్ ఎంపీలు తప్పనిసరిగా హాజరు కావాలని అధిష్ఠానం స్పష్టం చేసింది. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో తమ తమ సభల్లో తప్పనిసరిగా హాజరు కావాలని పార్లమెంటు సభ్యులను కోరింది. ఈ మేరకు రాజ్యసభలోని కాంగ్రెస్ చీఫ్ విప్ జైరామ్ రమేశ్ విప్ జారీ చేశారు. ఈ సందర్భంగా 2026 ఆగస్టు 10, 11, 12 తేదీల్లో రాజ్యసభలో చాలా ముఖ్యమైన అంశాలను చర్చకు తీసుకోనున్నట్లు జైరామ్ రమేశ్ తెలిపారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడే వరకు తప్పనిసరిగా సభలో సభ్యులు ఉండాలని, పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అత్యంత ముఖ్యమైనదిగా పరిగణించాలని కోరారు. మరోవైపు, లోక్‌సభలోని కాంగ్రెస్ సభ్యులకూ పార్టీ ఇదే విధమైన విప్ జారీ చేసింది. ఆ మూడు రోజుల పాటు కాంగ్రెస్ ఎంపీలంతా తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొంది. అదేవిధంగా ఇండియా కూటమిలోని అన్ని మిత్రపక్షాలకు ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆయా పార్టీల ఎంపీలందరూ హాజరుకావాలని కోరింది. కాగా, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే, వచ్చే వారం జరగబోయే తాత్కాలిక ప్రభుత్వ కార్యకలాపాల జాబితాను పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి వెల్లడించారు. దాంట్లో ఆ రెండు బిల్లుల గురించి మంత్రి ఎక్కడా ప్రస్తావించలేదు.





# ప్రధాని మోదీతో అకాలీదళ్ బాదల్ భేటీ

## పొత్తులే పరమార్థం

ప్రధాని నరేంద్ర మోదీతో శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ సమావేశమయ్యారు. ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శుక్రవారం ఈ భేటీ.. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు నాలుగేళ్ల విరామం తర్వాత పాత మిత్రపక్షాలు మళ్లీ ఒకే గొడుగు కిందకు వచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు మొదలయ్యాయి. కేంద్రం తీసుకొచ్చిన వివాదాస్పద వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020లో అకాలీదళ్ ఎన్డీఏ (బీజేపీ) కూటమి నుంచి బయటకు వచ్చింది. దాంతో దాదాపు 25 ఏళ్ల నాటి వీరి పొత్తుకు తెరపడింది. పొత్తు విడిపోయిన తర్వాత 2022 అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలు ఒంటరిగానే పోటీ చేశాయి. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఖాతా తెరవకపోగా, అకాలీదళ్ కేవలం ఒక్క స్థానానికే పరిమితమైంది. రాష్ట్రంలో ఎస్ఎస్ఎస్, బీజేపీ నేతలు, కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన నాయకులు మళ్లీ పొత్తు వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. నగర ప్రాంతాల్లో బీజేపీకి, గ్రామీణ ప్రాంతాల్లో అకాలీదళ్‌కి బలం ఉండటంతో ఇరు పార్టీలకూ ఇది ప్రయోజనకరంగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషించగా, బీజేపీ చిన్న భాగస్వామిగా ఉండేది. కానీ, ఈసారి సమాన ప్రాతిపదికన మాత్రమే పొత్తు ఉంటుందని బీజేపీ నాయకత్వం సంకేతాలు ఇస్తోంది. మరోవైపు పంజాబ్‌లో ప్రస్తుతం ఉన్న శాంతిభద్రతల పరిస్థితి, జాతీయ భద్రత అంశాలే తమకు ప్రాధాన్యమని అకాలీదళ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సమావేశంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ స్పందిస్తూ.. 'ఇరు పార్టీలు మళ్లీ కలిసేందుకు సిద్ధమయ్యాయా?' అని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న వేళ ఈ భేటీ పంజాబ్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం కనిపిస్తోంది.

### సుప్రీంకోర్టులో మాజీ జడ్జి జస్టిస్

# యశ్వంత్ వర్మకు ఊరట

అలహాబాద్ హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టులో తాజాగా ఊరట లభించింది. జస్టిస్ యశ్వంత్ వర్మపై కేసు నమోదు చేయాలన్న పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. న్యాయవాది ఘన్‌శ్యామ్ ఉపాధ్యాయ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరాధే ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. చౌకబారు పబ్లిసిటీ కోసమే ఇలాంటి పిటిషన్లు వేస్తున్నారని పిటిషనర్‌పై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. న్యాయ వ్యవస్థను దుర్వినియోగం చేయవద్దని హితవు పలికింది. ఇదే అంశంపై గతంలోనూ వచ్చిన పిటిషన్‌నూ కొట్టివేశామని సుప్రీంకోర్టు ధర్మాసనం గుర్తు చేసింది. గతేడాది ఢిల్లీలోని మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం వేళ నోట్ల కట్టలు కనిపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయనపై అవినీతి ఆరోపణలు రావడంతో లోక్‌సభలో అభిశంసన ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఈ లోపే ఏప్రిల్ 9న జడ్జి పదవికి వర్మ రాజీనామా చేశారు. అయితే, యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేసినా నేరపూరిత బాధ్యత తొలగిపోదని ఉపాధ్యాయ్ వాదించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. లాయర్ అయి ఉండి చౌకబారు ప్రచారం కోసం పిటిషన్లు వేస్తున్నారని ఆక్షేపించింది. ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది.



# చట్టాలు, సవరణలు మా అంతర్గత వ్యవహారం

**- అమెరికా చట్టసభ సభ్యుడికి భారత విదేశాంగశాఖ కౌంటర్**



భారత్‌లో విదేశీ విరాళాల నియంత్రణ చట్టంలో సవరణకు సంబంధించి ప్రతిపాదిత బిల్లు (ఎఫ్‌సీఆర్‌ఏ) పై అమెరికాకు చెందిన ఓ చట్టసభ సభ్యుడు చేసిన వ్యాఖ్యలపై భారత్ దీటుగా స్పందించింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ దీనిపై మాట్లాడుతూ చట్టాలు, సవరణలు చేసుకోవడం భారత అంతర్గత వ్యవహారాలని స్పష్టం చేశారు. విదేశీ విరాళాలను నియంత్రించేందుకు అమెరికా సహా అనేక దేశాలు చట్టాలను కలిగి ఉన్నాయని గుర్తుచేశారు. ఎఫ్‌సీఆర్‌ఏపై కొందరు చేసిన వ్యాఖ్యల గురించి మా దృష్టికి వచ్చింది. భారత్‌కు సంబంధించిన శాసనపరమైన విషయాలు మా అంతర్గతం. అనేక అంశాలపై ప్రజాస్వామిక పద్ధతుల్లో ఇక్కడి పార్లమెంట్ చట్టాలు చేస్తుంది. అమెరికా సహా అనేక దేశాల్లో విదేశీ విరాళాల నియంత్రణ చట్టాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఎఫ్‌సీఆర్‌ఏ ప్రతిపాదిత బిల్లులో ఉన్న పలు నిబంధనలు కొన్ని మతపరమైన, స్వచ్ఛంద సంస్థలను భారత ప్రభుత్వం నియంత్రించేందుకు వీలుగా ఉన్నాయని అమెరికా చట్టసభ సభ్యుడు రైలీ మోర్ ఆరోపించారు. ఇవి కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకోవడమేనని అన్నారు. వీటి వల్ల అమెరికా, భారత్ ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని సోషల్ మీడియా వేదికగా ఆయన ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై జైస్వాల్ స్పందించారు.

# మూడు దేశాల రక్షణ బంధం

**పాకిస్థాన్, సౌదీ, టర్కీ కీలక ఒప్పందం**



అమెరికా-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా దద్దరిల్లుతున్న సమయంలో అంతర్జాతీయ రాజకీయాల్లో సంచలనాత్మక పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్, సౌదీ అరేబియా, టర్కీ దేశాలు 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' పేరుతో ఒక కీలక రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం మూడు దేశాల్లో ఏ ఒక్క దేశంపై దాడులు జరిగినా, అది మిగిలిన రెండింటిపై జరిగిన దాడిగానే పరిగణిస్తారు.

సౌదీ అరేబియాలో జరిగిన సమావేశంలో క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్, టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగాన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ భేటీలో పాక్ ఆర్మీ చీఫ్ కూడా పాల్గొన్నారు. ఏదేని విదేశీ సైనిక దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు, పరస్పరం రక్షణ కల్పించుకునేందుకు ఈ ఒప్పందం దోహద పడుతుందని పాకిస్థాన్ విదేశాంగ శాఖ తెలిపింది.

**మూడు దేశాల వ్యూహాత్మక కలయిక**

చమురు సంపద కలిగిన సౌదీ అరేబియా, అణు సామర్థ్యం ఉన్న పాకిస్థాన్, నాటో కూటమిలో రెండో అతిపెద్ద సైనిక బలం కలిగిన టర్కీలు ఒకే వేదికపైకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా మూడు దేశాల మధ్య సైనిక విన్యాసాలు, టెక్నాలజీ బదిలీ, నిఘా సమాచారాన్ని పరస్పరం పంచుకోనున్నారు.

ఇరాన్ అలాగే ప్రాంతీయ తిరుగుబాటు దారుల నుంచిఎదురవుతున్న డ్రోన్, మిస్సైల్ దాడుల నేపథ్యంలో సౌదీ అరేబియా తన రక్షణ భాగస్వామ్యాలను విస్తరించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా ప్రాధాన్యతలు మారుతుండటం, ఇజ్రాయెల్-గాజా ఉద్రిక్తతల నేపథ్యంలో మారుతున్న ప్రాంతీయ సమీకరణాలకు ఈ ఒప్పందం స్పష్టమైన సంకేతంగా నిలుస్తోంది.

# మెటాకు మరో భారీ షాక్!




సోషల్ మీడియా దుష్ప్రభావాలకు సంబంధించి ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాకు మరో భారీ షాక్ తగిలింది. మానసిక ఆరోగ్యం దెబ్బతిన్న మైనర్ల చికిత్స, ఇతర కార్యక్రమాల కోసం 567 మిలియన్ డాలర్లు చెల్లించాలని మెటాను న్యూమెక్సికో రాష్ట్రంలోని (అమెరికా) న్యాయస్థానం ఆదేశించింది. బాధిత చిన్నారుల చికిత్స కోసం 420 మిలియన్ డాలర్లు చెల్లించాలని పేర్కొంది. సామాజిక మాధ్యమాల దుష్ప్రభావం, నిరోధం, బాధితులకు వైద్య పరీక్షల కోసం మిగిలిన మొత్తాన్ని వచ్చే ఐదేళ్ల పాటు కేటాయించాలని న్యాయమూర్తి బ్రయన్ బీడ్‌షీడ్ ఆదేశించారు.

ఈ కేసుకు సంబంధించి మెటాకు చుక్కెదురవడం ఇది రెండో సారి. మార్చిలో మొదటి దశ విచారణ సందర్భంగా మెటాపై న్యాయస్థానం 375 మిలియన్ డాలర్ల జరిమానా విధించింది. చిన్నారులపై దుష్ప్రభావాల గురించి తెలిసీ మెటా వారికి హాని తలపెట్టిందని కోర్టు అప్పట్లో అభిప్రాయపడింది. ఫేస్‌బుక్‌లో చిన్నారులకు హానికరమైన కంటెంట్ గురించి తమకు తెలిసిన విషయాల్ని మెటా కావాలనే దాచిపెట్టిందని పేర్కొంది. ఇందుకు పెనాల్టీ చెల్లించాల్సిందేనని ఆదేశించింది.

మెటాలో మౌలిక స్థాయిలో మార్పులకు ఆదేశించాలని ప్రాసిక్యూటర్లు విచారణ సందర్భంగా కోర్టును అభ్యర్థించారు. యూజర్లను సోషల్ మీడియాకు బానిసగా మార్చే ఫీచర్లకు అడ్డుకట్ట వేసేలా మార్పులకు ఆదేశించాలని కోరారు. వయసు ధ్రువీకరణ నిబంధనలను మరింత కట్టుదిట్టం చేయాలని అన్నారు. చిన్నారులకు హానికరమైన కంటెంట్‌పై డీఫాల్ట్‌గా కట్టుదిట్టమైన అకౌంట్ సెట్టింగ్స్ ఉండేలా చర్యలకు ఆదేశించాలని కోరారు. ఈ తీర్పు నేపథ్యంలో మెటాలో మౌలికస్థాయి మార్పులు కనిపించే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# 'పుట్టుకతో పౌరసత్వం'పై ట్రంప్ కఠిన ఆంక్షలు

అమెరికాలోకి వలసలను అరికట్టేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా బర్త్‌రైట్ సిటిజన్‌షిప్‌నకు (పుట్టుకతో పౌరసత్వం) సంబంధించిన నిబంధనలను మరింత కఠినతరం చేశారు. ఈ తరహా పౌరసత్వానికి అర్హులు కాని వారి జాబితాలో కొత్త వర్గాలను చేరుస్తూ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా, బర్త్ టూరిజాన్ని నిషేధించారు. తమ బిడ్డలకు అమెరికా పౌరసత్వం కోసం విదేశీయులు అక్కడికెళ్లి పిల్లల్ని కనడాన్ని బర్త్ టూరిజం అంటారన్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి కొత్తగా రెండు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై ట్రంప్ సంతకం చేశారు. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే.. వారిని అమెరికన్లు గానే పరిగణించాలని నెల రోజుల క్రితం ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలనే ట్రంప్ ప్రయత్నం అప్పటికి వీగిపోయింది. కానీ, తాజాగా మళ్లీ కొత్త ఉత్తర్వులు ఇచ్చారు.

మొదటి ఆర్డర్ : ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా అమెరికాలో పుట్టే పిల్లలకు ఆటోమేటిక్‌గా లభించే పౌరసత్వం విషయంలో కొన్ని నిర్దిష్ట వర్గాలను అనర్హులుగా చేర్చారు. శత్రు దేశాల వ్యక్తులు, ఉగ్రవాద సంస్థలకు చెందిన సభ్యులు, విదేశీ ప్రభుత్వాల తరఫున లాబీయింగ్ చేసేవారు లేదా ఆ దేశాల కోసం పనిచేసే వ్యక్తులు.

రెండవ ఆర్డర్ (బర్త్ టూరిజంపై పూర్తి నిషేధం): అమెరికా పౌరసత్వాన్ని సంపాదించడం కోసమే టూరిస్ట్ వీసాలపై అమెరికాకు వచ్చి పిల్లలను కనే అక్రమ పద్ధతిని అరికట్టడానికి ఈ ఆర్డర్ తెచ్చారు. విదేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాలు/కాన్సులేట్లలోని వీసా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా గర్భిణీలు కేవలం అమెరికాలో ప్రసవించి పౌరసత్వం పొందాలనే ఉద్దేశంతో (మోసపూరితంగా లేదా తప్పుడు సమాచారంతో) వీసా కోరితే, అటువంటి వారి వీసాలను తిరస్కరించాలని ఈ ఆర్డర్ నిర్దేశిస్తుంది.

# ఇరాన్ యుద్ధానికి త్వరలోనే ముగింపు: ట్రంప్



ఇరాన్‌తో యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అతి త్వరలో యుద్ధం ముగియబోతోందని ప్రకటించారు. ఇరాన్ చర్చల కోసం తమను సంప్రదిస్తుందని, హార్మూజ్ జలసంధి పూర్తి స్థాయిలో తిరిగి తెరుచుకుంటుందని అన్నారు. శుక్రవారం మీడియా ప్రతినిధులతో అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ.. 'నేను ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో చర్చలు ప్రారంభించాను. అవి చాలా ముఖ్యమైన చర్చలు. ఎందుకంటే ఇరాన్ దగ్గర అణ్వాయుధం ఉండటానికి వీలులేదు. ఈ యుద్ధం త్వరలోనే ముగుస్తుందని భావిస్తున్నాను. వారు ఎక్కువ కాలం యుద్ధాన్ని కొనసాగించలేరని అనుకుంటున్నానన్నారు. ఇరాన్‌తో యుద్ధం కారణంగా అమెరికా వద్ద దీర్ఘశ్రేణి క్షిపణులు, వైమానిక రక్షణ వ్యవస్థలకు సంబంధించిన నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయని వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలపై ట్రంప్ క్లారిటీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. 'మా వద్ద కొన్ని రకాల ఆయుధాలు ఉన్నాయి. అవి చాలా శక్తివంతమైనవి. వాటి నిల్వలు మా దగ్గర అపరిమితంగా ఉన్నాయి. అయితే, మరికొన్ని రకాల ఆయుధాల విషయంలో మాత్రం నిల్వలు కొద్దిగా తక్కువగా ఉన్నాయన్నారు.

# థాయ్ స్కూల్లో విద్యార్థి కాల్పులు

**- ఏడుగురు మృతి, 15 మందికి గాయాలు**

**- అంతకుముందు బామ్మ, తాతను కాల్చి చంపిన బాలుడు**



థాయ్‌లాండ్‌లోని ఓ స్కూల్లో కాల్పులు కలకలం సృష్టించాయి. నొంతగురి ప్రావిన్స్ బాంగ్ క్రువాయ్ జిల్లాలోని డెబ్సిరిన్ స్కూల్లో తొమ్మిదో తరగతి విద్యార్థి.. తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు టీచర్లు, ముగ్గురు విద్యార్థులు ఉన్నారు. కాల్పులు జరిపిన విద్యార్థి కూడా తనను తాను కాల్చుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై థాయ్ ఉప ప్రధాని అనుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని.. స్కూల్పై దాడికి గల కారణాలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఇంట్లోవారిని హత్య చేసి..**

*కాల్పులకు పాల్పడ్డ విద్యార్థి స్కూల్‌కు వెళ్లడానికి ముందు ఇంట్లో తన బామ్మ, తాతలను కూడా కాల్చి చంపినట్లు థాయ్‌లాండ్ ప్రజారోగ్య మంత్రి తెలిపారు. కాల్పులకు ఉపయోగించిన 9 ఎంఎం హ్యాండ్‌గన్ అతడి తాతకు చెందినదిగా గుర్తించామన్నారు. విద్యార్థి తాత కూడా గతంలో ఉపాధ్యాయుడిగా పని చేసినట్లు తెలిపారు.*

స్పోర్ట్స్
చైతన్యరథం

# వీడ్కోలు పలికి 13 ఏళ్లు.. అయినా చెక్కు చెదరని సచిన్ బ్రాండ్!



క్రికెట్‌కు వీడ్కోలు పలికి 13 ఏళ్లు గడిచినా భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ బ్రాండ్ విలువ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. అంతర్జాతీయ క్రికెట్లో సచిన్ టెండూల్కర్ సృష్టించిన రికార్డులకు కొదవే లేదు. అభిమానులు ఆయన్ను 'క్రికెట్ దేవుడు' అని పిలుచుకుంటారు. అందుకే ఆటకు వీడ్కోలు పలికి ఇన్నేళ్లవుతున్నా ఆయన పట్ల దేశవ్యాప్తంగా అభిమానం అలాగే నిలిచిపోయింది. ఆయన బ్రాండ్ విలువ ఏ మాత్రం తగ్గలేదు. నిరంతరం ఏదో ఒక ప్రకటనలో సచిన్ ను చూస్తుంటాం. బ్రాండ్ విలువలో మిగతా అథ్లెట్లకు 'తగ్గేదేలే అని సవాల్ విసురుతున్నారు.

క్రోల్ ఇండియా సెలబ్రిటీ బ్రాండ్ వాల్యుయేషన్-2025 నివేదిక ప్రకారం సచిన్ బ్రాండ్ విలువ 125.9 మిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు రూ.1,189 కోట్లు)గా నమోదైంది. ఈ విలువతో దేశంలోని టాప్-5 సెలబ్రిటీ బ్రాండ్లలో సచిన్ చోటు దక్కించుకున్నాడు. అంతేకాదు, భారత టాప్-10 సెలబ్రిటీ బ్రాండ్లలో నిరంతరం కొనసాగుతున్న ఏకైక రిటైర్డ్ క్రీడాకారుడిగా సచిన్ ప్రత్యేక గుర్తింపు పొందాడు. విరాట్ కోహ్లీ, ధోని కంటే కూడా ఎక్కువ బ్రాండ్‌లకు అంబాసిడర్‌గా సచిన్ వ్యవహరిస్తుండటం విశేషం.

**24 ఏళ్ల కెరీర్..**

ప్రస్తుతం సచిన్ వయసు 53 ఏళ్లు. అంతర్జాతీయ క్రికెట్లో దాదాపు 24 ఏళ్లపాటు కొనసాగిన ఆయన 2013 లో వీడ్కోలు పలికారు. ఆటకు దూరమైనప్పటికీ.. ప్రకటనల్లో కనిపిస్తూ భారీగానే ఆదాయం ఆర్జిస్తున్నారు. ప్రతి సంవత్సరం అతడి విలువ పెరుగుతూనే ఉంది. ప్రజల్లో అపారమైన నమ్మకం, విశ్వసనీయతే అందుకు కారణంగా నివేదిక పేర్కొంది. ప్రస్తుత క్రీడాకారులు చాలా మంది ఉన్నప్పటికీ..వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు ఇప్పటికీ సచిన్‌ను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. రిటైర్ అయిన తర్వాత కూడా అతడి బ్రాండ్ విలువ ఏటా పెరుగుతుండటం విశేషం.

# వార్మప్ మ్యాచ్‌లో తేలిపోయిన భారత బౌలర్లు

**- ప్రభావం చూపని పేసర్లు**
**- శ్రీలంక XI 363/8**




శ్రీలంక XIతో శుక్రవారం మొదలైన వార్మప్ మ్యాచ్‌లో భారత బౌలర్లు తేలిపోయారు. తొలి రోజు ఆట ముగిసే సరికి శ్రీలంక XI ఎనిమిది వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది. క్రీజ్‌లో కేషర నువాంత (9), దిలుమ్ సుదీరా (1) ఉన్నారు. నిషాన్ మదుష్క (66), రవిందు రసాంత (71), సోనాల్ దినుష (51) అర్ధశతకాలతో అలరించారు. పవన్ రత్నాయకే (39), విక్రమసింఘె (31), పసిందు సూరియబండారా (35) ఫర్వాలేదనిపించారు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 2, కుల్దీప్ యాదవ్ 2, మానవ్ సుతార్ 2, గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ తీశారు.

టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన శ్రీలంక XI జట్టుకు ఓపెనర్లు నిషాన్, రవిందు మంచి ఆరంభం ఇచ్చారు. తొలి వికెట్‌కు 110 పరుగులు జోడించారు. భారత పేస్ బౌలర్లు సిరాజ్, ప్రసిద్ధ్‌కు ఒక్క వికెట్ కూడా దక్కలేదు. వీరిద్దరూ 21 ఓవర్లు వేసి 76 పరుగులు ఇచ్చారు. స్టార్ పేసర్ బుమ్రా లేకుండానే శ్రీలంకతో భారత్ టెస్టు సిరీస్‌ను ఆడనుంది. ఈ క్రమంలో పేస్ బౌలర్లకు వార్మప్ మ్యాచ్‌లో ఒక్క వికెట్ కూడా పడక పోవడం భారత శిబిరంలో కాస్త ఆందోళన కలిగించేదే. కొత్త బౌలర్ సారాంశ్ జైన్ (11-0-54-0) కూడా ఇబ్బంది పడ్డాడు. అయితే కుల్‌దీప్‌తో పాటు జడేజా, సుతార్ నాణ్యమైన బౌలింగ్‌తో వికెట్లు దక్కాయి.



# భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద అద్భుత విజయం

**- సెయింట్ లూయిస్ రాపిడ్ అండ్ బ్లిట్జ్ టైటిల్ కైవసం**

*భారత గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద అద్భుత విజయం సాధించాడు. తొలిసారిగా సెయింట్ లూయిస్ రాపిడ్ అండ్ బ్లిట్జ్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. మరో రౌండ్ మిగిలి ఉండగానే అతడు ఈ ఘనత సాధించడం విశేషం. చెన్నైకి చెందిన 20 ఏళ్ల ప్రజ్ఞానంద ఇప్పటికే ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందుకున్నాడు. తాజాగా సెయింట్ లూయిస్ రాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీలోనూ అదరగొట్టాడు. అమెరికాలో జరిగిన మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జొవోఖిర్ సిందరోవ్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకున్న ప్రజ్ఞానంద.. మొత్తంగా 23.5 పాయింట్లు తన ఖాతాలో జమచేసుకున్నాడు.*

**అగ్రస్థానంలో**

*మిగతా ఆటగాళ్ల కంటే ఒకటిన్నర పాయింట్లు ఎక్కువగా కలిగి ఉండటంతో.. మరో రౌండ్ మిగిలి ఉండగానే ప్రజ్ఞానంద విజేతగా అవతరించాడు. పాయింట్ల పరంగా ప్రజ్ఞానంద అగ్రస్థానంలో నిలవగా.. సిందరోవ్ 22 పాయింట్లతో రెండు, అమెరికా గ్రాండ్ మాస్టర్ విస్లే 20.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు.*

*ఇక సెయింట్ లూయిస్ రాపిడ్ అండ్ బ్లిట్జ్ టైటిల్ గెలుపుతో ఓవరాల్ గ్రాండ్ చెస్ టూర్ పాయింట్ల పట్టికలో ప్రజ్ఞానంద రెండో స్థానానికి చేరుకున్నాడు. తద్వారా జీసీటీ ఫైనల్స్‌కు చేరుకునే మార్గం సుగమం చేసుకున్నాడు. ఇదిలా ఉంటే.. ఈ ఏడాది ప్రజ్ఞానంద నార్వే చెస్ టైటిల్ కూడా గెలిచిన విషయం తెలిసిందే.*

# గిల్‌కు గాయం!




శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టును గాయాల సమస్య వెంటాడుతోంది. సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ గాయాల నుంచి కోలుకుంటున్నారు. మరోవైపు స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా మోకాలి సమస్య కారణంగా ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే శ్రీలంక టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. ఈ క్రమంలో భారత జట్టు అభిమానులకు ఆందోళన కలిగిస్తూ టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయపడ్డాడు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు.. వార్మప్ మ్యాచ్ కోసం గురువారం ప్రాక్టీస్ చేస్తుండగా గిల్ చేతి వేలికి గాయమైనట్లు బీసీసీఐ తెలిపింది. దీంతో శుక్రవారం మొదలైన వార్మప్ మ్యాచ్‌లో గిల్ బరిలోకి దిగలేదు. అతడి స్థానంలో కేఎల్ రాహుల్ జట్టుకు నాయకత్వం వహించాడు. ఈ విషయాన్ని బీసీసీఐ ఎక్స్ వేదికగా పేర్కొంది. 'ప్రాక్టీస్ చేస్తుండగా గిల్ కుడి చేతి బొటనవేలికి గాయమైంది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా శ్రీలంక ఎలెవన్‌తో వార్మప్ మ్యాచ్ తొలి రోజు గిల్ మైదానంలోకి దిగలేదు. అతడికి బదులు కేఎల్ రాహుల్ నాయకత్వం వహిస్తాడు. బీసీసీఐ వైద్య బృందం గిల్ గాయంపై పర్యవేక్షిస్తోంది' అని బీసీసీఐ తెలిపింది.

వార్మప్ మ్యాచ్ రెండో రోజు శనివారం గిల్ ఫిట్‌గా ఉంటే బరిలోకి దిగే అవకాశం ఉంది. అదీ సాధ్యం కాకపోతే.. నేరుగా 15 నుంచి శ్రీలంకతో జరగనున్న తొలి టెస్టులోనే ఆడతాడు.

# శ్రీలంకకూ గాయాల బెడద

**తొలిటెస్ట్‌కు నిశాంక దూరం**




టీమిండియాతో టెస్టు సిరీస్‌కు ముందు శ్రీలంకనూ గాయాల బాధ వెంటాడుతోంది. గాయపడ్డ వారి జాబితాలో తాజాగా డాషింగ్ ఓపెనర్ పాథుమ్ నిశాంక కూడా చేరాడు. ఇప్పటికే స్టార్ వికెట్ కీపర్ కుశాల్ మెండిస్ తొడ కండరాల గాయం కారణంగా భారత్‌తో టెస్టు సిరీస్ నుంచి వైదొలగే పరిస్థితి ఏర్పడగా.. తాజాగా ఈ జాబితాలో నిశాంక కూడా చేరాడు. మణికట్టు గాయం కారణంగా ఆగస్టు 15న ప్రారంభం కానున్న తొలి టెస్ట్‌కు నిశాంక దూరం కానున్నట్లు తెలుస్తోంది. దీర్ఘకాలంగా వేధిస్తున్న మణికట్టు సమస్యను పరిష్కరించుకోవడానికి గత నెలలో నిశాంక శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఈ క్రమంలోనే అతడు లంక ప్రీమియర్ లీగ్-2026కు దూరమయ్యాడు. అయితే భారత్‌తో టెస్టు సిరీస్ సమయానికి నిశాంక కోలుకుంటాడని లంక సెలక్టర్లు భావించారు. కానీ అతడి పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి మరింత సమయం పట్టనుంది. దీంతో తొలి టెస్టు కోసం జట్టు సెలక్షన్‌కు అతడు అందుబాటులో ఉండటం లేదు. మరోసారి ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించి అందులో ఉత్తీర్ణుడైతే రెండో టెస్టులో నిశాంక ఆడే అవకాశముంది. ఇక వీరిద్దరి స్థానాలని భర్తీ చేసేందుకు నిషాన్ మధుష్క, పసిందు సూరియబండార, అంజలా బండార వంటి యువ ఆటగాళ్ల పేర్లను సెలక్టర్లు పరిశీలిస్తున్నారు.

## కొరియన్ భాష కూడా నేర్చుకున్నా..



'కొరియన్ కనకరాజు' సినిమాలో రెండు విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రను పోషించే అవకాశం రావడం ఓ నటుడిగా చాలా సంతృప్తినిచ్చిందని హీరో వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా మేర్లపాక గాంధీ తెరకెక్కించిన చిత్రమిది. యూవీ ప్రొడక్షన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించాయి. సినిమా శుక్రవారం విడుదలయి హిట్ టాక్ తెచ్చుకున్న సందర్భంగా వరుణ్‌తేజ్ మీడియాతో మాట్లాడారు. నాకు కొడుకు పుట్టిన తరువాత ఈ విజయం రావడం ఆనందంగా ఉంది. కామెడీకి స్కోప్ ఉన్న చిత్రాలను చేయాలని చాలా కాలంగా ఎదురుచూస్తున్నాను.. ఆ సమయంలో గాంధీ చెప్పిన ఈ కథలోని వినోదం, వైవిధ్యం నాకు నచ్చడంతో వెంటనే ఓకే చేశా. మొదటి సన్నివేశం నుంచి ముగింపు వరకూ ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు. ఇందులో నేను పోషించిన పాత్రలు నటుడిగా నాకు సవాల్ విసిరాయి. ఈ పాత్ర కోసం రాయలసీయ యాసతో పాటు కొరియన్ భాష కూడా నేర్చుకున్నా. మేర్లపాక గాంధీ విజన్, టేకింగ్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. రితికా నాయక్, సత్య పాత్రలు కథలో కీలకంగా ఉంటాయి. తమన్ ఇచ్చిన పాటలు ఇప్పటికే మంచి ఆదరణ పొందాయి. థియేటర్‌లో చూసినప్పుడు విజువల్‌గా మరింత గొప్ప అనుభూతిని ఇస్తాయి. ఇందులో ఫన్‌తో పాటు యాక్షన్ సన్నివేశాలు కూడా అందర్నీ అలరిస్తాయి. ప్రస్తుతం చేస్తున్న 'బరి' పూర్తిగా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగుతుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందని చెప్పారు.




## 'రామాయణ'కు ఆస్కార్ ఖాయం..

నితేశ్ తివారీ దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణ' సినిమాపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ చిత్రం కచ్చితంగా ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటుందని అన్నారు. ఈ సినిమాకు ఆస్కార్ అవార్డు దక్కకపోతే తను తీవ్రంగా నిరాశ చెందుతానని ఆయన వ్యాఖ్యానించారు. నమిత్ మల్హోత్రా ప్రారంభించిన ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇది సాధారణ సినిమా కాదు.. కొన్ని వేల సంవత్సరాలు గుర్తుండిపోయే చిత్రం" అని ప్రశంసించారు. రెండు భాగాలుగా రాబోతున్న ఈ చిత్రం భారతీయ సినిమా స్థాయిని ప్రపంచ వేదికపై సరికొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాంటి సినిమాకు ఆస్కార్ రాకపోతే అవార్డు జ్యూరీ విషయంలో నేను నిరాశ పడతాను. భారతీయ సినిమా స్థాయిని ప్రపంచ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే శక్తి ఈ చిత్రానికి ఉందన్నారు.

గతంలో కూడా ఫడణవీస్ ఈ చిత్రంపై ప్రశంసలు కురిపించారు. 'భారతీయ సంస్కృతి, పురాణాలు, కళలు, సంగీతానికి ఆధునిక సాంకేతికతను జోడించి ప్రపంచ ప్రేక్షకులకు అందించే ప్రయత్నమే 'రామాయణ' సినిమా. ఈ సినిమా సెట్స్‌ను ప్రధాని మోదీతో కలిసి సందర్శించినప్పుడు వాటి నిర్మాణ వైభవం చూసి ఆశ్చర్యపోయాను. కొత్త తరానికి భారతీయ ఇతిహాసాలను చేరవేయడానికి ఇలాంటి భారీ చిత్రాలే సరైన వేదిక అవుతాయన్నారు.

రణ్‌బీర్ కపూర్ రాముడుగా, సాయి పల్లవి సీతగా, యశ్ రావణుడిగా నటిస్తున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తొలి భాగం నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి విడుదల కానుంది. రెండో భాగం ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయింది.


## నెట్‌ఫ్లిక్స్‌లో 'ధురంధర్' రికార్డు



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ధురంధర్' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్దే కాకుండా ఓటీటీలోనూ అదరగొడుతోంది. ఈ ఏడాది నెట్‌ఫ్లిక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది వీక్షించిన ఆంగ్లేతర (నాన్-ఇంగ్లిష్) చిత్రంగా ఇది నిలిచింది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ కో-సీఈవో టెడ్ సరాండోస్ ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో వెల్లడించారు. భారతీయ కంటెంటుకు ప్రపంచస్థాయిలో పెరుగుతున్న ఆదరణను ఆయన ప్రశంసించారు. ఈ ఏడాది ప్రపంచంలోనే అత్యధిక మంది చూసిన నాన్- ఇంగ్లిష్ సినిమా 'ధురంధర్'. ఎన్నో ఇంగ్లిష్ సినిమాల కంటే కూడా దీనికే విశేష ఆదరణ దక్కింది. 2026 జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో ఈ సినిమా ఏకంగా 3.7 కోట్ల (37 మిలియన్ల) వ్యూస్ సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా 22 దేశాల్లో నెట్‌ఫ్లిక్స్ టాప్ చార్టుల్లో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా 'ధురంధర్' రెండు భాగాలు కలిపి ఏకంగా రూ.3,100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టాయి. సీక్వెల్‌గా వచ్చిన 'ధురంధర్: ది రివెంజ్' మరో అరుదైన ఘనత సాధించింది. భారత్‌లో రూ.1,000 కోట్ల నెట్ వసూళ్లు సాధించిన తొలి బాలీవుడ్ చిత్రంగా రికార్డులకెక్కింది. నెట్‌ఫ్లిక్స్ 'స్క్విడ్ గేమ్', 'మనీ హేస్ట్' లాంటి అద్భుతాలు సృష్టించే సమయం భారత్‌కు ఎప్పుడు వస్తుందని నన్ను చాలామంది అడుగుతుంటారు. ఇండియాలో అలాంటి మూమెంట్స్ ఎప్పుడూ ఉంటాయని నేను చెబుతాను. ముఖ్యంగా ఇక్కడి సినిమాల్లో ఆ మ్యాజిక్ ఎక్కువగా కనిపిస్తుంది. భారతీయ సినిమాకు సుదీర్ఘమైన. గొప్ప చరిత్ర ఉంది" అని సరాండోస్ వివరించారు.

'ధురంధర్' తొలి భాగం 2025 డిసెంబరులో థియేటర్లలో విడుదలై ఘన విజయం సాధించింది. ఆ తర్వాత సీక్వెల్ విడుదలకు ముందు నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అయింది. ఇక ఈ ఏడాది మార్చిలో విడుదలైన రెండో భాగం 'ధురంధర్: ది రివెంజ్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌తో పాటు జియో హాట్‌స్టార్‌లోనూ స్ట్రీమింగ్ అవుతోంది.

## తండ్రీ, కొడుకుల సరదా గొడవల 'పళ్ల బురుసు'



టూత్ బ్రష్ నేపథ్యంలో సాగే సరదా సినిమా 'పళ్ల బురుసు'. టూత్ బ్రష్ కొనివ్వలేదని ఓ తండ్రి తన కొడుకుపై పోలీస్ కంప్లైంట్ ఇస్తే.. ఆ తర్వాత ఏమైందనే ఆసక్తికర కథాంశంతో తెరకెక్కిన చిత్రం ఇది. తండ్రీ కొడుకుల మధ్య సరదా గొడవలతో సాగే ఈ సినిమాకు ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించారు. ఆగస్ట్ 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దీని ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఎమోషనల్ రూరల్ డ్రామాగా దీని తీర్చిదిద్దినట్లు ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.



## వేదికలపై జాగ్రత్తగా మాట్లాడాలి..

రాజకీయ నాయకులు బహిరంగ వేదికలపై మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని నటుడు విశాల్ అన్నారు. తన తాజా చిత్రం 'మగుడం' (తెలుగులో మకుటం) ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ఇటీవల నటి త్రిషపై చేసిన వ్యాఖ్యలు, ఆయన అరెస్ట్‌పై విశాల్ మాట్లాడారు. నేను ఉదయనిధి ప్రసంగాన్ని చూశాను.

వాక్ స్వాతంత్ర్యం అందరికీ ఉంటుంది. కానీ, మనం కొన్ని విషయాలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా రాజకీయ ప్రసంగాల్లో ముందుగా రాసుకున్నవి చెబితే ఇలాంటివి ఎదురుకావు. అప్పటికప్పుడు సహజంగా మాట్లాడేటప్పుడు కొంచెం జాగ్రత్త వహించాలి. లయోలా కాలేజీలో నా సీనియర్ (విజయ్).. నా బ్యాచ్‌మేట్ (ఉదయనిధి)ని ఇలా ఒకరోజు అరెస్ట్ చేస్తారని కలలో కూడా ఊహించలేదు. విజయ్ ఇప్పుడు రాజకీయాల్లో ఉన్నారు.

ఇదంతా అందులో భాగమే. ఇదే అసలు రాజకీయం అంటే అని విశాల్ అన్నారు. మరోవైపు విశాల్ రాజకీయాల్లోకి రానున్నారనే వార్తలు తమిళనాట జోరుగా ప్రచారమవుతున్నాయి. సినిమాల ద్వారా ఇప్పటి వరకూ తెచ్చుకున్న మంచి పేరును ప్రజా సేవకు ఉపయోగించాలని అనుకుంటున్నట్లు ఇటీవల ఓ వేదికపై విశాల్ చెప్పడంతో ఆ ప్రచారానికి మరింత బలం చేకూరింది.

## విజయ్ భార్య.. విడాకుల పిటిషన్ ఉపసంహరణ

తమిళనాడు ముఖ్యమంత్రి, స్టార్ హీరో విజయ్ విడాకుల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. గత కొంతకాలంగా చర్చనీయాంశంగా మారిన విజయ్- సంగీత విడాకుల కేసుకు చెంగల్పట్టు కుటుంబ న్యాయస్థానం తెరదించింది. విజయ్ భార్య సంగీత తన విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో కోర్టు కేసును ముగించింది. కొన్ని నెలలుగా ఈ కేసు పలుమార్లు విచారణకు వచ్చినప్పటికీ వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా జరిగిన విచారణలో సంగీత తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని నిర్ణయించినట్లు కోర్టుకు తెలియజేశారు. దీంతో చెంగల్పట్టు కుటుంబ న్యాయస్థానం విడాకుల కేసును అధికారికంగా ముగించింది. విజయ్ తరఫు న్యాయవాదులు గత విచారణల్లో తమిళనాడు శాసనసభ సమావేశాలు, ముఖ్యమంత్రి హోదాకు సంబంధించిన అధికారిక బాధ్యతలు, భద్రతా కారణాల వల్ల వ్యక్తిగత హాజరు కావడానికి ఇబ్బందులు ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు సంగీత తరఫు న్యాయవాది కూడా విచారణను వేగవంతం చేయాలని కోరారు. అయితే తాజా పరిణామంతో కేసు పూర్తిగా ముగిసింది.

